www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 13-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 27 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి రా. 2.51 తదుపరి సప్తమి; నక్షత్రం: పునర్వసు ఉ. 11.23 తదుపరి పుష్యమి; వర్జ్యం: రా.7.57-9.39; దుర్ముహూర్తం: మ.12.37-1.28, మ.3.10-4.01; అమృతఘడియలు: ఉ.8.53-10.33; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 5.47; సూర్యాస్తమయం: 6.35 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బిజినెస్

హైదరాబాద్ ● సోమవారం 13 మే 2024

గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి రూ.396 కోట్లు ఉపసంహరణ

న్యూఢిల్లీ: బంగారం ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్) ల్లోనూ లాభాల స్వీకరణ ప్రారంభమైంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో మదుపరులు ఈ పథకాల నుంచి రూ.396 కోట్ల నికర పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. గత ఏడాది మార్చి తర్వాత మదుపరులు గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం ఇదే మొదటిసారి. పసిడి ధర పెరగడంతో లాభాల స్వీకరణ కోసం ఈ అమ్మకాలు జరిగాయని భావిస్తున్నారు. అయినా ఏప్రిల్ నెలాఖరుకు గోల్డ్ ఈటీఎఫ్ పథకాల నిర్వహణలోని పెట్టుబడుల విలువ (ఏయూఎం) అంతకు ముందు నెలతో పోలిస్తే ఐదు శాతం పెరిగి రూ.32,789 కోట్లకు చేరాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



13వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	540
వరంగల్	537	గోదావరి	540
చిత్తూరు	608	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	135	గోదావరి	145
వరంగల్	135	విజయవాడ	145
కరీంనగర్	135	గుంటూరు	145
మహబూబ్‌నగర్	135	ఒంగోలు	145
కర్నూలు	135	చిత్తూరు	150
విశాఖపట్నం	137		

ఈ ఏడాది 12,000 కొలువులు

ఇందులో 85 శాతం మంది ఇంజనీర్లే .. టెక్నాలజీ అప్‌గ్రేడేషన్‌పైనే దృష్టి

ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ ఖారా



ముంబై: ప్రభుత్వ రంగంలోని భారతీయ స్టేట్‌బ్యాంక్ (ఎస్‌బీఐ) పెద్దఎత్తున ఉద్యోగుల నియామకానికి సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఎంత లేదన్నా 12,000 నియామకాలు ఉంటాయని బ్యాంక్ చైర్మన్ దినేశ్ ఖారా చెప్పారు. ఇందులో 85 శాతం మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లే ఉంటారన్నారు. ఐటీ రంగంలో ఫ్రెషర్స్ నియామకాలు తగ్గిన నేపథ్యంలో ఎస్‌బీఐ ఇలా పెద్దఎత్తున ఇంజనీర్ల నియామకానికి సిద్ధమవడం విశేషం. ప్రొబేషనరీ ఆఫీసర్లు, అసోసియేట్ల పోస్టుల్లో ఈ నియామకాలు ఉంటాయని ఖారా చెప్పారు. 'కొత్త ఉద్యోగులకు ముందుగా బ్యాంకింగ్ విధి విధానాల్లో శిక్షణ ఇస్తాం. తర్వాత వారి యోగ్యత, ఆసక్తిని బట్టి ఐటీ, వివిద వ్యాపార బాధ్యతల్లో నియమిస్తాం. దీనివల్ల బ్యాంక్‌కు నిరంతరం టెక్నాలజీ నైపుణ్యాలు ఉన్న మానవ వనరులు అందుబాటులో ఉంటాయి' అని ఆయన అన్నారు. సరికొత్త టెక్నాలజీతో ఖాతాదారులను ఆకర్షించేందుకు బ్యాంకులు పోటీపడుతున్న సమయంలో ఎస్‌బీఐ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల నియామకాలపై దృష్టి పెట్టడం విశేషం.

టెక్నాలజీనే కీలకం: బ్యాంకుల నిర్వహణకు టెక్నాలజీ అత్యంత ముఖ్యమని ఎస్‌బీఐ చైర్మన్ స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరూ ఈ విషయాన్ని ఏ మాత్రం విస్మరించలేరన్నారు. బ్యాంకింగ్ రంగంలో టెక్నాలజీ వినియోగానికి సంబంధించి భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కూడా ఎప్పటికప్పుడు మార్గదర్శకాలు జారీ చేస్తూ.. టెక్నాలజీ వినియోగంలో వెనకబడిన బ్యాంకులపై పెనాల్టీలు విధిస్తున్న విషయాన్ని ఖారా గుర్తు చేశారు.

టెక్నాలజీపై భారీగా ఖర్చు: టెక్నాలజీ అప్‌గ్రేడేషన్ కోసం ఎస్‌బీఐ ఎంత ఖర్చు చేస్తోందన్న విషయాన్ని వెల్లడించేందుకు దినేశ్ నిరాకరించారు. అయితే ఇది ఇతర బ్యాంకుల కంటే ఎక్కువే ఉంటుందన్నారు. ప్రస్తుతం దేశీయ బ్యాంకులు తమ నిర్వహణ ఖర్చుల్లో సగటున 7 నుంచి 8 శాతం టెక్నాలజీ అప్‌గ్రేడేషన్ కోసం ఖర్చు చేస్తున్నాయి. అయితే ఎస్‌బీఐ చైర్మన్ మాటలను బట్టి చూస్తే బ్యాంక్ ఇంత కంటే ఎక్కువే ఖర్చు చేస్తోందని భావించాలి.

ఎస్కార్ట్స్ కుబోటా రూ.4,500 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ: వ్యవసాయ, నిర్మాణ రంగ పరికరాల తయారీ సంస్థ ఎస్కార్ట్స్ కుబోటా కొత్త ప్లాంట్ ఏర్పాటుపై రాబోయే మూడు, నాలుగు సంవత్సరాల కాలంలో రూ.4,500 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. రాజస్థాన్‌లోని ఘిలోత్‌లో ఏడాదికి 3.4 లక్షల ట్రాక్టర్ల తయారీ సామర్థ్యంతో కొత్త ప్లాంట్ ఏర్పాటు చేయడానికి స్థలం కోసం ఆ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతోంది. తదుపరి దశలో ఈ ప్లాంట్‌లో కొత్తగా ఇంజన్లు, నిర్మాణ రంగపరికరాల తయారీ కోసం ప్రత్యేక లైన్లు కూడా నిర్మించనుంది. ఈ ఏడాది ఆ స్థలం తాము కొనుగోలు చేయగలమనుకుంటున్నట్టు కంపెనీ సీఎఫ్‌ఓ, హోల్ టైమ్ డైరెక్టర్ భరత్ మదన్ చెప్పారు. స్థలానికి రూ.400 నుంచి 450 కోట్ల వరకు ఖర్చు కావచ్చని తెలిపారు. ప్రస్తుతం ఫరీదాబాద్ ప్లాంట్‌లో ఉత్పత్తి సామర్థ్యం ఏడాదికి 1.7 లక్షల ట్రాక్టర్లని, వీటికి అవసరమైన కుబోటా ఇంజన్లను దిగుమతి చేసుకుంటున్నామని భరత్ వెల్లడించారు.

చైనానే భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి

» 2023-24లో ఇరు దేశాల మధ్య వాణిజ్యం రూ.9.88 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నా భారత-చైనా ద్వైపాక్షిక వాణిజ్య మూడు పువ్వులు, ఆరు కాయల్లా వర్ధిల్లుతోంది. గత ఆర్థిక పసంవత్సరం (2023-24) చైనా అమెరికాను తోసిపుచ్చి.. భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా అవతరించింది. ఈ కాలంలో రెండు దేశాల వాణిజ్యం 11,840 కోట్ల డాలర్లకు (సుమారు రూ.9.88 లక్షల కోట్లు) చేరింది. ఇదే సమయంలో 11,830 కోట్ల డాలర్లతో (సుమారు రూ.9.87 లక్షల కోట్లు) అమెరికా రెండో స్థానానికి పడిపోయింది. 2021-23 మధ్య కాలంలో అమెరికా మన దేశానికి అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉండేది. ఇప్పుడు ఆ స్థానాన్ని చైనా ఆక్రమించింది. గత ఆర్థిక సంవత్సరం చైనా మన దేశానికి 10,170 కోట్ల డాలర్ల (సుమారు రూ.8.49 లక్షల కోట్లు) విలువైన సరుకులు ఎగుమతి చేసి.. మన దేశం నుంచి 1,667 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.39 లక్షల కోట్లు) సరుకులను మాత్రమే దిగుమతి చేసుకుంది. 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2023-24 ఆర్థిక సంవత్సరంలో మన దేశానికి చైనా ఎగుమతులు 3.24 శాతం మాత్రమే పెరిగినా.. అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఎదగడం విశేషం.

ఈ ఏడాది సీఎన్‌జీ కార్లదే జోరు

మారుతి సుజుకీ

న్యూఢిల్లీ: ఈ ఏడాది సీఎన్‌జీ కార్ల అమ్మకాలు 30 శాతం పెరిగి 6 లక్షల యూనిట్లకు చేరుకోవచ్చని భావిస్తున్నట్టు మారుతి సుజుకీ తెలిపింది. అలాగే ఈ ఏడాది 3 లక్షల కార్లను ఎగుమతి చేసే ఆస్కారం ఉన్నట్టు చెబుతోంది. వ్యాగన్ ఆర్, బ్రెజ్జా, డిజైర్, ఎర్టిగాల్లో సీఎన్‌జీ మోడళ్లను కంపెనీ విక్రయిస్తోంది. మనేసార్ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరో లక్ష యూనిట్లకు పెంచనున్నట్టు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాహుల్ భారతి చెప్పారు. ఈ ప్లాంట్ ఎర్టిగా సరఫరాకు ప్రధానంగా మద్దతు ఇస్తుందని, ఎర్టిగా సీఎన్‌జీ కారుకు డిమాండ్ భారీగా ఉన్నందు వల్ల సరఫరా సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. హరియాణాలోని కర్ఖోడాలో నిర్మాణంలో ఉన్న ప్లాంట్.. తమ ఆకాంక్షాపూరితమైన వృద్ధి ప్రణాళికలో ఆ ప్లాంట్ ఒక భాగమని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ ప్లాంట్ నిర్మాణం ప్రారంభమైందని, ఏటా రెండున్నర లక్షల కార్ల ఉత్పత్తి సామర్థ్యం గల ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి 2025లో ప్రారంభం కావచ్చని చెప్పారు. కాగా 10 లక్షల వరకు కార్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించగల నాలుగు ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన స్థలం కర్ఖోడాలో అందుబాటులో ఉందని రాహుల్ తెలిపారు.

22,355 పైన బుల్లిష్

(మే 13-17 తేదీల మధ్య వారా



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం 22,476-21,932 పాయింట్ల మధ్యన కదలాడి గత వారంతో పోల్చితే 421 పాయింట్ల నష్టంతో 22,055 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,355 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 22,115, 22,305, 22,422, 22,420 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,355 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 21,750

నిరోధ స్థాయిలు : 22,255, 22,355, 22,455 (22,155 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు : 21,850, 21,750, 21,650

జర జాగ్రత్త!

ఈ వారం ట్రేడర్లు, ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండటం మంచిది. రఫాపై ఇజ్రాయెల్ తీవ్రంగా విరుచుకుపడుతుండటంతో పాటు కంపెనీల ఆర్థిక ఫలితాలు ఆశించిన స్థాయిలో ఉండకపోవటం వంటివి మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నాయి. మరోవైపు సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై అనిశ్చితి నెలకొంది. ఇదే సమయంలో విదేశీ సంస్థాగత మదుపరులు నిధులను పెద్దఎత్తున ఉపసంహరించుకుంటున్నారు. ఈ నెల 2 నుంచి ఇప్పటి వరకు రూ.25,000 కోట్లు ఉపసంహరించుకున్నారు. కాగా నిఫ్టీకి 22,000 వద్ద మద్దతు, 22,550వద్ద నిరోధ స్థాయిలున్నాయి. ఇండియా విక్స్ పెరుగుదల బేర్స్ పట్టును సూచిస్తోంది.

స్టాక్ రికమండేషన్స్

టాటా మోటార్స్: రెండు నెలలుగా సైడ్‌వేస్‌లో చలిస్తున్న ఈ షేరు మళ్లీ జీవితకాల నిరోధ స్థాయికి చేరుకుంది. మార్కెట్ అంచనాలను మించి ఫలితాలు విడుదల చేయటం సానుకూల అంశం. చివరి మూడు సెషన్లలో మూమెంటమ్‌ను బట్టి చూస్తే నిరోధాన్ని బ్రేక్ చేసేలా కనిపిస్తోంది. గత శుక్రవారం ఈ షేరు 1.59 శాతం లాభంతో రూ.1,046వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.1,040/1,020 స్థాయిల్లో ప్రవేశించి రూ.1,150/1,210 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.990స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఆస్ట్రాల్: గడిచిన కొన్నాళ్లుగా సైడ్‌వేస్‌లో కొనసాగుతూ వస్తున్న ఈ షేరులో ఒక్కసారిగా మూమెంటమ్ పెరిగింది. చివరి ఐదు రోజుల్లో ట్రేడింగ్, డెలివరీ సగటు వాల్యూమ్ 2.5 రెట్లు పెరిగింది. పైగా శుక్రవారం ఆల్‌టైమ్ హై రూ.2,149ని బ్రేక్ చేసింది. నిఫ్టీతో పోలిస్తే జోరు ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం ఈషేరు 4.3% లాభంతో రూ.2,159 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.2,140 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.2,260/2,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,100 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

జొమాటో: ఈ కౌంటర్ సుదీర్ఘకాలంగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. మెరుగైన త్రైమాసిక ఫలితాలు విడుదల చేస్తుందన్న అంచనాలు ఉన్నాయి. గత నెల గరిష్ఠాన్ని బ్రేక్ చేసింది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.200 శ్రేణిలో ప్రవేశించి రూ.225/255 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.185 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హీరోమోటోకార్ప్: గత ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసిక ఫలితాలు విడుదల చేసినప్పటి నుంచి ఈ కంపెనీ షేరు దూసుకుపోతోంది. మరోసారి కీలక నిరోధ స్థాయికి చేరుకుంది. రిలేటివ్ స్ట్రెంత్, డెలివరీ వాల్యూమ్ పెరుగుదలను బట్టి చూస్తే దీన్ని బ్రేక్ చేయటం ఖాయంగా కనిపిస్తోంది. గత శుక్రవారం ఈ షేరు 2.36 శాతం లాభంతో రూ.4,877 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.4,850/4,820 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.4,980/5,100 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,780 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హిందుస్థాన్ జింక్: గడచిన ఆరు వారాల నుంచి ఈ షేరు జోరును ప్రదర్శిస్తోంది. ఏకంగా 85 మేర రిటర్నులు అందించింది. డివిడెండ్ తేదీ సమీపిస్తుండటం, చైనాలో జింక్ ధరలు పెరుగుతాయన్న అంచనాలతో ఇన్వెస్టర్లు పెట్టుబడి పెడుతున్నారు. దీంతో క్రితం జీవితకాల గరిష్ఠ స్థాయి అయిన రూ.487ను బ్రేక్ చేసింది. గత శుక్రవారం ఈ షేరు 15 శాతం లాభంతో రూ.527 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.500/520 స్థాయిల్లో ప్రవేశించి రూ.555/595 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.475 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

మద్దతు స్థాయి 21,950



వి. సుందర్ రాజా

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం నెగెటివ్‌గా ప్రారంభమై 22,500 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైంది. తదుపరి క్రమంలో 22,000 కన్నా దిగజారినా శుక్రవారం మైనర్ రికవరీతో ఆ స్థాయి కన్నా పైనే ముగిసింది. అయినప్పటికీ ముందు వారంతో పోల్చితే 420 పాయింట్ల నష్టంతో వారం కనిష్ఠ స్థాయి, స్వల్పకాలిక మద్దతు స్థాయిలకు సమీపంలో ముగిసింది. గత కొద్ది నెలలుగా ఈ స్థాయిల్లో రికవరీ ఏర్పడుతోంది. గత వారం మైనర్ బ్రేక్‌డౌన్ సాధించినందు వల్ల మరింత బలహీనపడే ఆస్కారం ఉంది. కాగా గత వారం మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 1400 పాయింట్లు, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 830 పాయింట్లు నష్టపోయాయి.

గత రెండు నెలలుగా పరిమిత పరిధిలోనే కదలాడుతున్న మార్కెట్ ఇప్పుడు ఈ పరిధిలో దిగువ మద్దతు స్థాయిల్లో పరీక్ష ఎదుర్కొనే ఆస్కారం ఉంది. సానుకూలత కోసం రాబోయే కొద్ది రోజుల్లో ఈ స్థాయిలో తప్పనిసరిగా బలం ప్రదర్శించాలి. మార్కెట్లో కన్సాలిడేషన్ ఏర్పడవలసి ఉంది. 22,000 వద్ద నిలదొక్కుకుని పురోగమిస్తుందా, లేదా వేచి చూడాలి.

బుల్లిష్ స్థాయిలు: తొలుత మార్కెట్ నిలదొక్కుకోవాల్సి ఉంది. పాజిటివ్ ధోరణిలో ట్రేడయితే మరింత అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయి 22,150 కన్నా పైన నిలదొక్కుకోవాల్సి ఉంది. ఆ పైన మరో నిరోధం 22,300. సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి.

బేరిష్ స్థాయిలు: ప్రస్తుత స్థాయి 21,950 (గత రెండు సెషన్లలో ఏర్పడిన మద్దతు స్థాయి) వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే మరింత బలహీనత ఉన్నట్టుగా సంకేతం ఇస్తుంది. దిగువన మరో మద్దతు స్థాయి 21,700. ఇక్కడ కూడా విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 21,500.

బ్యాంక్ నిఫ్టీ : ఈ సూచీ గత వారం 49,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమై 1,500 పాయింట్ల మేరకు నష్టపోయి 47,400 వద్ద ముగిసింది. ఇది బలహీనత సంకేతం. రికవరీ బాట పట్టినట్టయితే ప్రధాన నిరోధ స్థాయిలు 47,600, 48,000 వద్ద కన్సాలిడేట్ కావాలి. మరింత బలహీనపడినట్టయితే దిగువన మద్దతు స్థాయిలు 46,900, 46,500.

పాటర్న్: మార్కెట్ గత వారం 50 డిఎంఏ కన్నా దిగజారింది. ఇప్పుడు 100 డిఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొనబోతోంది. గత నాలుగు నెలల్లో నిఫ్టీకి 22,000 వద్ద నాలుగు బాటమ్‌లు ఏర్పడ్డాయి.ఇప్పుడు ఐదోసారి పరీక్షకు సమాయత్తమవుతోంది.

టైమ్ : మార్కెట్ గత వారం టాప్ ఏర్పరచుకున్నట్టు కనిపిస్తోంది. స్వల్పకాలిక బలహీనత ఉండవచ్చుననేందుకు ఇది సంకేతం. ఈ సూచీ ప్రకారం గురువారం స్వల్పకాలిక రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం :	22,100, 22,150
మద్దతు :	21,950, 21,870

www.sundartrends.in

స్పోర్ట్స్

చెన్నై చమక్

ప్లేఆఫ్స్ ఆశలు సజీవం



ఐదు వికెట్లతో రాజస్థాన్‌పై విజయం

రాణించిన సిమర్‌జీత్, రుతురాజ్

చెన్నై: కీలక పోరులో చెన్నై సత్తా చాటింది. స్వస్థలంలో ఈ సీజన్‌లో జరిగిన చివరి మ్యాచ్‌లో రాజస్థాన్‌తోపై ఐదు వికెట్లతో నెగ్గిన సూపర్ కింగ్స్ ప్లేఆఫ్స్ అవకాశాలను మెరుగుపరుచుకుంది. ఆదివారం జరిగిన స్వల్ప స్కోర్ల పోరులో మొదట రాజస్థాన్ 20 ఓవర్లలో 141/5 స్కోరుకే పరిమితమైంది. రియాన్ పరాగ్ (47 నాటౌట్) టాప్ స్కోరర్. జురెల్ (28), జైస్వాల్ (24) పర్లేదనిపించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సిమర్‌జీత్ సింగ్ మూడు వికెట్లతో ప్రత్యర్థిని కట్టడి చేశాడు. తుషార్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో చెన్నై 18.2 ఓవర్లలో 145/5 స్కోరు చేసి నెగ్గింది. కెప్టెన్ రుతురాజ్ (42 నాటౌట్) అజేయంగా నిలవగా, రచిన్ (27), మిచెల్ (22) రాణించారు. అశ్విన్ రెండు వికెట్లు సాధించాడు. ఈ విజయంతో 14 పాయింట్లతో చెన్నై మూడో స్థానానికి చేరింది.

దూకుడైన ఆరంభం: బౌల్ట్ వేసిన మూడో ఓవర్లో రచిన్ 4,6 బాదడంతో చెన్నై ఛేదన దూకుడుగా సాగింది. నాలుగో ఓవర్లో రచిన్‌ను అశ్విన్ అవుట్ చేసి చెన్నైకి షాకిచ్చాడు. కానీ మిచెల్ బౌండరీలతో హోరెత్తించగా, ఆచితూచి ఆడిన రుతురాజ్ అతడితో కలిసి రెండో వికెట్‌కు 35 పరుగులు జత చేశాడు. మిచెల్‌ను స్పిన్నర్ చాహల్ ఎల్బీ చేయగా..మొయిన్ (10) కూడా త్వరగా నిష్క్రమించాడు. శివమ్ దూబే (18) తన సహజ శైలిలో మెరుపులు మెరిపించగా..జడేజా అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్ (ఫీల్డర్‌ను అడ్డుకున్నందుకు)గా రనౌటయ్యాడు. ఆపై సమీర్ రిజ్వీ (15 నాటౌట్) జతగా రుతురాజ్ చెన్నైను విజయ తీరాలకు చేర్చాడు.

దెబ్బ కొట్టిన సిమర్‌జీత్: టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్‌కు స్లో పిచ్‌పై పరుగులు చేయడం కష్టమైంది. ఓపెనర్లు జైస్వాల్, బట్లర్ ఆచితూచి ఆడి తొలి వికెట్‌కు 43 రన్స్ జోడించారు. పవర్ ప్లే తర్వాత బౌలింగ్ చేపట్టిన సమర్‌జీత్ సింగ్..తన వరుస ఓవర్లలో తొలుత జైస్వాల్‌ను, ఆపై బట్లర్‌ను అవుట్ చేశాడు. ఈ దశలో కెప్టెన్ శాంసన్, పరాగ్ మూడో వికెట్‌కు 42 పరుగులు జోడించి పరిస్థితి చక్కదిద్దారు. 15 ఓవర్లో సంజూ (15)ను పెవిలియన్ చేర్చిన సిమర్‌జీత్ మరోసారి ప్రత్యర్థికి ఝలకిచ్చాడు. ఆపై జురెల్-పరాగ్ నాలుగో వికెట్‌కు 40 పరుగులు జోడించినా.. వేగంగా రన్స్ రాబట్టలేకపోయారు. ఆఖరి ఓవర్లో వరుస బంతుల్లో జురెల్, శుభమ్ దూబే (0)ను తుషార్ అవుట్ చేయడంతో రాజస్థాన్ స్కోరు కనీసం150 కూడా చేరలేదు.

స్కోరుబోర్డు

రాజస్థాన్: జైస్వాల్ (సి) రుతురాజ్ (బి) సిమర్‌జీత్ 24, బట్లర్ (సి) తుషార్ (బి) సిమర్‌జీత్ 21, శాంసన్ (సి) రుతురాజ్ (బి) సిమర్‌జీత్ 15, పరాగ్ (నాటౌట్) 47, జురెల్ (సి) శార్దూల్ (బి) తుషార్ 28, శుభమ్ దూబే (సి) శివమ్ దూబే (బి) తుషార్ 0, అశ్విన్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 20 ఓవర్లలో 141/5; వికెట్లపతనం:** 1-43, 2-49, 3-91, 4-131, 5-131; **బౌలింగ్:** తుషార్ దేశ్‌పాండే 4-0-30-2, తీక్షణ 4-0-28-0, శార్దూల్ 4-0-32-0, సిమర్‌జీత్ సింగ్ 4-0-26-3, జడేజా 4-0-24-0.

చెన్నై: రచిన్ (సి అండ్ బి) అశ్విన్ 27, రుతురాజ్ (నాటౌట్) 42, మిచెల్ (ఎల్బీ) చాహల్ 22, మొయిన్ (సి) అవేశ్ (బి) బర్గర్ 10, శివమ్ దూబే (సి) పరాగ్ (బి) అశ్విన్ 18, జడేజా (అబ్‌స్ట్రక్టింగ్ ది ఫీల్డ్) 5, సమీర్ రిజ్వీ (నాటౌట్) 15, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 18.2 ఓవర్లలో 145/5; వికెట్లపతనం:** 1-32, 2-67, 3-86, 4-107, 5-121; **బౌలింగ్:** బౌల్ట్ 2.2-0-24-0, సందీప్ శర్మ 3-0-30-0, అశ్విన్ 4-0-35-2, నాండ్రే బర్గర్ 3-0-21-1, చాహల్ 4-0-22-1, అవేశ్ ఖాన్ 2-0-12-0.



జడేజా అవుట్ ఇలా..

జడేజా అబ్‌స్ట్రక్టింగ్ ది ఫీల్డ్ పద్ధతిలో రనౌటయ్యాడు. అవేశ్ ఖాన్ వేసిన 16 ఓవర్ ఐదో బంతిని జడేజా థర్డ్‌మ్యాన్‌వైపు కొట్టి పరుగు తీశాడు. రెండో రన్‌కోసం కూడా జడేజా ప్రయత్నించగా మరో ఎండ్‌లో ఉన్న రుతురాజ్ నివారించాడు. దాంతో జడేజా మళ్లీ వెనక్కు మళ్లాడు. ఈలోపు థర్డ్‌మ్యాన్‌లో ఉన్న ఫీల్డర్ అందించిన బంతిని బౌలింగ్ ఎండ్‌వైపు కీపర్ శాంసన్ విసిరాడు. ఈక్రమంలో..వెనక్కు మళ్లిన జడేజాకు ఆ బంతి తగిలింది. దాంతో రనౌట్‌కోసం రాజస్థాన్ అప్పీలు చేసింది. బంతి ఏ దిశలో వస్తుందో తెలిసీ జడేజా..ఆ దిశలో వెనక్కు వెళ్లాడని భావించిన అంపైర్ అతడిని అవుట్‌గా ప్రకటించాడు. ఐపీఎల్‌లో ఇలా అవుటైన మూడో ఆటగాడు జడేజా. 2013లో యూసుఫ్ పఠాన్, 2019 అమిత్ మిశ్రా కూడా ఈ విధంగానే నిష్క్రమించాడు.

ప్రజ్ఞానందకు 4, అర్జున్‌కు 5

సూపర్ బెట్ చెస్ విజేత కార్ల్‌సన్

వార్సా (పోలెండ్) : వరల్డ్ నెం.1 మాగ్నస్ కార్ల్‌సన్ సూపర్ బెట్ చెస్ టోర్నీ తొలి అంచె విజేతగా నిలిచాడు. 9 రౌండ్ల ర్యాపిడ్, 18 రౌండ్ల బ్లిట్జ్ గేమ్‌లతో కూడిన టోర్నీలో మొత్తం 26 పాయింట్లతో కార్ల్‌సన్ టైటిల్ అందుకున్నాడు. చైనాకు చెందిన వీ ఈ (25.5) రెండో స్థానంలో నిలిచాడు. ప్రజ్ఞానంద (19), అర్జున్ (18) వరుసగా నాలుగు, ఐదో స్థానాలు దక్కించుకున్నారు. గుకేష్ (12.5) పదో, ఆఖరి స్థానంతో నిరాశ పరిచాడు.. తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ 27వ, చివరి రౌండ్‌లో నార్వే సూపర్ స్టార్ కార్ల్‌సన్‌ను నిలువరించడం విశేషం. కాగా..గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా ఈ టోర్నీ మొత్తం ఐదు అంచెల్లో జరగనుంది.

నేటి మ్యాచ్

రాత్రి 7.30 గం.
వేదిక: అహ్మదాబాద్

గుజరాత్ X కోల్‌కతా

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	బుమ్రా (ముంబై)
661 (13 మ్యాచ్‌లు)	20 (13 మ్యాచ్‌లు)





పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	12	9	3	0	18	1.428
రాజస్థాన్	12	8	4	0	16	0.349
చెన్నై	13	7	6	0	14	0.528
హైదరాబాద్	12	7	5	0	14	0.406
బెంగళూరు	13	6	7	0	12	0.387
ఢిల్లీ	13	6	7	0	12	-0.482
లఖ్‌నవూ	12	6	6	0	12	-0.769
గుజరాత్	12	5	7	0	10	-1.063
ముంబై	13	4	9	0	8	-0.271
పంజాబ్	12	4	8	0	8	-0.423



దీక్ష రికార్డు ప్రదర్శన

న్యూఢిల్లీ: భారత అథ్లెట్ కేఎమ్ దీక్ష అంతర్జాతీయ వేదికపై రికార్డు ప్రదర్శనతో అదరగొట్టింది. అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో జరిగిన సౌండ్ రన్నింగ్ ట్రాక్ ఫెస్ట్‌లో మహిళల 1500 మీటర్ల రేసులో మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకం కొల్లగొట్టింది. దీక్ష ఫైనల్లో 4 నిమిషాల 04.78 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకొని సరికొత్త జాతీయ రికార్డు నెలకొల్పింది. ఈ క్రమంలో 2021 జాతీయ అథ్లెటిక్స్ మీట్‌లో 4 నిమిషాల 05.39 సెకన్లతో హర్మిలన్ బెయిన్స్ నెలకొల్పిన రికార్డును 25 ఏళ్ల దీక్ష బద్దలు కొట్టింది. ఇక, పురుషుల 5వేల మీటర్ల రేసులో భారత స్టార్ అవినాష్ సబ్లే 13:20.37 సెకన్ల టైమింగ్‌తో రెండో స్థానంలో నిలిచి రజత పతకం సాధించాడు.

ట్రిపుల్ జంప్‌లో అనూషకు స్వర్ణం



భువనేశ్వర్: జాతీయ ఫెడరేషన్ కప్ చాంపియన్‌షిప్‌లో తెలుగు అథ్లెట్ మల్లాల అనూష పతకంతో మెరిసింది. ట్రిపుల్ జంప్‌లో స్వర్ణం సాధించింది. ఆదివారం ఇక్కడ జరిగిన ట్రిపుల్ జంప్ ఫైనల్స్‌లో ఏపీకి చెందిన అనూష 13.53 మీటర్లు లంఘించి విజేతగా నిలిచింది.

ఢిల్లీ ఢమాల్

బెంగళూరుకు వరుసగా ఐదో గెలుపు

రేసు రసవత్తరం



1 ఐపీఎల్‌లో ఎక్కువ సార్లు (18) డకౌట్ అయిన బ్యాటర్‌గా దినేశ్ కార్తీక్

బెంగళూరు: ఇరు జట్లదీ కచ్చితంగా గెలిచితీరాల్సిన పరిస్థితే.. కానీ కీలక మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ చేతులెత్తేసింది. బౌలర్లు మెరుగ్గానే రాణించినా, బ్యాటింగ్, ఫీల్డింగ్ వైఫల్యంతో మూల్యం చెల్లించుకుంది. అటు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మాత్రం అనూహ్య ఆటతీరుతో దూసుకెళుతోంది. వరుసగా ఆరు ఓటములతో ఫ్యాన్స్‌ను నిరాశపరిచిన ఈ జట్టు ఆ తర్వాత బలంగా పుంజుకుని వరుసగా ఐదో గెలుపును ఖాతాలో వేసుకొంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ 47 రన్స్‌తో ఢిల్లీపై ఘన విజయం సాధించింది. దీంతో 12 పాయింట్లతో ఐదో స్థానానికి చేరింది. డీసీ ఆరో స్థానానికి పడిపోయింది. ఫలితంగా ఆర్‌సీబీ ప్లేఆఫ్స్ ఆశలు కూడా సజీవం కావడంతో రేసు రసవత్తరంగా మారింది. ముందుగా బెంగళూరు 20 ఓవర్లలో 9 వికెట్లకు 187 పరుగులు చేసింది. రజత్ పటీదార్ (52), విల్ జాక్స్ (41), గ్రీన్ (32 నాటౌట్) రాణించారు. రసిక్, ఖలీల్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఢిల్లీ 19.1 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌటైంది. అక్షర్ (57), హోప్ (29) మాత్రమే రాణించారు. యష్ దయాల్‌కు 3, ఫెర్గూసన్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా గ్రీన్ నిలిచాడు. కోహ్లీకిది 250వ ఐపీఎల్ మ్యాచ్.



అక్షర్ ఒక్కడే: ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ అక్షర్ పటేల్ మాత్రమే ఆకట్టుకున్నాడు. ఓ మాదిరి ఛేదనే అయినా పేలవ షాట్లకు వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. చాలా రోజుల తర్వాత జట్టులో స్థానం దక్కించుకున్న ఓపెనర్ వార్నర్ (1) తొలి ఓవర్‌లోనే నిష్క్రమించగా.. మూడో ఓవర్‌లో అభిషేక్ పోరెల్ (2)తో పాటు 2 సిక్సర్లు, 2 ఫోర్లతో జోరు మీదున్న మరో ఓపెనర్ ఫ్రేజర్ (21) అవుటయ్యారు. కుషాగ్ర (2)ను సిరాజ్ ఎల్బీ చేయడంతో 30/4 స్కోరుతో జట్టు కష్టాల్లో పడింది. ఈ స్థితిలో అక్షర్-హోప్ జోడీ వికెట్ల పతనాన్ని అడ్డుకుంది. ఐదో ఓవర్‌లో హోప్ 3 ఫోర్లతో ఆకట్టుకున్నాడు. ఆ తర్వాత అక్షర్ 2 ఫోర్లతో పవర్‌ప్లేలో 54/4తో జట్టు పర్వాలేదనిపించింది. అనంతరం బౌలర్లు కట్టడి చేయడంతో పరుగుల వేగం తగ్గింది. పదో ఓవర్‌లో హోప్‌ను ఫెర్గూసన్ అవుట్ చేయడంతో ఐదో వికెట్‌కు 56 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ వెంటనే స్టబ్స్ (3) రనౌటయ్యాడు. అటు అక్షర్ జోరు కొనసాగిస్తూ జాక్స్ ఓవర్‌లో రెండు సిక్సర్లతో 30 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. కానీ కాసేపట్లోనే రసిక్ (10), అక్షర్ వరుస ఓవర్లలో పెవిలియన్ చేరడంతో ఢిల్లీ ఓటమి ఖాయమైంది.

ఆదుకున్న పటీదార్-జాక్స్: తొలి పది ఓవర్లలో 110/2.. ఆ తర్వాత చేసింది 77/7 మాత్రమే. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీ ఆడిన తీరిది. రజత్ పటీదార్-విల్ జాక్స్ ఉన్నంతసేపు సులువుగా 200 దాటుతుందనిపించినా.. ఆఖర్లో ఢిల్లీ బౌలర్లు అదరగొట్టారు. తొలి నాలుగు ఓవర్లలోనే ఓపెనర్లు డుప్లెసి (6), విరాట్ (27) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో విల్ జాక్స్, రజత్ పటీదార్ జోడీ బౌలర్లను దీటుగా ఎదుర్కొంది. దీనికి తోడు కుల్దీప్ ఓవర్‌లో వీరిచ్చిన సులువైన క్యాచ్‌లను వదిలివేయడం కలిసివచ్చింది. ఐదో ఓవర్‌లో పటీదార్ 3 ఫోర్లు బాదడంతో పవర్‌ప్లేలో జట్టు 61/2 స్కోరుతో నిలిచింది. ఆ తర్వాత కూడా ఇద్దరూ భారీ షాట్లతో ఆకట్టుకున్నారు. దీంతో పటీదార్ 29 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. ఎట్టకేలకు 13వ ఓవర్‌లో పటీదార్ ఇచ్చిన క్యాచ్‌ను అక్షర్ అందుకోవడంతో మూడో వికెట్‌కు 88 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వెంటనే జాక్స్‌ను కుల్దీప్ అవుట్ చేశాడు. ఈ దశలో 17వ ఓవర్‌లో గ్రీన్ రెండు, లొమ్రోర్ (13) ఓ సిక్సర్‌తో 22 రన్స్ వచ్చాయి. కానీ చివరి 3 ఓవర్లలో జట్టు తడబడింది. లొమ్రోర్, దినేశ్ కార్తీక్ (0)లను ఖలీల్ ఒకే ఓవర్‌లో అవుట్ చేయగా.. ఆ తర్వాత 12 బంతుల్లో 13 పరుగులే చేసిన ఆర్‌సీబీ స్వప్నిల్ (0), కర్ణ్ శర్మ (6), సిరాజ్ (0) వికెట్లను కోల్పోయింది. దీంతో 190 రన్స్ లోపే ఇన్నింగ్స్ ముగిసింది.

స్కోరుబోర్డు

బెంగళూరు: కోహ్లీ (సి) అభిషేక్ (బి) ఇషాంత్ 27, డుప్లెసి (సి) ఫ్రేజర్ (బి) ముకేశ్ 6, విల్ జాక్స్ (సి) అక్షర్ (బి) కుల్దీప్ 41, పటీదార్ (సి) అక్షర్ (బి) రసిక్ 52, గ్రీన్ (నాటౌట్) 32, లోమ్రోర్ (సి) అభిషేక్ (బి) ఖలీల్ 13, కార్తీక్ (సి) కుల్దీప్ (బి) ఖలీల్ 0, స్వప్నిల్ (సి) కుశాగ్ర (బి) రసిక్ 0, కర్ణ్ శర్మ (రనౌట్) 6, సిరాజ్ (రనౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 187/9; వికెట్ల పతనం:** 1-23, 2-36, 3-124, 4-137, 5-174, 6-174, 7-176, 8-185, 9-187; **బౌలింగ్:** ఇషాంత్ 3-0-31-1, ఖలీల్ 4-0-31-2, ముకేశ్ 3-0-23-1, అక్షర్ 3-0-24-0, కుల్దీప్ 4-0-52-1, రసిక్ 3-0-23-2.

ఢిల్లీ: వార్నర్ (సి) జాక్స్ (బి) స్వప్నిల్ 1, ఫ్రేజర్ (రనౌట్) 21, అభిషేక్ పోరెల్ (సి) ఫెర్గూసన్ (బి) యశ్ దయాల్ 2, హోప్ (సి) కర్ణ్ (బి) ఫెర్గూసన్ 29, కుశాగ్ర (ఎల్బీ) సిరాజ్ 2, అక్షర్ (సి) డుప్లెసి (బి) యశ్ దయాల్ 57, స్టబ్స్ (రనౌట్) 3, రసిక్ (సి) జాక్స్ (బి) గ్రీన్ 10, కుల్దీప్ (బి) యశ్ దయాల్ 6, ముకేశ్ (సి) లోమ్రోర్ (బి) ఫెర్గూసన్ 3, ఇషాంత్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 19.1 ఓవర్లలో 140 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-8, 2-24, 3-24, 4-30, 5-86, 6-90, 7-127, 8-128, 9-135, 10-140; **బౌలింగ్:** స్వప్నిల్ 1-0-9-1, సిరాజ్ 4-0-33-1, యశ్ దయాల్ 3.1-0-20-3, కర్ణ్ శర్మ 2-0-19-0, ఫెర్గూసన్ 4-0-23-2, గ్రీన్ 4-0-19-1, విల్ జాక్స్ 1-0-16-0.

ఆఖరి టీ20లో జింబాబ్వే గెలుపు

ఢాకా: ఆతిథ్య బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌లో జింబాబ్వేకు ఊరట విజయం దక్కింది. ఇప్పటికే వరుసగా 4 మ్యాచ్‌లు కోల్పోయిన జింబాబ్వే.. ఆఖరిదైన ఐదో పోరులో 8 వికెట్లతో గెలిచింది. మొదట బంగ్లా.. మహ్మదుల్లా (54) రాణించడంతో 20 ఓవర్లలో 157/6 స్కోరు చేసింది. ఛేదనలో కెప్టెన్ సికందర్ రజా (72 నాటౌట్), ఓపెనర్ బ్రయాన్ (70) సత్తా చాటడంతో 18.3 ఓవర్లలోనే 158/2 స్కోరు చేసి గెలిచింది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 13-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 27 | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | హైదరాబాద్ సిటీ *

రాహుల్ వయసెంతో.. కాంగ్రెస్‌కు అన్ని సీట్లూ రావు

ఇండియా కూటమిని కలిపింది అవినీతే.. టీఎంసీ పాలనలో అవినీతికి కేంద్రంగా పశ్చిమ బెంగాల్

అక్రమ వలసదారుల సంక్షేమమే మమతకు ముఖ్యం.. బెంగాల్లో హిందువులు ద్వితీయ శ్రేణి పౌరులు

హిందువులందరినీ నదిలో పడేస్తామనేంత ధైర్యం టీఎంసీ ఎమ్మెల్యేకు ఎక్కడి నుంచి వచ్చింది?

ఓటు బ్యాంకు రాజకీయాలకు లొంగిపోయిన టీఎంసీ

నేను బతికి ఉన్నంత కాలం సీఏఏను రద్దు చేయలేరు

సందేశ్‌ఖాలీ బాధితులకు టీఎంసీ గూండాల బెదిరింపులు

హౌరా, హుగ్లీ, బారక్‌పూర్ ఎన్నికల ర్యాలీల్లో ప్రధాని మోదీ

9



ఫుట్‌బాలర్ రేవంత్

రాజకీయ మైదానంలో ప్రత్యర్థులను మూడు చెరువుల నీళ్లు తాగించే సీఎం రేవంత్‌రెడ్డి.. ఫుట్‌బాలర్‌గా మారిపోయి క్రీడా మైదానంలో పరుగులు పెట్టారు. ఎన్నికల ప్రచారంలో అత్యంత బిజీగా గడిపిన ఆయన ఆదివారం ఆట విడుపుగా గ్రౌండ్‌లోకి దిగారు. అడ్డంకులు ఎదురైనా.. అనుకున్న 'గోల్'ను కొట్టే వరకు వెనక్కు తగ్గని రేవంత్ ఆటలోనూ అదే పట్టుదల చూపారు. గేమ్ మధ్యలో షూ పాడైనా.. దాన్ని పక్కన పడేసి ఉత్త కాళ్లతోనే బంతిని అందుకునేందుకు యత్నించారు. హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలో ఎన్ఎస్‌యూఐ నిర్వహించిన మ్యాచ్‌లో పాల్గొన్న సీఎం రేవంత్.. ఆటగాళ్లలో ఉత్సాహం నింపారు.



క్రికెటర్ అసద్

మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ బ్యాట్ పట్టారు. చదువుకునే రోజుల్లో మంచి క్రికెటర్ అయిన ఆయన.. కాసేపు ఆ పాత జ్ఞాపకాల్లోకి వెళ్లిపోయారు. రాజకీయాల్లోకి రాకుంటే మంచి క్రికెటర్ అయ్యేవాడినని చెప్పే హైదరాబాద్ ఎంపీ.. ఆదివారం హైదరాబాద్ శాస్త్రిపురంలోని తన నివాసం సమీపంలో కాసేపు తనకు ఇష్టమైన ఆటను ఆడారు.



ఓటుకు వేళాయె!

నేడే రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్.. కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికకూ నేడే

ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు

సమస్యాత్మక ప్రాంతాల్లో గంట ముందే పూర్తి

ముందే క్యూలైన్‌లో ఉంటే ఎంతసేపైనా అవకాశం

35,809 కేంద్రాలు.. 2,79,519 మంది సిబ్బంది

17 పార్లమెంటు స్థానాల్లో 525 మంది అభ్యర్థులు

ఎన్నికల సిబ్బందికి వ్యక్తిగత వస్తువులతో కిట్ అందజేత

కొడంగల్‌లో ఓటు వేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి

గవర్నర్లు దత్తాత్రేయ, ఇంద్రసేనారెడ్డి హైదరాబాద్‌లో

ఎన్నికల విధుల్లో ప్రభుత్వ ఉద్యోగికి గుండెపోటు

యాదాద్రి జిల్లాకు చెందిన బొడ్డుపల్లి నర్సింహ మృతి



నిజాం కాలేజీ గ్రౌండ్ నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

నేడే పోలింగ్

నాలుగో దశలో 96 లోక్‌సభ స్థానాల్లో

ఏపీ శాసనసభకూ..

ఒడిసా అసెంబ్లీలోని 28 స్థానాలకు సైతం

బెంగాల్‌లోని అన్ని పోలింగ్ కేంద్రాలు తీవ్ర సమస్యాత్మకం

భారీ సంఖ్యలో కేంద్ర బలగాలు

ఈసీ ఏర్పాట్లు పూర్తి

9

ఓట్ల పండుగకు వేళైంది! ఐదున్నర నెలల క్రితం రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజలు.. ఢిల్లీలో తమ ప్రతినిధులుగా ఎవరు ఉండాలో నిర్ణయించుకునే రోజు వచ్చేసింది!! రాష్ట్రంలో ప్రధానంగా పోరు కాంగ్రెస్, బీజేపీ మధ్యనే ఉండగా.. బీఆర్ఎస్ తన ఉనికిని చాటుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తోంది! ఈ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఈసీ పటిష్ఠ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 35,809 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది! 60 వేల మందికి పైగా పోలీసులు... 160 కంపెనీల కేంద్ర బలగాలతో కట్టుదిట్టమైన బందోబస్తు చేసింది. ఇక ఓటర్లదే ఆలస్యం.

నిర్ణయం మీది. తీర్పు చెప్పేది మీరే. కదలండి. ఓటుకు పోటెత్తండి

10

నేడు వేతనంతో కూడిన సెలవు

కూలిన టెంట్లు.. సిబ్బంది పరుగులు!

వర్షాలతో పోలింగ్ సిబ్బందికి ఇబ్బంది

దారులన్నీ ఏపీ వైపే

- ఓటు వేసేందుకు పట్నం వదిలి పల్లెలకు పయనం
- హైదరాబాద్ నుంచి ఏపీ, తెలంగాణ పల్లెలకు జనం
- ఎంజీబీఎస్ నుంచి ఆంధ్రాకు 590 ప్రత్యేక బస్సులు
- పంతంగి, కొర్లపహాడ్ టోల్‌గేట్ల వద్ద వాహనాల రద్దీ

ఎవరి ధీమా వారిదే!

- 14 లోక్‌సభ సీట్లు తమవేనంటున్న కాంగ్రెస్
- తమకు డబుల్ డిజిట్ పక్కా అంటున్న బీజేపీ
- ఉనికి కాపాడుకునేందుకు శ్రమిస్తున్న బీఆర్ఎస్
- పోల్ మేనేజ్‌మెంట్‌లో ముందున్న కాంగ్రెస్!



రూ.కోటి తరలిస్తూ కారు బోల్తా

ఖమ్మం జిల్లాలో పోలీసుల్ని తప్పించుకొని వెళ్తుండగా..

నగదు సీజ్.. ఇద్దరి అరెస్టు

మెదక్ జిల్లాలో 88.43 లక్షల పట్టివేత

మధుయాష్కీ ఇంట్లో తనిఖీలు

ప్రమాదానికి గురైన కారు, కారులో లభించిన నగదు బ్యాగులు

8

ఓటే అడగట్లే..!

- పలు కాలనీవాసుల ఎదురుచూపులు
- అందరికీ అందని ఎన్నికల 'తాయిలాలు'
- పక్క కాలనీల్లో ఇస్తున్నారేమోనని ఆరా!
- రాత్రి వరకూ నేతల చుట్టూ ప్రదక్షిణలు
- పైనుంచి వచ్చినా పంచట్లేదని ఆగ్రహం
- ఖమ్మంలో ఓటుకు 500.. కొందరికే!

హైదరాబాద్ సిటీ, ఖమ్మం, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రచార పర్వం ముగిసి ప్రలోభాల పర్వానికి తెరలేచినా ఇంకా డబ్బులు అందకపోవడం.. కనీసం ఓట్లు అడగడానికి కూడా నాయకులు రాకపోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఉదాహరణకు.. ఉప్పల్ నియోజకవర్గంలోని సూర్యనగర్ ప్రాంతంలో.. ఓటు వేయాలంటూ ఏ పార్టీకి చెందిన నాయకులూ ఇంటికొచ్చి అడగట్లేదంటూ చాలా మంది మహిళలు చెబుతున్నారు. ఇటీవల రోడ్‌షో సందర్భంగా స్థానిక పార్టీ నేతలు పిలిస్తే వెళ్లామని.. అప్పుడు రూ.300 చొప్పున ఇచ్చారని, ఆ తర్వాత నాయకులు తమ వైపు తిరిగి చూసిందే లేదని ఒక మహిళ ఆవేదన వెలిబుచ్చారు. సూర్యనగర్ ప్రాంతంలోనే కాదు. నగరంలోని పలు కాలనీల్లో ఇదే పరిస్థితి కనిపిస్తున్నట్లు సమాచారం. అసెంబ్లీ, జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంలో ఇంటింటికీ తిరిగి ఓటేయ్యాలంటూ అభ్యర్థించడమే కాకుండా మద్యం, డబ్బులు పంచిన నాయకులు.. ఈసారి కొన్ని ప్రాంతాల్లో అందుకు భిన్నంగా వ్యవహరిస్తుండడం గమనార్హం. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో.. రాజధాని, శివారు ప్రాంతాల్లోని లోక్‌సభ నియోజకవర్గాల్లో పోటీపడుతున్న ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఒక్కొక్కరూ కనీసం దాదాపు రూ.50 కోట్ల మేర ఎన్నికల ఖర్చును అంచనా వేసుకున్నట్లు తెలిసింది. ఇంకొకరైతే వంద కోట్లయినా పర్లేదు, గెలుపు సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. కానీ.. 'పంపిణీలు' కొన్ని ప్రాంతాలకు మాత్రమే

మిగతా 8వ పేజీలో...

డబ్బులివ్వాల్సిందే!

8

ఏపీలో ఓటర్ల నుంచి వైసీపీకి వింత నిరసనలు

అధికార పార్టీ నేతలు, అభ్యర్థులకు చుక్కలు

ఓటు డబ్బు నొక్కేశారంటూ నేతలపై గుస్సా

పిఠాపురంలో వంగా గీత ఆఫీస్ ముట్టడి

మంత్రి అమర్నాథ్ ఇంటి వద్ద నిరసన

విశాఖలో ఎంవీపీ ఆఫీస్ బయట ఆందోళన

కర్నూలులో ఏకంగా పోలీస్‌స్టేషన్‌కు..

దేశమంతా 200 యూనిట్ల విద్యుత్తు ఫ్రీ

అగ్నివీర్ పథకం రద్దు.. రైతులకు కనీస మద్దతు ధర

కేజ్రీవాల్ పది గ్యారెంటీలు

'ఆప్' విచ్ఛిన్నానికి బీజేపీ కుట్రలు విఫలం

నా అరెస్టుతో ఆప్ బలపడింది

ప్రధాని రేసులో లేను: కేజ్రీ

9

బెట్టింగ్‌కు బానిసైన కొడుకు ప్రాణం తీసిన తండ్రి

రూ.2 కోట్లు పోగొట్టడమే కాక మిగిలిన ఆస్తుల విక్రయానికీ యత్నం

విసిగిపోయి కుమారుడి తల పగలగొట్టిన తండ్రి

మెదక్ జిల్లాలో ఘటన

12



హనుమకొండ పట్టణంలో ఆదివారం రాత్రి జోరువాన

గాలివాన బీభత్సం!

పలు జిల్లాల్లో ఈదురుగాలులతో భారీ వర్షం

తడిసిన ధాన్యం.. అన్నదాతలకు ఇబ్బందులు

పిడుగు పడి ముగ్గురు.. వడదెబ్బతో ఒకరి మృతి

అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్

నేడు, రేపు వర్షాలు.. ఎండలు తక్కువే!

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గాలి వాన బీభత్సం సృష్టించింది. పొద్దంతా ఎండలతో మండిపోయిన వాతావరణం.. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడ పడిన వానలతో చల్లబడింది. ఆదివారం ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, మెదక్, నల్లగొండ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. చాలాచోట్ల కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలులకు చాలాచోట్ల చెట్లు, విద్యుత్తు స్తంభాలు విరిగిపడటంతో కరెంటు సరఫరాకు అంతరాయం

మిగతా 2వ పేజీలో...

ఏపీలో వైసీపీ 'ఫేక్' ప్రచారం

చంద్రబాబుపై డీప్ ఫేక్ వీడియో.. దిగజారుడు రాజకీయం

టీడీపీ అధినేత వీడియో మార్ఫింగ్

కట్, పేస్ట్‌లతో అసత్య ప్రచారం

8

వీడియో తనది కాదని బాబు ఖండన

ఎక్స్‌లో ఒరిజినల్ వీడియో పోస్టు



పీవోకేలో జనాగ్రహం

ఎస్సై మృతి.. 78 మంది పోలీసులకు గాయాలు

కరెంటు చార్జీలపై భగ్గుమన్న పౌరులు

గోధుమ పిండిపై రాయితీకి జనం డిమాండ్

గాల్లోకి కాల్పులు జరిపిన పోలీసులు

పోలీసులపై రాళ్లతో దాడి.. ఇంటర్నెట్ బంద్

పీవోకే వ్యాప్తంగా 144 సెక్షన్ విధింపు

9



క్యూలైన్ కాంప్లెక్స్‌లో భక్తుల రద్దీ

యాదగిరికొండపై వారాంతపు రద్దీ

భువనగిరి అర్బన్, మే 12: యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టపై ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవు రోజు కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్నారు. దాదాపు 40వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లలో ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. వీఐపీ దర్శనానికి రెండు గంటలు, ధర్మదర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. ప్రసాద విక్రయశాలల వద్ద కూడా రద్దీ నెలకొంది. భక్తులను కొండపైకి తరలించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 57,76,291 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. కాగా, స్వామివారికి నిత్యపూజలను అర్చకస్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఢిల్లీ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

- మరో 11 ప్రముఖ ఆస్పత్రులకు కూడా..
- అప్రమత్తమైన పోలీసులు... భద్రత కట్టుదిట్టం

న్యూఢిల్లీ, మే 12: ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని, మరో 11 ప్రముఖ ఆస్పత్రులను బాంబులతో పేల్చివేస్తామని బెదిరిస్తూ ఆదివారం ఈ-మెయిల్స్ వచ్చాయి. 11 రోజుల క్రితమే 150 పాఠశాలలకు ఇలాంటి హెచ్చరికలే వచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్-3కు సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. అంతకుముందు మూడు గంటల సమయంలో ఢిల్లీ ఉత్తర ప్రాంతంలో ఉన్న బురారీ హాస్పిటల్, దాదాపు అదే సమయంలో అవుటర్ ఢిల్లీలోని సంజయ్ గాంధీ హాస్పిటల్, గురు తేజ్ బహదూర్ హాస్పిటల్, బారా హిందూ రావు ఆస్పత్రి, జనక్‌పురి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆస్పత్రి, ద్వారకలోని దాదా దేవ్ హాస్పిటల్, సివిల్ లైన్స్‌లోని అరుణా అసఫ్ ఆలీ ప్రభుత్వ ఆస్పత్రులకు ఇలాంటి హెచ్చరికలే వచ్చాయి. తొలుత బురారీ ఆస్పత్రి నుంచి ఫోన్ రాగానే హుటాహుటిన బాంబు స్క్వాడ్‌లను పంపించి తనిఖీ చేయించామని, అక్కడ అనుమానాస్పద వస్తువులేవీ కనిపించలేదని డీసీపీ (నార్త్) ఎం.కె.మీనా చెప్పారు. ముందు జాగ్రత్త చర్యగా ఆస్పత్రుల వద్దకు అగ్నిమాపక శకటాలను పంపించారు. అన్ని ఆస్పత్రుల వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఖర్గే హెలికాప్టర్ తనిఖీ పట్ల కాంగ్రెస్ భగ్గు

న్యూఢిల్లీ, మే 12: బిహార్‌లోని సమస్తిపూర్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హెలికాప్టర్‌ను తనిఖీ చేయడం పట్ల ఆ పార్టీ నేతలు మండిపడుతున్నారు. ఎన్నికల అధికారులు విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుంటున్నారని, బీజేపీ-ఎన్‌డీఏ నేతలను మాత్రం స్వేచ్ఛగా తిరగనిస్తున్నారని ఆదివారం ఆరోపించారు. ఇంతకు ముందు కేరళలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హెలికాప్టర్‌ను తనిఖీ చేశారు. తాజాగా శనివారం సమస్తిపూర్‌లో ఖర్గే హెలికాప్టర్‌ను తనిఖీ చేశారని కాంగ్రెస్ నేత రాజేశ్ రాథోడ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. ప్రతిపక్షాల పట్ల ఎన్నికల సంఘం దురుద్దేశ పూరిత ప్రవర్తన..ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆయన పోస్ట్‌లో ఆరోపించారు. కాంగ్రెస్ నేతల హెలికాప్టర్ల తనిఖీలు నిత్యకృత్యమేనా, ఎన్‌డీఏ అగ్రనేతల విషయంలోనూ ఇలాంటి తనిఖీలు జరిగాయా అనేది ఎన్నికల సంఘం (ఈసీ) స్పష్టం చేయాలని ఆయన ఓ వీడియో సందేశంలో పేర్కొన్నారు. అలాంటి రికార్డులను ఈసీ బహిరంగ పరచాలన్నారు. లేకుంటే ఈసీ ప్రతిపక్ష నేతలనే లక్ష్యంగా చేసుకుని ఎన్‌డీఏ నేతలను స్వేచ్ఛగా తిరగనిస్తోందనుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

రాహుల్ గాంధీ ప్రధాని అభ్యర్థా?

- మోదీని చర్చకు ఆహ్వానించే అర్హత లేదు: తేజస్వి సూర్య

బెంగళూరు, మే 12(ఆంధ్రజ్యోతి): బీజేపీ పాలనపై చర్చకు రావాలని ప్రధాని నరేంద్ర మోదీకి రాహుల్ గాంధీ సవాల్ విసరడంపై బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్వి సూర్య స్పందించారు. మోదీని బహిరంగ చర్చకు ఆహ్వానించేందుకు రాహుల్‌గాంధీ ఏమైనా ప్రధాని అభ్యర్థా అని శనివారం ఎక్స్ ద్వారా ప్రశ్నించారు. రాహుల్ ఏ హోదాలో చర్చకు ఆహ్వానిస్తున్నారని ప్రశ్నించారు. తొలుత కాంగ్రెస్ ప్రధాని అభ్యర్థి ఎవరో ప్రకటించాలని ఎద్దేవా చేశారు. పార్టీ ఓటమికి బాధ్యత వహించేందుకు రాహుల్ అంగీకరిస్తే.. ప్రధానితో చర్చలు జరపవచ్చన్నారు. కేంద్రమంత్రి స్మృతిఇరానీ కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించారు. రాహుల్‌గాంధీకి లోక్‌సభ ఎన్నికల్లో సామాన్య బీజేపీ కార్యకర్తపై పోటీ చేసే ధైర్యం కూడా లేదని అన్నారు.

గాలివాన బీభత్సం!

(మొదటి పేజీ తరువాయి)

కలిగింది. కామారెడ్డి జిల్లా కేంద్రంలో భారీ వర్షం కురిసింది. ఆ జిల్లాలోని చాలా చోట్ల కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయి కొట్టుకుపోయింది. వేలాది క్వింటాళ్ల ధాన్యం తడవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆసిఫాబాద్ జిల్లాలోనూ భారీ వర్షం పడింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని చందుర్తి, వీర్నపల్లి, ఎల్లారెడ్డి మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో, జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం, సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ప్రాంతంలో కురిసిన వర్షానికి పలుచోట్ల ధాన్యపు రాశులు తడిసిపోయాయి. హనుమకొండ జిల్లాలోని 9 మండలాలు, వరంగల్ జిల్లాలోని 7 మండలాల్లో కుండపోత వర్షం కురిసింది. చెట్లు విరిగిపడటంతో 2-3 గంటల పాటు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది. ప్రధాన రోడ్లపై నీరు నిలవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. వరంగల్ జిల్లా గీసుకొండ, ఖానాపురంలో 6.1 సెం.మీ వర్షపాతం నమోదైంది.

పిడుగుపడి ముగ్గురు.. వడదెబ్బకు ఒకరు బలి

వర్షం పడుతుండటంతో ధాన్యం కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పడానికి వెళ్లిన తాత, మనుమడిపై పిడుగు పడడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండల పరిధిలోని రామోజీపల్లికి చెందిన పాల్వంచ శ్రీరాములు (45), శివరాజ్ (13) (శ్రీరాములు అన్న కూతురు కొడుకు) వరుసకు తాత, మనుమడు అవుతారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని ఆరబోశారు. సాయంత్రం వర్షం రావడంతో ధాన్యం కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పుతుండగా పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం గిమ్మా గ్రామానికి చెందిన మామిడిపెల్లి కిరణ్ (38) పిడుగుపాటుతో మృతి చెందగా.. కోల భోజన్న, కూరెల్లి టిల్లు, కొండ రమేశ్, మంగ సంటెన్న తీవ్రంగా గాయపడ్డారు. వీరిని రిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం నర్సింగాపూర్‌లో పిడుగుపడి ఆవు మరణించింది. ఇటు కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టులో కనుకుట్ల రాధ (40) వడదెబ్బకు అస్వస్థతకు గురై మృతి చెందింది.



కామారెడ్డిలోని గాంధీగంజ్‌లో ధాన్యపు రాశి వద్ద నిలిచిన వాననీటిని ఎత్తుతున్న రైతు

నేడు, రేపు ఎండలు తక్కువే..

రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ రెండ్రోజులు ఎండలు తక్కువే ఉంటాయని.. సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 34-40 డిగ్రీల మధ్య నమోదవుతాయని తెలిపింది. ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 34-35 డిగ్రీలు.. మిగిలిన అన్ని జిల్లాల్లోనూ 40 డిగ్రీల్లోపే ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వెల్లడించింది.

అప్రమత్తంగా ఉండండి: సీఎం రేవంత్

రాష్ట్రంలో పలు జిల్లాల్లో గాలివాన బీభత్సం నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. భారీ వర్షాలు, పిడుగులు పడి సంభవించిన నష్టంపై ఆరా తీశారు. వాతావరణ శాఖ వర్ష సూచనల నేపథ్యంలో జిల్లాల్లో కలెక్టర్లు, రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి ఆపద వచ్చినా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తగిన సహాయక చర్యలు చేపట్టాలన్నారు. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలంలో పిడుగు పడి ఇద్దరు మృతి చెందిన ఘటనపై సీఎం విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని హామీనిచ్చారు. అలాగే జైనథ్ మండలంలో పిడుగుపాటుకు తీవ్రంగా గాయపడిన వారికి తగిన వైద్య సాయం అందేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఉంచినా రైతులు ఆందోళన చెందవద్దని.. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు.

మహిళా ప్రాతినిధ్యం అంతంత మాత్రమే!

- ఐదో దశ లోక్‌సభ ఎన్నికల బరిలో 82 మందే స్త్రీలు
- మొత్తం 695 మంది అభ్యర్థుల్లో 227 మంది కోటీశ్వరులు: ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ, మే 12(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో మహిళల ప్రాతినిధ్యం అంతంతమాత్రంగానే ఉంటుంది. ఐదో దశ ఎన్నికల్లో మొత్తం 695 మంది అభ్యర్థులు బరిలో ఉండగా ఇందులో మహిళలు 82 మందే ఉన్నారు. ఐదో దశ బరిలో ఉన్న అభ్యర్థుల అఫిడవిట్‌లను విశ్లేషించిన అసోషియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) ఆదివారం ఓ నివేదిక విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం ఐదో దశ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో మహిళల వాటా 12 శాతమే ఉంది. తొలి దశలో 135 మంది(8శాతం), రెండో దశలో 100(8శాతం), మూడో దశలో 123(9శాతం), నాలుగో దశలో 170(10శాతం) మంది మహిళలే పోటీ చేశారు. ఇక, ఏడీఆర్ నివేదిక ప్రకారం ఐదో దశ ఎన్నికల బరిలో ఉన్న 695 మంది అభ్యర్థుల్లో 227 మంది(33 శాతం) కోటీశ్వరులు ఉన్నారు. 159 మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. 122 మంది తమపై తీవ్రమైన క్రిమినల్ నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నాయి. మొత్తం అభ్యర్థుల్లో ముగ్గురు దోషులు కూడా ఉన్నారు. అలాగే, నలుగురిపై హత్య కేసులు, 28 మందిపై హత్యాయత్నం కేసులున్నాయి. 29 మంది మహిళలపై దాడికి పాల్పడిన కేసులు ఉన్నాయి. ఒకరిపై అత్యాచారం కేసు కూడా ఉంది. పది మంది అభ్యర్థులు విద్వేష ప్రసంగాలకు సంబంధించిన కేసులు ఎదుర్కొంటున్నారు. ఇక, వయస్సు విషయానికొస్తే 25-40 ఏళ్ల లోపు వారు 207 మంది ఉండగా, 41-60 ఏళ్ల మధ్య 384 మంది, 61-80 ఏళ్ల మధ్య 103 మంది, ఉన్నారు. విద్యార్హతల సంగతికొస్తే 293 మంది ఐదు నుంచి 12వ తరగతి వరకు చదువుకోగా, 349 మంది డిగ్రీ, ఆపై ఉన్నతవిద్యను అభ్యసించిన వారు ఉన్నారు. 26 మంది డిప్లొమా పూర్తి చేశారు. ఐదుగురు నిరక్షరాస్యులు ఉండగా, చదవడం, రాయడం మాత్రమే వచ్చిన వారు 20 మంది ఉన్నారు. కాగా, బిహార్(5), ఝార్ఖండ్(3), మహారాష్ట్ర(13), ఒడిసా(5), ఉత్తరప్రదేశ్(14), పశ్చిమ బెంగాల్(7), జమ్మూకశ్మీర్(1), లద్దాఖ్(1) లోని 49 లోక్‌సభ స్థానాలకు మే 20న పోలింగ్ జరగనుంది.

ఎన్‌హెచ్‌ఎం నిధులివ్వని కేంద్రం!

రెండేళ్లుగా చుక్కలు చూపిస్తున్న వైనం.. దాదాపు రూ.500 కోట్ల నిధుల నిలిపివేత

- ఇతర రాష్ట్రాలకు కేటాయింపులకు మించి
- తెలంగాణ విషయంలో మాత్రం వివక్ష!
- ఆ 5 రాష్ట్రాలకే మొత్తం నిధుల్లో 42 శాతం
- ఇక్కడ ఉద్యోగులకు జీతాలివ్వలేని పరిస్థితి

హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) నిధుల మంజూరులో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోంది. కేంద్రం గత రెండేళ్లుగా ఈ నిధులను సకాలంలో ఇవ్వడం లేదు. ఇలా సుమారు రూ.500 కోట్లు కాలాతీతం కావడంతో మురిగిపోయాయి. కేంద్రం తీరుతో రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు భారం పడుతోంది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణపై వివక్ష చూపుతున్నట్లు వైద్య వర్గాలు చెబుతున్నాయి. కేంద్రం తెలంగాణకు ఎన్‌హెచ్‌ఎమ్ నిధులు నిలిపివేసిందని, దీంతో వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితిలో ఉందని గత నెల 7న 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. మరో 24 రోజుల్లో నిధులు రాకుంటే అంతేనని కూడా ఆ కథనంలో పేర్కొంది. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగియడం, కేంద్రం నుంచి నయాపైసా రాకపోవడంతో రాష్ట్రం పెట్టుకున్న ఆశలు అడియాసలయ్యాయి. వాస్తవానికి తెలంగాణకు ఎన్‌హెచ్‌ఎం కింద 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1480.22 కోట్ల బడ్జెట్‌కు కేంద్రం అనుమతినిచ్చింది. ఇందులో రూ.888.13 కోట్లు (60 శాతం) కేంద్రం వాటా. రాష్ట్రం తన వాటా కింద 40 శాతం అంటే రూ.592.09 కోట్లు మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలి. ఇందులో కేంద్రం తన వాటాను నాలుగు క్వార్టర్ల కింద ఇస్తుంది. ఇందులో ఇప్పటికి కేవలం రూ.540.59 కోట్లే విడుదల చేసింది. మరో రెండు క్వార్టర్లకు సంబంధించిన రూ.347.54 కోట్లు ఆగిపోయాయి. మార్చి 31లోగా అవి రాకపోవడంతో ఆ నిధులు మురిగిపోయాయని వైద్య వర్గాలు తెలిపాయి. '2022-23 ఆర్థిక సంవత్సరానివి మరో రూ.150 కోట్ల నిధులు కూడా ఇలాగే మురిగిపోయాయి. వెరసి రూ.500 కోట్లు రాకపోవడంతో ఆ భారం రాష్ట్ర ఖజానాపై పడింద'ని అధికారులు చెబుతున్నారు. ఈ అంశంపై మార్చి మొదటి వారంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. నిధుల నిలిపివేయడంతో ఎన్‌హెచ్‌ఎమ్ పరిధిలోని కీలకమైన ఆరోగ్య పథకాలు నిలిచిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. 17 వేల మంది ఉద్యోగులకు జీతాలివ్వలేని పరిస్థితి నెలకొనడంతో రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో ఎన్‌హెచ్‌ఎమ్‌కు రూ.100 కోట్లు ఇచ్చింది. దాంతో మూడు నెలల జీతాలు ఇచ్చారు. ప్రస్తుతం మార్చి నెల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. మరికొన్ని నిధులు వెంటనే విడుదల చేయాలని ఎన్‌హెచ్‌ఎం ఎండీ ఆర్వీ కర్ణన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

తెలంగాణకు తీవ్ర అన్యాయం

కేంద్రం ఎన్‌హెచ్‌ఎం నిధులను కావాలనే నిలిపివేసిందని, తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని అధికారులు లెక్కలతో చెబుతున్నారు. 2020-21 నుంచి 2023-24 మధ్యకాలంలో ఎన్‌హెచ్‌ఎం కింద అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కలిపి రూ.1,11,168.47 కోట్లను కేంద్రం విడుదల చేసింది. ఇందులో రాష్ట్రానికి విడుదల చేసింది రూ.2,621 కోట్లు మాత్రమే. ఈ విషయంలో దేశంలో 15వ స్థానంలో ఉంది. నాలుగేళ్ల ఎన్‌హెచ్‌ఎం మొత్తం నిధుల్లో మనకు వచ్చినది కేవలం 2.35 శాతమే. ఎన్‌హెచ్‌ఎం ద్వారా అత్యధిక నిధులు పొందిన రాష్ట్రాల జాబితాలో ఉత్తరప్రదేశ్ (రూ.15,872.51 కోట్లు), మధ్యప్రదేశ్ (రూ.9,051 కోట్లు), మహారాష్ట్ర (రూ.7661 కోట్లు), అసోం (రూ.7207 కోట్లు), రాజస్థాన్ (రూ.7056 కోట్లు) ఉన్నాయి. కేవలం ఆ ఐదు రాష్ట్రాలకే కేంద్రం ఎన్‌హెచ్‌ఎం నిధుల్లో 42.12 శాతం ఇచ్చిందని అధికారులు గుర్తు చేస్తున్నారు. ఇదే కేంద్రం కొన్ని రాష్ట్రాలకు విచిత్రంగా కేటాయింపులకు మించి నిధులు విడుదల చేసిందని కూడా వారు చెబుతున్నారు.

రాష్ట్ర బీజేపీ నేతలు స్పందించాలి

రాష్ట్ర బీజేపీ నేతలు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించి, ఎన్‌హెచ్‌ఎం నిధులు వెంటనే విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలి. లేదంటే కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకాలు ఇక్కడ అమలు కాకుండా నిలిపివేస్తాం. కేంద్ర హెల్త్ యాప్స్‌కు రోజువారీ పంపే గణాంకాలను ఆపేస్తాం. విచ్చలవిడిగా ఇతర రాష్ట్రాలకు కేటాయింపులకు మించి నిధులిస్తూ తెలంగాణకు రావాల్సినవి కూడా ఇవ్వకపోవడం అన్యాయం. ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న 17 వేల మంది ఉద్యోగులు పస్తులు ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

- నర్సింహ, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి


నాలుగో దశ పోరులో నువ్వా - నేనా..!

లోక్‌సభ ఎన్నికల నాలుగో దశలో అధికార ఎన్డీఏ, ప్రతిపక్ష ఇండియా కూటమియేతర పార్టీలపైనే పరిశీలకుల దృష్టి ప్రధానంగా ఉంది. త్రిశంకు సభ (హంగ్ పార్లమెంటు) ఏర్పడిన పక్షంలో (నెల రోజుల క్రితం కంటే ఇది ఇప్పుడు సంభావ్య పరిణామంగా కనిపిస్తోంది) ప్రభుత్వం ఏర్పాటులో ఈ 'అలీన' పార్టీలే కీలక పాత్ర వహించనున్నాయి. మొదటి మూడు దశల ఎన్నికలపై విశ్లేషణలలో మేము సూచించినట్లు ఆ మూడు దశల్లో ఎన్డీఏ 40 సీట్లను కోల్పోయే అవకాశముంది. నాలుగో దశలో ఆ నష్టం మరింతగా వాటిల్లకుండా అడ్డుకట్ట వేసేందుకు ఎన్డీఏ కృతనిశ్చయంతో ఉంది. అంతేకాకుండా ఉత్తరాది, మధ్య భారత రాష్ట్రాలలో సంభవించే నష్టాలను ఉభయ తెలుగురాష్ట్రాలలో భర్తీ చేసుకొనే అవకాశముంది. నాలుగో దశలో ఎన్నికలు జరగనున్న 96 నియోజక వర్గాలలో దాదాపు సగం ఉభయ తెలుగు, రాష్ట్రాలు, ఒడిషాలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, ఒడిషాలో బిజూ జనతాదళ్ (బీజేడీ), తెలంగాణలో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఫలితాలను నిర్ణయించనున్నాయి. మొత్తంగా, ప్రస్తుతం ఎన్డీఏకు ఉన్న 49స్థానాల్లో 42 బీజేపీవి కాగా మిగతా 7 దాని మిత్రపక్షాలవి. ఈ స్థానాలలో అత్యధికం యూపీ, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో ఉన్నాయి. 2019లో ఇండియా కూటమి ఈ స్థానాలలో 12 మాత్రమే గెలుచుకోగలిగింది. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు సమస్థాయిలో ఆ స్థానాలు దక్కాయి. ఇక మిగిలిన 35 స్థానాలలో 32 ను 'అలీన' పార్టీలు స్వాయత్తం చేసుకున్నాయి. వాటిలో 32 ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఉన్నాయి. 2019 అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ఈ బలాబలాలను పెద్దగా మార్చలేదు. లోక్ సభతో పాటు అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగుతున్న ఆంధ్ర, ఒడిషాలో మినహా మిగతా రాష్ట్రాలలో ఓటర్లు అసెంబ్లీ ఎన్నికల్లో వేసినట్టుగానే ఈ నాలుగో దశ పోలింగ్‌లో కూడా ఓటు వేసినపక్షంలో ఎన్డీఏకు ప్రస్తుతమున్న 49కి అదనంగా మరేమీ దక్కవు. ఇండియా కూటమి మరో 10 స్థానాలను అదనంగా గెలుచుకునే అవకాశముంది. దీనితో దాని స్థానాల సంఖ్య 22కు పెరుగుతుంది. ఇక ఏ కూటమితో నూ సంబంధం లేని పార్టీల సంఖ్యా బలం 35 నుంచి 25కు తగ్గిపోనుంది.

ఇక ఇప్పుడు రాష్ట్రాల వారీ ఎన్నికల పోరాటాలపై దృష్టి సారిద్దాం. లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికలు మరోసారి ఏకకాలంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్‌లో అధికార వైసీపీ 2019లో అటు లోక్ సభ, ఇటు అసెంబ్లీ స్థానాల్లో ఐదింట నాలుగో వంతు సీట్లను సాధించుకుంది. అయితే ప్రస్తుత ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, బీజేపీలతో కూడిన కూటమి నుంచి తీవ్ర పోటీ ఎదుర్కొంటోంది. రాష్ట్ర పాలక పక్షం ప్రధానంగా తన సంక్షేమ పథకాలపై ఆధారపడుతోంది. ప్రతిపక్ష ఎన్డీఏ కూటమి ప్రజల్లో తీవ్రంగా ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతపై ఆశలు పెట్టుకుంది. రాజధాని వివాదం, కుల సమీకరణాలు, ముఖ్యంగా జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ సొంత సామాజిక వర్గం కాపుల మద్దతు తమకు విశేష లబ్ధి సమకూర్చగలవని ఎన్డీఏ విశ్వసిస్తోంది. పాలక వైసీపీకి గ్రామీణ ప్రాంతాల్లోను, దక్షిణ రాయలసీమలోను ప్రజాదరణ ఉండగా, టీడీపీ జనసేన-బీజేపీ కూటమికి పట్టణ ప్రాంతాలలోను, ఉత్తరాంధ్రలోను జనబలం బాగా ఉంది. 2019 ఎన్నికలలో సాధించుకున్న ఓట్ల ప్రాతిపదికన చూస్తే, ఈ మూడు పార్టీల కూటమికి ప్రస్తుత లోక్ సభ ఎన్నికలలో 7 సీట్లు అదనంగా లభిస్తాయి. ఈ కూటమికి ప్రస్తుతం ఉన్న 3 సీట్లూ తెలుగు దేశం పార్టీవే. ఎన్డీఏది పైచేయి కావాలంటే 2019లో వచ్చిన ఓట్లకంటే అదనంగా 3.1 శాతం రావాలి. అంతకుమించిన ఓట్ల మొగ్గు సాధించగలిగితే ఈ మూడు పార్టీలకు అది ప్రభంజనం వంటి విజయం అవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ చాలా బలహీనంగా ఉంది. 2019లో ఒక శాతం కంటే తక్కువ ఓట్లే సాధించుకున్నప్పటికీ ప్రస్తుత లోక్ సభ ఎన్నికలలో నాలుగో వంతు స్థానాలలో పోటీ చేస్తోంది. ముఖ్యమంత్రి జగన్ సోదరి షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ ఆంధ్రలో తన పూర్వ వైభవాన్ని పునరుద్ధరించుకునేందుకు ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్‌కు ఓట్ల లబ్ధి సమకూరినా సీట్ల లబ్ధి కలిగే సూచనలు లేవు.

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో లభించిన విజయాలను మరింతగా పటిష్ఠం చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఎన్నికల హామీలను దాదాపుగా అమలుపరిచినందున ఓటర్లు తమకే ఓటు వేస్తారని కాంగ్రెస్ విశ్వసిస్తోంది. చాలా నియోజక వర్గాలలో ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్య ఉంది. బీజేపీ తరపున పోటీ చేస్తున్న వారిలో మూడింట రెండు వంతుల మంది బీఆర్ఎస్ నుంచి ఇటీవలే బీజేపీలో చేరినవారే. బీఆర్ఎస్ నుంచి తమ పార్టీలోకి ఫిరాయించిన అభ్యర్థుల పలుకుబడి, ఆర్థిక బలం తమకు విశేష లబ్ధిని సమకూర్చనున్నాయని బీజేపీ భావిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికలలో గ్రామీణ ప్రాంతాలలో మంచి ఫలితాలు సాధించిన కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్‌లో చతికిల బడింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుని, వారిని లోక్‌సభకు పోటీ చేయిస్తోంది. ప్రస్తుత ఎన్నికలలో ముస్లిం ఓటర్ల మద్దతు కాంగ్రెస్‌కు విశేషంగా మేలు చేయనుంది. మొత్తం మీద కాంగ్రెస్ గత సార్వత్రిక ఎన్నికలలో గెలుచుకున్న మూడు సీట్లకంటే అదనంగా గణనీయమైన స్థానాలను స్వాయత్తం చేసుకోనుంది. బీజేపీ సైతం తన పాత బలానికి అదనంగా రెండు సీట్లను గెలుచుకునే అవకాశం ఉంది. మజ్లిస్ తన ఏకైక స్థానాన్ని నిలబెట్టుకుంటుంది. బీఆర్ఎస్ ఒకటి లేదా రెండు సీట్లను గెలుచుకోగలుగుతుంది.

> లోక్‌సభ ఎన్నికల నాలుగో దశలో పాలక ఎన్డీఏ, ప్రతిపక్ష 'ఇండియా' కూటములు సమ ఉజ్జీలుగా నిలవనున్నాయి. త్రిశంకు (హంగ్) సభ ఏర్పడిన పక్షంలో ప్రభుత్వం ఏర్పాటులో ఉభయ కూటములకు చెందని ప్రాంతీయ పక్షాలు కీలక పాత్ర నిర్వహిస్తాయి.



ఒడిషాలో నాలుగు లోక్‌సభ, 28 అసెంబ్లీ సీట్లకు ఎన్నికలు జరగనున్నాయి. బిజూజనతాళ్ కు, బీజేపీ రెండిటికీ విజయావకాశాలు గణనీయంగా ఉన్నాయి. ఈ తూర్పు రాష్ట్రంలో ఇదే మొదటిదశ. మొదటి విడత పోలింగ్ జరగనున్న మరో రాష్ట్రం జార్ఖండ్ లో నాలుగు లోక్ సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నాలుగు స్థానాలలో మూడు ఎస్టీ (సింగ్‌భమ్, ఖుంటి, లోహర్ దాగ), ఒకటి ఎస్సీలకు రిజర్వ్ అయినవి. ఇండియా కూటమి తదుపరి దశలలో మంచి ఫలితాల సాధించాలంటే ఈ నాలుగు స్థానాలనూ గెలుచుకోవలసి ఉంది. ప్రజాదరణ బాగా ఉన్న ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్‌ను కేంద్రం అరెస్ట్ చేసి జైలుకు పంపినందున ఆయన పట్ల వ్యక్తమవుతున్న సానుభూతి తమకు లబ్ధి సమకూర్చగలదని ఇండియా కూటమి విశ్వసిస్తోంది.

ఇండియా కూటమి అదనపు సీట్లు గెలుచుకునే అవకాశాలు పశ్చిమ బెంగాల్‌లో బాగా ఉన్నాయి. మధ్యప్రదేశ్, బిహార్‌లో కూడా ప్రతిపక్ష కూటమి అదనపు సీట్లు సాధించుకునే అవకాశమున్నది. ఇప్పుడు ఎన్నికలు జరగనున్న 8 స్థానాలలో ఐదింటిని ఇండియా కూటమి, మూడింటిని బీజేపీ 2019లో గెలుచుకున్నాయి. 2021 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రాతిపదికన చూస్తే తృణమూల్ కాంగ్రెస్ గతంలో కంటే మరో మూడు సీట్లను అదనంగా గెలుచుకునే అవకాశముంది.



యోగేంద్ర యాదవ్

బిహార్‌లో ఎన్నికలు జరగనున్న ఐదు సీట్లు మిథిల ప్రాంతంలో ఉన్నాయి. 2019లో ఇండియా కూటమి ఈ ప్రాంతంలో ఒక్క సీటునూ గెలుచుకోలేక పోయింది. గత అసెంబ్లీ ఎన్నికల ఓట్ల ప్రాతిదికన చూస్తే ఈ ఐదు సీట్లలో కేవలం ఒక్కటి మాత్రమే కాంగ్రెస్ గెలుచుకునే అవకాశముంది. మరో రెండు మూడు శాతం ఓట్లు అదనంగా సమకూరితేనే ఎన్డీఏపై ఇండియా కూటమిది పై చేయి అయ్యే అవకాశముంది. మధ్య ప్రదేశ్‌లో నాలుగో దశ ఎన్నికలు జరగనున్న ప్రాంతాలలో మాళ్వా కూడా ఉంది. గత అసెంబ్లీ ఎన్నికలలో సాధించుకున్న ఓట్ల బలాన్ని నిలుపుకోవడంతో పాటు, ఇండియా భాగస్వామ్య పక్షమైన ఆప్ ఓట్లు కూడా సమకూరితే కాంగ్రెస్‌కు ఈ సారి రెండు ఎస్టీ సీట్లు లభించే అవకాశముంది. ఓట్ల శాతం మరి కొంచెం పెరిగితే మరో స్థానం కూడా కాంగ్రెస్‌కు దక్కే అవకాశం మెండుగా ఉంది.

ఉత్తర్‌ప్రదేశ్ లోని 13, మహారాష్ట్రలోని 11 నియోజక వర్గాలలో నాలుగో దశ ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఈ రెండు రాష్ట్రాలలోను ఇండియా కూటమికి విజయావకాశాలు మెరుగ్గా లేవు. యూపీలోని 13 స్థానాలనూ 2019లో బీజేపీనే స్వాయత్తం చేసుకున్నది. 2022 అసెంబ్లీ ఎన్నికలలో కూడా ఆ నియోజక వర్గాలలో మంచి ఫలితాలను సాధించింది. అయితే బీజేపీ తన 13 మంది ఎంపీలలో 11 మందిని మాత్రమే తిరిగి నిలబెట్టింది. ఈ చర్య పట్ల సంబంధిత నియోజక వర్గాల ఓటర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలలో కంటే 2 శాతం ఓట్లు తక్కువగా వచ్చిన పక్షంలో ప్రస్తుత ఎన్నికలలో బీజేపీకి 4 స్థానాలు తగ్గుతాయి. గతంలో కంటే 3 శాతం ఓట్లు తక్కువగా వస్తే 6 సీట్లను బీజేపీ కోల్పోవలసివస్తుంది. మహారాష్ట్రలో సైతం ఇండియా కూటమికి లబ్ధి సమకూరదని 2019 ఎన్నికల ఫలితాలు సూచిస్తున్నాయి. ప్రస్తుతం ఎన్నికలు జరగనున్న మరఠ్వాడా, ఎగువ పశ్చిమ మహారాష్ట్ర, ఉత్తర మహారాష్ట్రలోని 11 స్థానాల్లో 9ని గత ఎన్నికలలో బీజేపీ, అవిభక్త శివసేన సాధించుకున్నాయి. జలగావ్, రావెర్, జల్నా, అహ్మద్ నగర్, పూణే, బీడ్ నియోజకవర్గాలు బీజేపీకి కంచుకోటలు కాగా నందుర్బార్, శిర్డి, ఔరంగాబాద్‌లో బీజేపీ అవకాశాలను ఇండియా కూటమి దెబ్బ తీసే అవకాశముంది. ఏది ఏమైనా మహారాష్ట్రలో ప్రస్తుత దశలో ఇండియా కూటమికి చెప్పుకోదగ్గ విజయాలు లభించవనేది స్పష్టం. మొత్తం మీద ఈ నాలుగో దశలో పాలక, ప్రతిపక్ష కూటములకు విజయాలు సమస్థాయిలో లభించనున్నాయి. పరస్పర బలాబలాలపై పెద్దగా ప్రభావం లేకుండా 'అలీన' ప్రాంతీయ పార్టీలకు స్వల్ప నష్టం చేస్తూ తాము పరిమితంగా ప్రయోజనం పొందగలమని ఎన్డీఏ, ఇండియాలు ఆశిస్తున్నాయి.

(వ్యాసకర్త జాతీయ కన్వీనర్, భారత్ జోడో అభియాన్)

(శ్రేయాస్ సర్దేశాయ్, రాహుల్ శాస్త్రి సహకారంతో)

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ABN ఆంధ్రజ్యోతి

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఆదివారం ఉష్ణోగ్రత గరిష్టం 37.8 కనిష్టం 27.7

ఓటర్లు 1.12 కోట్లు
అభ్యర్థులు 140 మంది



యూసుఫ్‌గూడ స్టేడియంలో ఎన్నికల సిబ్బంది, సామగ్రి

7am పోలింగ్ ప్రారంభ సమయం

6pm ముగింపు సమయం



ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

- అత్యధికంగా సికింద్రాబాద్‌లో 45 మంది
- గ్రేటర్‌లో నాలుగు పార్లమెంట్ స్థానాలు
- ఎన్నికల సమరం నేడే
- పోలింగ్ కేంద్రాలకు తరలిన ఈవీఎంలు
- ఎన్నికలకు సర్వం సిద్ధం : రోనాల్డ్‌రోస్
- డీఆర్‌సీ కేంద్రాల పరిశీలన
- పర్యవేక్షణకు జీహెచ్ఎంసీలో కంట్రోల్ రూమ్
- రూ.50 కోట్ల విలువైన నగదు, వస్తువులు సీజ్

గ్రేటర్‌లో పరిధిలో నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాలు ఉండగా, పోటీలో 140 మంది అభ్యర్థులు ఉన్నారు. వీరిలో నలుగురిని ఎన్నుకునేందుకు మహానగర ఓటర్లు సిద్ధం అవుతున్నారు. కేంద్రంలో కొలువుదీరే ప్రభుత్వం ఏ పార్టీది..? భావి భారత ప్రధాని ఎవరు..? అన్నది తేల్చేందుకు నేడు తీర్పు ఇవ్వనున్నారు. నాలుగో విడతలో భాగంగా లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరగనుంది.

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమరం నేడు జరగనుంది. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్(డీఆర్‌సీ) కేంద్రాల నుంచి ఆదివారం ఈవీఎంలు పోలింగ్ కేంద్రాలకు తరలించారు. అంబర్‌పేట మునిసిపల్ స్టేడియం, ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని వనిత మహా విద్యాలయ, ఓయూలోని ఎంబీఏ, దూర విద్యా కళాశాల, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం, మాసబ్‌ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్‌యూ తదితర ప్రాంతాల నుంచి ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని సిబ్బంది బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లారు. గ్రేటర్ పరిధిలో నాలుగు లోక్‌సభ నియోజకవర్గాలుండగా.. 1.12 కోట్ల మంది ఓటర్లున్నారు. 140 మంది బరిలో ఉన్నారు. అత్యధికంగా సికింద్రాబాద్‌లో 45, హైదరాబాద్‌లో 30, మల్కాజ్‌గిరిలో 22, చేవేళ్లలో 43 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

5.30 గంటలకే మాక్ పోలింగ్

కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం తెల్లవారుఝామున 5.30 గంటలకే (పోలింగ్ ప్రారంభమయ్యే సమయం కంటే గంటన్నర ముందు) మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. అభ్యర్థుల ఏజెంట్ల ముందు ఈవీఎంల పనితీరును

మిగతా 6వ పేజీలో..

రేపు ఉదయం వరకు
మద్యం షాపులు బంద్

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మద్యం షాపులపై ఉన్న ఆంక్షలను మరో 12 గంటల పాటు పొడిగిస్తూ హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. కేవలం వైన్‌షాపులు మాత్రమే కాకుండా పబ్‌లు, బార్‌లు, ఫైవ్‌స్టార్ హోటళ్లలోనూ మద్యం దుకాణాలపై మంగళవారం ఉదయం 6గంటల వరకు ఆంక్షలు కొనసాగుతాయని తెలిపారు.

పార్లమెంట్ నియోజకవర్గాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం ఓటర్లు	బరిలో ఉన్న అభ్యర్థులు	పోలింగ్ కేంద్రాలు	సమస్యాత్మక కేంద్రాలు	కంట్రోల్ యూనిట్లు	బ్యాలెట్ యూనిట్లు
హైదరాబాద్	11,25,283	10,91,615	407	22,17,305	30	1,944	383	2,427	4,862
సికింద్రాబాద్	10,86,875	1,03,396	279	21,20,550	45	1,810	90	2,261	6,789
మల్కాజ్‌గిరి	19,45,624	18,33,430	542	39,79,596	22	3,228	407	713	1,428
చేవెళ్ల	15,04,260	14,33,830	280	29,38,370	43	2,877	471	3,595	3,595

అభ్యర్థులు ఎవరు ఎక్కడెక్కడ ఓటేస్తారంటే..

హైదరాబాద్ సిటీ, మే 12(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ బరిలో నిలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావు.. మోండా మార్కెట్ ఏరియాలోని ఇస్లామియా స్కూల్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14లోని కమ్యూనిటీ హాల్ పోలింగ్ కేంద్రంలో, బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి బర్కత్‌పురాలోని దిశా మోడల్ స్కూల్ పోలింగ్ కేంద్రంలో తమ ఓటుహక్కును వినియోంచుకోనున్నారు.

- మల్కాజిగిరి పార్లమెంట్ బరిలో నిలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి హబ్సిగూడలోని శ్రీసాయి పబ్లిక్ స్కూల్లో, బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ మేడ్చల్ మండలం పూడూరు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో, కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతారెడ్డి తాండూరు నియోజకవర్గం దౌలాపూర్‌లో తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.
- హైదరాబాద్ పార్లమెంట్ బరిలో ఉన్న మజ్లిస్ పార్టీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ రాజేంద్రనగర్ నియోజకవర్గం శాస్త్రిపురం, బీజేపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలత వెస్ట్ మారేడ్‌పల్లిలో, కాంగ్రెస్ అభ్యర్థి సమీర్ వలీఉల్లా టోలిచౌకిలో, బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ గోషామహల్‌లోని గౌలిగూడ చమాన్‌లో తమ ఓటు హక్కును వినియోగిచుకోనున్నారు.

బంజారాహిల్స్‌లో కేటీఆర్

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్, నందినగర్, బంజారాహిల్స్ పోలింగ్‌స్టేషన్‌లో ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

సెలబ్రిటీలు ఓటేసేది ఇక్కడే 4

ఆదివారం.. అభ్యర్థుల మంతనాలు 4

ఓటేయండి ప్లీజ్... 6
'స్మార్టు'గా ఓటేద్దాం
ఏదో ఒక గుర్తింపు కార్డు తప్పనిసరి

భద్రత కట్టుదిట్టం

- 29 వేల మందితో బందోబస్తు
- పోలీసుల అధీనంలోకి పోలింగ్ కేంద్రాలు
- సమస్యాత్మక ప్రాంతాల్లో సీపీల పర్యవేక్షణ
- సమాచార వ్యాప్తికి ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు



రాజేంద్రనగర్ పరిధిలో భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి

హైదరాబాద్ సిటీ, మే 12(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ట్రై కమిషనరేట్ పోలీసులు పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రణాళికలు రూపొందించారు. నియోజకవర్గాల్లో భద్రత, బందోబస్తుపై సీపీలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ సెంటర్లలో ఎన్నికల ఏర్పాట్లను ట్రై కమిషనరేట్ సీపీలు కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, అవినాష్ మహంతి, తరుణ్‌జోషి స్వయంగా పర్యవేక్షించారు. స్ట్రాంగ్ రూమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడి నుంచి కౌంటింగ్ కేంద్రాలకు ఈవీఎం బాక్స్‌లను తరలించే రూట్‌మ్యాప్‌లు, ఆ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పోలీస్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద చేయాల్సిన భద్రతా ఏర్పాట్లు, ఏజెంట్లకు, అధికారులకు మధ్య పటిష్టమైన బారికేడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని డీసీపీలకు సూచించారు.

సాంకేతికతకు పెద్దపీట

అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలోనూ పోలీసులు అత్యాధునిక సాంకేతికతను

మిగతా 6వ పేజీలో..

భద్రతా బలగాలు ఇలా..

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో కేంద్ర రాష్ట్ర బలగాలు కలిసి 15వేల మంది, సైబరాబాద్‌లో 7 వేలు, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 7వేల మంది పోలీసులు ఎన్నికల భద్రతా ఏర్పాట్లలో పాల్గొన్నట్టు పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. ట్రై కమిషనరేట్ పరిధిలో కేంద్ర రాష్ట్ర బలగాలు కలిపి మొత్తం 29వేల మంది పోలీసులతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్..

కమిషనరేట్ పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. కేంద్రం నుంచి 200 మీటర్ల వరకు గుంపులుగా జనం నిలబడటం నిషిద్ధం పోటీల్లో నిలబడిన అభ్యర్థులు సైతం కేవలం 3 కన్నా ఎక్కువ వాహనాలను ఉపయోగించకూడదు. ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాలకు వెళ్లే ఓటర్లు లోపలికి సెల్‌ఫోన్‌లను వెంట తీసుకెళ్లకూడదు. అభ్యర్థులకు, విధుల్లో ఉన్న అధికారులకు కూడా అనుమతిలేదు. ఈ విషయంలో అక్కడ ఉన్న ప్రిసైడింగ్ అధికారికి పూర్తి అధికారాలు ఉంటాయి.

నగరంలో తగ్గిన రద్దీ

- సంక్రాంతి, దసరాను మరిపించిన ఓట్ల పండగ



నిర్మానుష్యంగా ఆబిడ్స్ రోడ్డు

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి, దసరాను మరిపించేలా ఎన్నడూలేని రీతిలో ఓట్ల పండగకు నగరవాసులు ఊరెళ్లారు. దీనికితోడు వరుస సెలవులు, ఎండ కారణంగా హైదరాబాద్ సిటీలో ఆదివారం రద్దీ బాగా తగ్గింది. ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి. నిన్న, మొన్నటి వరకు కిలోమీటరు ప్రయాణానికి కూడా ఇబ్బందులు పడిన వాహనదారులు ఆదివారం సాఫీగా సాగిపోయారు. తెలంగాణలో పార్లమెంట్, ఏపీలోని అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మహానగరం ఖాళీ అయింది. సొంతూరులోనే తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని చాలామంది ఉత్సాహం చూపించిన తరుణంలో కాలనీలు, వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో సందడి తగ్గడం ఆశ్చర్యకంగా మారింది. ప్రధానంగా ఏపీ ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సొంతూళ్లకు పయనమయ్యారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే నగరం బోసిపోయింది.

పలు చోట్ల ఇబ్బందులు..

ఏపీ, తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన కొందరు అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు, ఆఫీసుల్లో సెక్యూరిటీగార్డులు, వాచ్‌మెన్లు, అటెండర్లు, ఎలక్ట్రీషియన్లుగా పనిచేస్తుంటారు. మరికొందరు భవన నిర్మాణ పనుల్లో వివిధ రకాల వృత్తులు చేపడుతుంటారు. వీరిలో చాలామంది ఓట్ల కోసం ఊర్లకు వెళ్లడంతో అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో ఉండే ప్రజలు ఆదివారం కొన్ని ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వాటర్ కేన్లు, ఎలక్ట్రికల్ పనులకు అవస్థలు పడ్డారు. వాహన డ్రైవర్లు కూడా అందుబాటులో లేకపోవడంతో కొంతమంది క్యాబ్‌ల ద్వారా అత్యవసర పనులను పూర్తి చేసుకున్నారు.

ఓటేసేందుకు వెళ్లని కార్మికులు
- చార్జీలభారంతో నగరంలోనే 4

అన్నా.. భారమంతా మీదే..!

● ఒక్క ఓటు కూడా మిస్ కావద్దు..!! ● నియోజకవర్గ ఇన్‌చార్జులకు అభ్యర్థుల విన్నపం

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఇన్నాళ్లూ చేసిన ప్రచారానికి, పడిన కష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తుందో.. లేదోనని పోటీ చేస్తున్న అభ్యర్థులు ఒత్తిడికి లోనవుతున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిలకు ఫోన్లు చేసి పోలింగ్ కేంద్రానికి ప్రతి ఓటరును తీసుకెళ్లాలని, చివరి గంట వరకు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఏమరుపాటుగా ఉంటే నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తోందని చెబుతున్నారు.

అసెంబ్లీ ఇన్‌చార్జిలపై భారం..!

అభ్యర్థులు భారమంతా అసెంబ్లీ ఇన్‌చార్జిలపై వేశారు. ఇప్పటివరకు వారు చెప్పిన విధంగా నడుచుకుని, అడిగినవన్నీ చేసిన అభ్యర్థులు.. పోల్ మేనేజ్‌మెంట్‌ను జాగ్రత్తగా చేపట్టాలని ప్రాధేయపడుతున్నారు. అన్నా.. మీరే ఎన్నికల్లో పోటీచేస్తున్నట్లుగా భావించండి.. తమను గట్టెక్కించాలని కోరుతున్నారు. నియోజకవర్గాల్లో తమ అనుచరులు, బంధువులను ఇన్‌చార్జిల వెంట ఉంచారు. ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లేందుకు వాహనాలు సమకూర్చుకోవాలని సూచిస్తున్నారు. కొంతమంది అభ్యర్థులు పార్టీ కీలక నేతలతో ఇన్‌చార్జిలకు ఫోన్లు చేయిస్తూ వారిని పురమాయిస్తున్నారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత ఆదుకుంటామని, అండగా నిలుస్తామని వారికి భరోసా ఇస్తున్నారు.



ఏజెంట్లను అప్రమత్తంగా ఉంచండి..!

పోలింగ్ బూత్‌ల్లో కూర్చునే ఏజెంట్లను అప్రమత్తంగా ఉంచాలని కోరుతున్నారు. పోలింగ్ సమయం ముగిసే వరకు ప్రతి ఓటును జాగ్రత్తగా గమనించాలని, దొంగ ఓట్లను కనిపెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పార్టీపై అభిమానం, సహనం ఉన్న వారినే ఏజెంట్లుగా నియమించాలని సూచిస్తున్నారు. పోలింగ్ సమయం దగ్గరపడుతున్న కొద్దీ అభ్యర్థుల్లో టెన్షన్ పెరగడం ప్రస్ఫుటమైంది.

ఆదివారం.. అభ్యర్థుల మంతనాలు

● పోల్ మేనేజ్‌మెంట్‌పై ఆరా
● ఓటర్లను పోలింగ్ బూత్‌కు తీసుకెళ్లేలా సూచనలు



హైదరాబాద్ సిటీ/అల్వాల్, మే 12 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు ఏప్రిల్ 18న ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి 23 రోజులుగా ప్రధాన పార్టీల అభ్యర్థులు అలుపెరగకుండా ప్రచారం నిర్వహించారు. బహిరంగ ప్రచారానికి తెరపడడంతో ఎన్నికల బరిలో నిలబడిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆదివారం తమ కార్యాలయాల్లో పోలింగ్‌పై ముఖ్యనేతలతో సమాలోచనలు చేశారు. ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రప్పించి ఓట్లు వేయించుకోవడంపై ముఖ్యనేతలతో, పోల్‌మేనేజ్‌మెంట్ బాధ్యులతో చర్చించారు.

ఫోన్‌లో సూచనలు చేసిన సునీతా మహేందర్‌రెడ్డి

● మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి మైనంపల్లి హనుమంతరావుతో కలిసి ఆదివారం సెగ్మెంట్‌ల వారీగా ముఖ్యులకు ఫోన్ చేసి ఓటర్లు పోలింగ్‌లో పాల్గొని కాంగ్రెస్‌కు ఓటు వేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. పోలింగ్ ఏజెంట్ల నియామకం పక్కాగా ఉండాలని, పోల్ మేనేజ్‌మెంట్ సక్రమంగా నిర్వహించాలని వివరించారు.

సన్నిహితులతో పోల్‌మేనేజ్‌మెంట్‌పై దానం ఆరా

● సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ ఉదయం ఇంట్లోనే ఉండి తన సన్నిహితులతో పోల్ మేనేజ్‌మెంట్‌పై ఆరా తీశారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ముఖ్య కార్యకర్తలతో సమావేశయ్యారు. ఆ తర్వాత సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య నేతలను ఇంటికి పిలిపించుకొని కాంగ్రెస్‌కు ఓట్లు అధికంగా పడేందుకు చేయాల్సిన కృషిపై దిశానిర్దేశం చేశారు. మధ్యాహ్నం వరకు సమావేశాలు నిర్వహించిన దానం నాగేందర్ ఆ తర్వాత ఇంటి నుంచి తన అత్యంత సన్నిహితులతో బయటకు వెళ్లినట్లు సమాచారం.

ఎమ్మెల్యేలతో రాగిడి సమాలోచన

● మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సెగ్మెంట్‌ల వారీగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో, ముఖ్య నాయకులతో సమాలోచనలు చేశారు. పోలింగ్ ఏజెంట్ల నియామకం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిచ్చారు. ఓటర్లను ప్రభావితం చేయగల ముఖ్యుల ఇళ్లకు వెళ్లి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. విజయం సాధించేందుకు ఈ ఒక్క రోజు సర్వశక్తులూ ఒడ్డాలని డివిజన్‌లోని ముఖ్య నాయకులకు ఫోన్‌లో సూచించారు.

ముఖ్యనాయకులకు సూచనలు చేసిన ఈటల

● మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఆదివారం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని సెగ్మెంట్‌ల వారీగా డివిజన్‌ల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. బీజేపీ ఓటర్లందరితో ముందుగా ఓట్లు వేయించాలని సూచించారు. పోలింగ్ రోజున చేయాల్సిన ఏర్పాట్లపై ముఖ్య నాయకులతో చర్చించారు.

ఇంట్లోనే మాధవీలత

హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలత ఆదివారం సంతోష్‌నగర్‌లోని తన ఇంట్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే, పోలింగ్ ఏజెంట్లతో సమావేశమై చర్చించారు. ఓటర్లను పూర్తిస్థాయిలో పోలింగ్ కేంద్రాలకు రప్పించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై బీజేపీ కార్యకర్తలు, నాయకులకు ఆమె దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది.

క్రికెట్ ఆడిన అసదుద్దీన్ ఒవైసీ

అసదుద్దీన్ ఒవైసీ శాస్త్రీపురంలోని తన ఇంట్లో నుంచి పోల్‌మేనేజ్‌మెంట్‌పై ముఖ్యులతో చర్చించారు. సాయంత్రం వేళ అసదుద్దీన్ ఒవైసీ శాస్త్రీపురంలోని ఓ వీధిలో క్రికెట్ ఆడారు. తన వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి పిల్లలు, పెద్దలతో కలిసి బ్యాటింగ్ చేశారు. రాత్రి వరకు ఇంట్లోనే ఉండి పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లతో పోలింగ్‌బూత్ ఏజెంట్లు, ఓటింగ్ నిర్వహణపై చర్చించారు.

ఇంట్లోనే సమీర్‌వలీ ఉల్లా

హైదరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సమీర్‌వలీ ఉల్లా ఉదయం నుంచి రాత్రి వరకు ఇంట్లోనే ముఖ్య నేతలతో గడిపారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని సెగ్మెంట్‌ల వారీగా నేతలు, బూత్ స్థాయి లీడర్లను పిలిపించుకొని మాట్లాడారు. బూత్‌ల వారీగా ఏజెంట్లకు దిశానిర్దేశం చేసిన్నట్లు తెలిసింది. పోలింగ్ సరళిపై ఎప్పటికప్పుడు సమాచారవివ్వాలని పలు సూచనలు చేశారు.

ఉదయం ఆలయాలకు సాయంత్రం పార్టీ ఆఫీసులో కిషన్‌రెడ్డి

● సికింద్రాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా శంకర్‌మఠ్ ఆలయంలో ఆదిశంకరాచార్యుల దర్శనం చేసుకున్నారు. ఆ తర్వాత అంబర్‌పేటలోని మహంకాళి అమ్మవారిని, సికింద్రాబాద్ గణేశ్ టెంపుల్‌లో స్వామివారిని, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని, బల్కంపేట ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు బీజేపీ సిటీ కార్యాలయంలోనే ఉన్న కిషన్‌రెడ్డి ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నేతలతో పోలింగ్ రోజు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు.

ఇంట్లో నుంచి ఆరా తీసిన పద్మారావుగౌడ్

● సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ ఉదయం నుంచి ఇంట్లోనే ఉండి పోల్ మేనేజ్‌మెంట్‌పై ఆరా తీశారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పలువురు ఎమ్మెల్యేలతో ఫోన్‌లో మాట్లాడారు. ముఖ్య నేతలను ఇంటికి పిలిపించుకొని మాట్లాడారు.

ఇళ్లకే పరిమితం!

ఓటేసేందుకు వెళ్లని కార్మికులు..! ● ఛార్జీల భారం తట్టుకోలేకనే..!!



హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఉంటున్న కార్మికులు, దినసరి కూలీలు ఓటు కోసం స్వగ్రామాలకు వెళ్లేందుకు డబ్బులు లేక ఇళ్లకే పరిమితమయ్యారు. మరి కొందరు శని, ఆదివారాల్లో స్వగ్రామాలకు బయలుదేరి వెళ్లారు. ఎన్నికల్లో ఓటేసేందుకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివాసముండే లక్షలాది మంది సొంతూళ్లకు వెళ్లారు. కొంత మంది సొంత వాహనాల్లో వెళ్లగా.. మరికొందరు స్థానిక నాయకుల సహకారంతో ప్రైవేట్, ఆర్టీసీ బస్సుల్లో వెళ్లారు. దీంతో నగరంలోని పలుచోట్ల జన సంచారం తగ్గింది.

నగరంలోనే తెలంగాణ కూలీలు..!

ఎన్నికల నేపథ్యంలో ఏపీలోని వివిధ జిల్లాలకు చెందిన ఓటర్లు నగరం నుంచి భారీగా తరలివెళ్లారు. నాలుగు రోజులుగా సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, లింగంపల్లి స్టేషన్ల నుంచి వెళ్లే రైళ్లు, జేబీఎస్, ఎంజీబీఎస్‌లోని బస్సులు కిటకిటలాడాయి. ప్రైవేట్ వాహనాల్లో కూడా వేలాదిగా తరలివెళ్లారు. ఏపీకి వెళ్లిన వారిలో సాధారణ ప్రజలతో పాటు కూలీలు కూడా అధికంగా ఉన్నారు. తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన కూలీల్లో చాలామంది నగరం విడిచి వెళ్లలేదు. మహబూబాబాద్ లోక్‌సభ సెగ్మెంట్‌లోని కేసముద్రం మండలంలోని వివిధ గ్రామాలు, తండాలకు చెందిన కొంతమంది కూలీలు నాగోలు, ఉప్పల్, పీర్జాదిగూడ ప్రాంతాల్లోని కంపెనీలు, అపార్ట్‌మెంట్లు, ఆఫీసుల్లో సెక్యూరిటీ గార్డులు, వాచ్‌మన్లు, అటెండర్లుగా పనిచేస్తుంటారు. వీరంతా గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటేసేందుకు స్వగ్రామాలకు వెళ్లారు. అప్పుడు ఫోన్ల మీద ఫోన్లు చేసిన నాయకులు ప్రస్తుతం ఒక్కసారి కూడా ఫోన్ చేయలేదని పలువురు వాపోయారు. ఓటు కోసం నగరం నుంచి ఊరెళితే ఒక్కో కుటుంబానికి రానుపోనూ ఖర్చులు రూ.1500 వరకు అవుతాయని, పని చేస్తేనే ఇల్లు గడిచే తాము చార్జీలు భరించి వెళ్లడం అవసరమా.. అని ఇక్కడే ఉన్నామని చెప్పుకొచ్చారు. అల్వాల్‌లో ఉండే కరీంనగర్ కూలీలు, సంతోష్‌నగర్, కర్మన్‌ఘాట్‌లో ఉండే మహబూబ్‌నగర్ వలస జీవులు ఇంటికే పరిమితమయ్యారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు వెళతాం..

ఐదు నెలల క్రితం ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓటేశామని, ప్రస్తుతం వెళ్లడం లేదని, స్థానిక సంస్థల ఎన్నికలకు తప్పకుండా సొంతూరు వెళ్తామని చెబుతున్నారు. స్థానిక ఎన్నికల్లో ఓటేయడం ద్వారా గ్రామంలో గుర్తింపు ఉంటుందని, ఎంపీ ఎన్నికలకు ఓటు వేసినా, వేయకున్నా.. ఎవరూ పట్టించుకోరని చెబుతున్నారు.



జేఎన్‌టీయూ కాలేజీ గ్రౌండ్‌లో సిబ్బందికి వీవీ ప్యాట్‌లు కేటాయిస్తున్న అధికారులు



నిజాంకాలేజీ గ్రౌండ్ నుంచి వీవీప్యాట్‌లతో వెళ్తున్న సిబ్బంది

సెలబ్రిటీలు ఓటేసేది ఇక్కడే

బంజారాహిల్స్, మే 12(ఆంధ్రజ్యోతి): నేడు జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో నగరంలోని పలు చోట్లు రాజకీయ, సినీ ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

- ప్రముఖ సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్, ప్రణతి దంపతులు ఓబుల్ రెడ్డి స్కూల్‌లో..
- అల్లు అర్జున్, స్నేహారెడ్డి, అల్లు అరవింద్, అల్లు శిరీష్ బీఎస్ఎన్ఎల్ సెంటర్ జూబ్లీహిల్స్‌లో..
- మహేశ్‌బాబు, నమ్రత, మంచు మోహన్‌బాబు, విష్ణు, లక్ష్మి, మనోజ్, విజయ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, శ్రీకాంత్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో..
- రాఘవేంద్రరావు, జీవిత, రాజశేఖర్, విశ్వక్‌సేన్, దగ్గుబాటి రాణా, సురేశ్ బాబు ఎఫ్ఎన్‌సీసీలో..
- చిరంజీవి, సురేఖ, రాంచరణ్, ఉపాసన, నితిన్.. జూబ్లీహిల్స్ క్లబ్‌లో..
- జూబ్లీహిల్స్‌లోని న్యూ ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో రవితేజ..
- నాగార్జున, అమల, నాగచైతన్య, అఖిల్.. వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో..
- వెంకటేశ్, బ్రహ్మానందం మణికొండ హైస్కూల్‌లో..
- రాజమౌళి, రమారాజమౌళి షేక్‌పేట్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో..
- హీరో రామ్ పోతినేని బంజారాహిల్స్‌లో ఎమ్మెల్యే కాలనీలో..
- హీరో నాని గచ్చిబౌలి జిల్లా పరిషత్ పాఠశాలలో..



పోలింగ్‌స్టేషన్‌లో వీవీ ప్యాట్‌లను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

180 మోడల్ పోలింగ్‌స్టేషన్లు

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ సందర్భంగా ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నిక సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 180 మోడల్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. జిల్లాలో గల 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కొక్క అసెంబ్లీ సెగ్మెంట్‌లో 5 మోడల్, 5 మహిళ, ఒకటి పీడబ్ల్యూడీ (దివ్యాంగుల కోసం), ఒకటి యూత్ మేనేజ్డ్ పోలింగ్ స్టేషన్. ఇలా ప్రతి నియోజకవర్గంలో 12 థీమ్ (మోడల్) పోలింగ్‌స్టేషన్ల చొప్పున 15 నియోజకవర్గాల్లో 180 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

బీజేపీకి వచ్చేది రెండు వందల సీట్లే

జస్టిస్ చంద్రకుమార్ ● ముగిసిన టీఎస్డీఎఫ్ బస్సు యాత్ర

పంజగుట్ట, మే 12 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి రెండు వందల కన్నా ఎక్కువ సీట్లు రావని జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. అధికారంలో ఉన్న ఈ పది సంవత్సరాల కాలంలో ప్రజలకు ఏమి చేశామో మోదీ చెప్పడం లేదని ఆయన విమర్శించారు. అనేక కొత్త, దుర్మార్గమైన చట్టాలు తీసుకొచ్చి అన్ని వర్గాల ప్రజల జీవితాలతో కేంద్రం ఆడుకుందని, రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదికల (టీఎస్డీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి చేపట్టిన బస్సు యాత్ర శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ రామదాసు అధ్యక్షతన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఇందులో పలువురు వక్తలు మాట్లాడారు. మోదీ అభివృద్ధి చేయకుండా తప్పుడు ప్రచారం చేస్తున్నారని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్ పద్మజా షా, నైనాల గోవర్ధన్, జె.వి. చలపతిరావు, ఎం.హన్మేశ్, కృష్ణ ప్రసాద్, ప్రొఫెసర్ అల్తాఫ్ జానయ్య, ఖలిదా పర్వీన్, అరుణ్ కుమార్, బిందు, మహేశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే డిగ్రీకాలేజీలో బాస్కెట్‌బాల్ కోర్టు ప్రారంభం

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని రైల్వే డిగ్రీకాలేజీ ఆవరణలో నూతనంగా ఏర్పాటుచేసిన బాస్కెట్‌బాల్ కోర్టును చీఫ్ పర్సనల్ మేనేజర్ జీఆర్ఎస్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలేజీ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తేనే సమగ్రమైన అభివృద్ధిని సాధించినట్లు అవుతుందన్నారు. నూతన బాస్కెట్‌బాల్ కోర్టు.. కళాశాల విద్యార్థుల్లో ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని నింపేందుకు దోహదపడుతుందని ఆకాంక్షించారు. డిప్యూటీ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ మురళీధర్ మాట్లాడుతూ.. రైల్వే డిగ్రీ కళాశాల ఇమేజ్‌ను పెంచేలా బీబీఏ, బీకామ్ ఫైనాన్స్ వంటి కొత్త కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సోపన్ కాశీనాథ్ మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితుల్లో రైల్వే డిగ్రీ కళాశాల గత వైభవాన్ని నిలుపుకోవాలనే కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు రైల్వే ఉన్నతాధికారులు, బాస్కెట్‌బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.



బాస్కెట్‌బాల్ కోర్టును ప్రారంభిస్తున్న రైల్వే సీపీఎం జీఆర్ఎస్‌రావు, డిప్యూటీ సీపీఎం మురళీధర్ తదితరులు

- రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో 543 పోలింగ్ స్టేషన్‌లు
- ఏర్పాట్లు పర్యవేక్షించిన ఆర్డీవో వెంకట్‌రెడ్డి
- సిబ్బందికి సామగ్రిని పంపిణీ చేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- పోలింగ్ స్టేషన్‌లకు వెళ్లిన సిబ్బంది

పోలింగ్‌కు సర్వం సిద్ధం

ఎన్నికల విధులలో 6వేల మంది సిబ్బంది



బస్సులో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఎన్నికల స్పింది



రాజేంద్రనగర్‌లోని వెటర్నరీ కళాశాల మైదానంలో ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఎన్నికల సిబ్బంది



ఈవీఎంలు, ఎన్నికల సామగ్రితో పోలింగ్ స్టేషన్‌లకు బయలు దేరిన ఎన్నికల సిబ్బంది



పోలింగ్ బూత్‌లో ఏర్పాట్లు చేసుకుంటున్న ఎన్నికల సిబ్బంది



అత్తాపూర్ రాంబాగ్ సమీపంలోని హైదరాబాద్ స్కాట్స్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది
- రాజేంద్రనగర్, ఆంధ్రజ్యోతి

రాజేంద్రనగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): నేడు జరుగునున్న పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని వెటర్నరీ కళాశాల ఎన్‌సీసీ మైదానంలో ఏర్పాటు చేసిన రాజేంద్రనగర్ నియోజకవర్గం ఈవీఎం యంత్రాల డిస్ట్రీబ్యూషన్ కేంద్రం వద్ద ఎన్నికల విధులలో పాల్గొంటున్న సిబ్బందికి చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక ఆధ్వర్యంలో ఈవీఎం యంత్రాలను, ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. నియోజకవర్గం పరిధిలో 543 పోలింగ్ స్టేషన్‌లు ఉండగా, సుమారు 6 వేల మంది ఎన్నికల సిబ్బంది డిస్ట్రీబ్యూషన్ కేంద్రం వద్దకు వచ్చి తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్‌లకు ఎన్నికల సామాగ్రిని తీసుకువెళ్లారు. అందుకు గాను 49 రూట్‌లను ఏర్పాటు చేసి బస్సులలో పోలీసు సిబ్బంది ని ఎస్కార్ట్‌గా పెట్టి ఆయా పోలింగ్ స్టేషన్‌లకు పంపించారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి దగ్గరుండి ఏర్పాట్లు చేశారు. రాజేంద్రనగర్, గండిపేట్, శంషాబాద్ తహసీల్దార్‌లు రాములు, శ్రీనివాస్‌రెడ్డి, నాగమణి వారికి సహకారం అందజేశారు. రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఉన్న 288 పోలింగ్ స్టేషన్‌లలో ఎన్నికల సిబ్బందికి కావల్సిన ఏర్పాట్లు, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండ రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవి కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

పోలింగ్ బూతులకు చేరిన సిబ్బంది

ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఎన్నికల సామగ్రి తీసుకున్న సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ బూత్‌లకు వెళ్లారు. పోలింగ్ స్టేషన్‌ల వద్ద మాడల్ పోలింగ్ స్టేషన్ అంటు స్వాగత ద్వారాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గం పరిధిలో ఐదు మహిళా మాడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిల్లో మహిళా అధికారులతో ఎన్నికల విధులు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఉప్పర్‌పల్లిలో ఒక పోలింగ్ కేంద్రాన్ని దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

పాతబస్తీలో ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- చాంద్రాయణగుట్టలో మొత్తం ఓటర్లు 3,49,611



గౌలిపురా పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన టెంట్

చాంద్రాయణగుట్ట/ మదీన, మే 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పార్లమెంట్‌కు సంబంధించి చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, బహదూర్‌పురా, చార్మినార్ నియోజకవర్గాలలో పోలింగ్‌కు సిబ్బంది ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. ఎండల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు ఏర్పాటు చేశారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో 3,49,611 ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,73,092, మహిళలు 1,75,645, ఇతరులు 35 మంది ఉన్నారు. 305 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 169 సున్నిత, అతి సున్నిత పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు ఏఆర్‌ఓ సురేందర్ తెలిపారు.

బహదూర్‌పురా నియోజకవర్గంలో...

బహదూర్‌పురా పరిధిలో 263 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్‌కు ఏర్పాట్లు చేసినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం బండ్లగూడలోని అరోరా లా కాలేజీ నుంచి ఎన్నికల సామగ్రితో సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.

భారీ బందోబస్తు

లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని దక్షిణ మండలం, సౌత్‌ఈస్ట్ మండలాల పరిధిలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసులతోపాటు ఇతర రాష్ట్రాల పోలీసులు, కేంద్ర బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఛత్రినాక ఏసీపీ డివిజన్ పరిధిలో 800 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఏసీపీ చంద్రశేఖర్ తెలిపారు. ఫలక్‌నుమా ఏసీపీ డివిజన్ పరిధిలో 600 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్న ఏసీపీ యాదగిరి స్వామి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/rze1eL7లో చదవండి.

Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.

నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

బెల్ట్ షాపుపై పోలీసుల దాడి 12 లీటర్ల మద్యం స్వాధీనం

హైదరాబాద్ సిటీ/ రాజేంద్రనగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా నగరంలో రెండు రోజులపాటు మద్యం దుకాణాలు బంద్ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయిన కొందరు అక్రమంగా బెల్టు షాపులో మద్యం విక్రయిస్తున్నారు. బండ్లగూడ సన్‌సిటీలోని పీ అండ్ టీ కాలనీలో లక్ష్మణ్ అనే వ్యక్తి బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నాడు. ఇతడు మద్యం బాటిళ్లు నిల్వ ఉంచి, అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. ఇతడి దందాపై పక్కా సమాచారమందుకున్న రాజేంద్రనగర్ ఎక్సైజ్ పోలీసులు లక్ష్మణ్ ఆదివారం అతడి ఇంటిపై దాడిచేసి, 12 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. డ్రైడే రోజు మద్యం విక్రయాలు చేస్తున్న పుప్పాలగూడలోని బెల్ట్‌షాపుపై దాడిచేసిన ఎక్సైజ్ పోలీసులు భారీగా మద్యం స్వాధీనం చేసుకున్నారు.

రాజేంద్రనగర్, చేవెళ్ల నియోజక వర్గాలలో భారీ బందోబస్తు



చింతమనేని శ్రీనివాస్, డీసీపీ

రాజేంద్రనగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాజేంద్రనగర్, చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో పరిధిలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ రాజేంద్రనగర్ డీసీపీ పరిధిలో 12 వందల మంది పోలీసు బృందంతో ఎన్నికల బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈవీఎం డిస్ట్రీబ్యూషన్ సెంటర్‌తోపాటు చేవెళ్లలోని ఓట్ల లెక్కింపు కేంద్రం బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి ఓటరు నిర్భయంగా పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటే వేయాలని అన్నారు. ఎన్నికల విధులకు, పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే వారిపూ కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించిన సైబరాబాద్ సీపీ మహంతి



ఎంఎం పహడీ, సులేమాన్‌నగర్ పోలింగ్ స్టేషన్‌లను పరిశీలిస్తున్న సీపీ మహంతి, రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తదితరులు

రాజేంద్రనగర్, మే12(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్‌తో కలసి ఆదివారం సందర్శించారు. సోమవారం జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా చేసిన ఏర్పాట్లను, బందోబస్తును ఆయన వారు పరిశీలించారు. అందుకు సంబంధించిన వివరాలను అధకారులను అడిగి తెలుసుకున్నారు.

తొలుత అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ స్టేషన్‌కు చేరుకుని అక్కడి ఏర్పాట్లను పరిశీలించిన సీపీ.. అనంతరం సిక్‌చావునీ, సెట్విన్, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం ప్రాంతాలలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మహంతి మాట్లాడుతూ, అత్యంత సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్‌లలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఎలాంటి సమస్యలు లేవని, ప్రతి ఓటరు వచ్చి నిర్భయంగా ఓటు వేయవచ్చని చెప్పారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతగా జరగడానికి పోలీసు సిబ్బందితోపాటు పారా మిలటరీ, స్పెషల్ పోలీసులు తొమ్మిది వేల మంది ఎన్నికల విధులలో ఉన్నారన్నారు.



మాతృమూర్తుల దినోత్సవాన్ని జరుపుకుంటున్న తల్లులు

మన్నా చర్చిలో మదర్స్ డే వేడుకలు

రాజేంద్రనగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): మదర్స్ డే ను పురస్కరించుకుని రాజేంద్రనగర్ మన్నా చర్చిలో మాతృమూర్తుల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రదర్ జోబ్ మాట్లాడుతూ, తల్లులు తమపిల్లలను పెంచే విషయంలో అందరికీ ఆదర్శంగా ఉండాలన్నారు. భారతదేశంలో మాతృమూర్తికి ఎంతో గౌరవం ఉన్నదని, ప్రతి తల్లి కుటుంబ విషయంలో, పిల్లలను పెంచే విషయంలో అసరమైన జాగ్రత్తలు తీసుకుని వారిని సన్మార్గంలో నడిపించాలన్నారు. అప్పుడు ఆ తల్లులకు మరింత గౌరవం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తల్లులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఓటు వేయడం మనందరి బాధ్యత: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్

రాజేంద్రనగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, ఓటే వేయడం మనందరి బాధ్యత అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.లక్ష్మణ్ అన్నారు. పౌరుల తలరాతలను మార్చే ఓటు హక్కు విషయంలో నిర్లక్ష్యం వహించొద్దని ఆయన సూచించారు. గుడ్ ఫ్రెండ్స్, చింతకుంట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం అత్తాపూర్ పరిధిలోని చింతకుంట పార్కులో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జస్టిస్ ఎం.లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యావంతులు, వివేకుల కంటే పెద్దగా చదువుకోని వారు చక్కగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారన్నారు. దేశ భవిష్యత్తును మార్చే పార్లమెంట్ ఎన్నికలలో కూడా మొదటి మూడు దశలలోనూ పోలింగ్ శాతం పడిపోవడం ఆందోళనకర పరిణామమని అన్నారు. ఈ పరిస్థితిని నివారించడానికి సోమవారం జరిగే ఎన్నికలలో తెలంగాణ రాష్ట్ర ప్రజలు పెద్దసంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ బిల్డర్ రామిరెడ్డి, సామాజిక కార్యకర్త, సీనియర్ జర్నలిస్టు మ్యాడం మధుసూదన్, వినోద్‌కుమార్, సుబ్బరాజు, సుధాకర్, ప్రభాకర్, ప్రవీణ్, నర్సింహ్మా, కొంగళ్ల శ్రీనివాస్, శెట్టిగారి శేఖర్, శ్రీధర్‌రెడ్డి, సిరిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఓటు వేస్తామని వాకర్స్ చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్

'సుఖీ' ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ప్రతినిధులు

బంజారాహిల్స్, మే 12 (ఆంధ్రజ్యోతి): సుఖీ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మదర్స్ డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్‌లో బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సుఖీ సేవా ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ శంకర్ మాట్లాడుతూ.. ప్రతినెలా తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రధాన ఆస్పత్రుల వద్ద రోగులకు, వారి సహాయకులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తుంటామని తెలిపారు. అందులో భాగంగా మదర్స్ డే సందర్భంగా కేన్సర్ ఆస్పత్రి వద్ద 800 మందికి అన్నదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు సాహిత్, రాంబాబు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల ఖని 'కోఠి'

తక్కువ ధరకే పాత, కొత్తవి అందుబాటులో

- జీ మ్యాట్ నుంచి ఎంసెట్, పీజీ సెట్ ఎంట్రెన్స్ పుస్తకాల వరకూ...
- 40 నుంచి 60 శాతం డిస్కౌంట్‌తో...
- కోఠిలోని సబ్‌వే, సుల్తాన్ బజార్, బ్యాంక్ స్ట్రీట్, ఆబిడ్స్, ప్రధాన రోడ్లపై..



ఆబిడ్స్ జీపీవో వద్ద పుస్తకాలు

మంగళ్‌హాట్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో నగరానికి వచ్చి కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటున్న పలువురు ఉద్యోగార్థులు కోఠికి వచ్చి వారికి నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ ఇంజనీరింగ్, మెడిసిన్, టీఎస్‌పీఎస్సీ యూపీఎస్సీ సివిల్స్ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు 40 నుంచి 60 శాతం డిస్కౌంట్‌తో షాపులలో విక్రయిస్తుంటారు. దాంతో సెలవు రోజులు, ఆదివారం వచ్చిందంటే చాలు కోఠి ప్రధాన రహదారుల్లోని ఫుట్‌పాత్‌లు, బడ్డీ కొట్ల వద్ద పుస్తకాల కోసం విద్యావంతులు, విద్యార్థులు బారులు తీరుతున్నారు.

> విద్య, ఉద్యోగాలు, పోటీ పరీక్షల కోసం కోటి ఆశలతో నగరానికి వచ్చే యువతకు ఆ ప్రాంతం దిక్సూచి. అక్కడ ప్రతి పుస్తకం తక్కువ ధరకే అందుబాటులో ఉంటుంది. ఇక్కడ ఫుట్‌పాత్‌లు, రోడ్డుకు ఇరువైపులా వందల సంఖ్యలో షాపులు ఉన్నాయి. వాటిల్లో పాత పుస్తకాలతోపాటు కొత్త పుస్తకాలు లభిస్తాయి. అందుకే వారికి 'కోఠి' విజ్ఞాన ఖనిలా మారింది.

ఆదివారం, సెలవు రోజుల్లో....

రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, మారు మూల పల్లెల నుంచి నగరానికి వచ్చి హాస్టల్‌లో ఉంటూ పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న పలువురు విద్యార్థులు కోఠిలోని సబ్‌వే, సుల్తాన్ బజార్ రోడ్, ఆబిడ్స్ జీపీఓ ప్రధాన రహదారి, బ్యాంక్ స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో ఉన్న షాపులకు వారికి అవసరమైనవి కొనుక్కుని వెళ్తున్నారు. ఇక్కడి షాపుల నిర్వాహకులు కొత్త పుస్తకాలను నేరుగా ప్రింటర్స్, పబ్లిషర్స్ నుంచి తీసుకురావడం వల్ల డిస్కౌంట్ కూడా అధికంగానే ఇస్తుంటారు. మరి కొంతమంది వ్యాపారులు కొద్ది రోజులపాటు పుస్తకాలను విద్యార్థులకు అద్దె (రెంట్)కు ఇస్తుంటారు. అందుకు వారు పూర్తి వివరాలతో పాటు కొంత మొత్తం నగదు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

ప్రతి పుస్తకం అందుబాటులో...

జీ మ్యాట్, క్యాట్, సాట్, ఎంసెట్, పీజీ సెట్, లాసెట్, జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్, ఎన్ఐఎఫ్‌టీ, నీట్, ఇంజనీరింగ్, ఏఐఐఎంఎస్, ఏఐఈఈడీ లాంటి పోటీ పరీక్షల పుస్తకాలతోపాటు ఐదారేళ్ల కిందటి ప్రశ్నపత్రాలు కూడా అందుబాటులో ఉంటాయి. ఐఐటీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, ఎంటెక్, బీఎస్సీ, ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, ఫార్మసీ, డిగ్రీ, మెడిసిన్, మెకానికల్, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజనీరింగ్‌తోపాటు పీహెచ్‌డీసీ పుస్తకాలు సైతం తక్కువ ధరలో దొరుకుతుంటాయి. ప్రముఖ కవులు రచించిన నవలలు, సాహిత్య పుస్తకాలు, గ్రంథాలు, కవితా సంపుటాలు, ఇలా అన్ని రకాల పుస్తకాలుకు కోఠి పెట్టింది పేరు.

సీజన్‌లో కాస్త లాభం ఉంటుంది



కోఠి ప్రధాన రహదారి ఫుట్‌పాత్ పై పుస్తకాల దుకాణాలకు అనుమతి ఉన్న సమయంలో మంచి వ్యాపారం సాగేది. సబ్‌వేకు మార్చిన తరువాత తగ్గింది. సీజన్‌లో మాత్రం రద్దీ అధికంగా ఉంటుంది. విద్యార్థులతో పాటు ప్రముఖులు వస్తుంటారు. ప్రముఖ రచయితల పుస్తకాల కోసం వచ్చిన సమయంలో పబ్లిషర్స్ నుంచి తెప్పించి ఇచ్చేందుకు ప్రయత్నిస్తుంటాం.

- అబ్దుల్(పుస్తకాల వ్యాపారి)



కోఠి ప్రధాన రహదారిలో పుస్తకాల అమ్మకాలు

విజ్ఞానానికి పెద్దపీట...

విద్యా సంవత్సరం ఆరంభంలో జూన్, జులై, ఆగస్టు నెలల్లో విద్యార్థులు పుస్తకాలు తీసుకునేందుకు ఎక్కువగా కోఠికి వస్తుంటారు. వార్షిక, సప్లిమెంటరీ పరీక్షల సమయంలో విద్యార్థులు పుస్తకాలు, పాత ప్రశ్నప్రతాలు కొనుగోలు చేస్తుంటారు. సాధారణ రోజులలో విద్యావంతులు, సాహితీ ప్రియులు విజ్ఞానాన్ని పెంచుకోవడానికి, మరికొంతమంది జనరల్ నాలెడ్జ్, ఇంగ్లిష్, సైన్స్‌కు సంబంధించిన పుస్తకాలు కొనుగులు చేస్తుంటారని వ్యాపారులు చెబుతున్నారు. అలాంటి వారి కోసం ప్రత్యేకంగా పబ్లిషర్స్ నుంచి తెప్పించి ఇస్తుంటామని, అందుకు ఎక్కువ ధర చెల్లించాల్సి ఉంటుందన్నారు.

పాత పుస్తకాలు తిరిగి ఇక్కడికే...

పుస్తకాలు కొన్న తరువాత తమ అవసరం తీరిన వారు తిరిగి అవి ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో మళ్లీ ఇక్కడి షాపుల వారికే అమ్మేస్తుంటారు. ముఖ్యంగా విద్యార్థులు తమ విద్యా సంవత్సరం పూర్తై వెళ్లిపోయే సమయంలో వాటిని ఎంతో కొంతకు వ్యాపారులకు ఇచ్చేస్తుంటారు.

మెండుగా ఆదాయం...

పాత పుస్తకాల దుఖాణదారులకు ఆదాయం మెండుగా ఉంటుంది. రోజు వేలల్లో వ్యాపారం సాగుతుందని, ముఖ్యంగా సెలవుదినమైన ఆదివారం రూ.10వేల నుంచి 20 వేల వరకు వ్యాపారం జరుగుతుందని ఓ వ్యాపారి తెలిపారు.

నేడు జూపార్కుకు సెలవు



మదీన, మే 12 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం జూపార్కుకు సెలవు ప్రకటిస్తున్నట్లు క్యురేటర్ డాక్టర్ సునీల్ ఎస్. హీరెమత్ ఓ ప్రకటనలో తెలిపారు. మరుసటి రోజు (14వ తేదీన) యథావిధిగా ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జూపార్క్ తెరిచి ఉంటుందని తెలిపారు. సందర్శకులు ఈ అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకోవాలని ఆయన కోరారు.



వాకథాన్‌లో పాల్గొన్న ఏఐజీ ఆస్పత్రి నర్సులు, డాక్టర్లు

నర్సులు ఆరోగ్య సంరక్షణ వ్యవస్థకు వెన్నెముక

● ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ డా.నాగేశ్వర్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): నర్సులు వ్యాధిగ్రస్తులకు, వారి కుటుంబాలకు దయతో కూడిన ఆరోగ్య సంరక్షణ, సహకారాన్ని అందిస్తూ మన ఆరోగ్య వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నారని ఏఐజీ ఆస్పత్రి ఛైర్మన్ డా.నాగేశ్వర్ రెడ్డి అన్నారు. వ్యాధిగ్రస్తుల ఆరోగ్య సంరక్షణలో అచెంచలమైన నర్సుల నిబద్ధతను అభినందిస్తున్నట్లు తెలిపారు. ఏఐజీ ఆస్పత్రి ఇంటర్నేషనల్ నర్సెస్ డే ఉత్సవం సందర్భంగా ఆదివారం గచ్చిబౌలిలో వెయ్యిమంది నర్సులతో ప్రత్యేక వాకథాన్ నిర్వహించారు. ఇంటర్నేషనల్ నర్సెస్ డే 2024ను 'మన నర్సులు.. మన భవిష్యత్తు, ఆరోగ్య సంరక్షణకు బలమైన శక్తి' అని ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ నర్సెస్ ప్రకటించిందన్నారు. ఏఐజీ ఆస్పత్రి నర్సింగ్ చీఫ్ బిందు జార్జ్ మాట్లాడుతూ నర్సింగ్ కేర్‌లో ఆర్థిక ప్రభావం ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ వైద్య సంరక్షణ అందించడమే కాకుండా, సమాజంలో చాలా మంది ఆర్థికంగా పురోగతి సాధించడంలో నర్సులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వాకథాన్‌లో ఈ సంవత్సరపు ఇంటర్నేషనల్ నర్సెస్ డే నేపథ్యాన్ని ప్రముఖంగా తెలియజేసే పోస్టర్లు, బ్యానర్లు చేతబట్టి ఉత్సాహంగా నర్సులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులను ఏకతాటిపైకి తెచ్చేందుకు కృషి

● ఇంటర్నేషనల్ వైశ్యఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా

ముషీరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ కృషిచేస్తున్నదని ఇంటర్నేషనల్ వైశ్యఫెడరేషన్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సికింద్రాబాద్‌జోన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. అనంతరం ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు అన్ని రంగాలలో రాణించేలా ఐవీఎఫ్ కృషిచేస్తున్నదన్నారు. పేద కుటుంబాలకు చెందిన ఆర్యవైశ్యులను ఆదుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుచేశారని పేర్కొన్నారు. ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ కమిటీ సలహాదారుడు సత్తయ్య, కోశాధికారి నారాయణ, అడిషనల్ సెక్రెటరీ శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శి సత్యనారాయణ, యువజన కమిటీ అధ్యక్షుడు రవీందర్, మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శి మంజుల తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ భగ్గుమన్న సూరీడు

● నగరంలో 40 డిగ్రీల ఎండ ● మధ్యాహ్నం పెరిగిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కాస్త కనికరించిన సూరీడు ఆదివారం మళ్లీ భగ్గుమన్నాడు. నగరంలో ఉష్ణోగ్రతలు ఆదివారం 40 డిగ్రీలకు చేరాయి. మధ్యాహ్నం పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో వడగాలుల తీవ్రత కూడా పెరిగింది. కార్వాన్ టోలీచౌకిలో 40.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం సాయంత్రం మబ్బులు కమ్ముకోవడంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. శివారు ప్రాంతాల్లో ఈదురుగాలులు వీచాయి. మరో రెండు రోజుల పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉరుములతో తేలికపాటి వర్షం కురిసే అవకాశముందని బేగంపేట వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

ఆదివారం నమోదైన ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్ఠం
కార్వాన్, టోలీచౌకి	40.8
బోరబండ	40.7
మాదాపూర్	40.7
అల్కాపురి	40.7
న్యూ మెట్టుగూడ	40.6
బంజారాహిల్స్	40.4
ఆస్మాన్‌గఢ్	40.4
అల్లాపూర్	40.4

బుల్లెట్‌కు మంటలు.. పేలిన పెట్రోల్ ట్యాంకు

● పదిమందికి గాయాలు, ముగ్గురి పరిస్థితి విషమం

● పాతబస్తీలో ఘటన.. ఉలిక్కిపడ్డ స్థానికులు

చార్మినార్ మే 12 (ఆంధ్రజ్యోతి): బుల్లెట్ బైక్ పెట్రోల్ ట్యాంక్ పేలి పది మందికి గాయాలైన సంఘటన పాతబస్తీ భవానినగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎన్నికల వేళ ఓ బుల్లెట్‌బైక్ పెట్రోల్‌ట్యాంక్ పేలిపోవడంతో పాతబస్తీ వాసులు ఉలిక్కిపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మొఘల్‌పురాలోని నాజర్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఆదివారం సాయంత్రం ఓ వ్యక్తి వెళుతున్న బుల్లెట్‌కు ఆకస్మాతుగా మంటలు వచ్చాయి. దాంతో వాహనదారుడు బుల్లెట్‌ను పక్కకు నిలిపాడు. పెద్దఎత్తున లేచిన మంటలను గమనించిన స్థానికులు వాహనంపై నీరుపోసి, తడిసిన గోనె సంచులు వేసి వాటిని ఆర్పడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో బుల్లెట్ పెట్రోల్ ట్యాంకు ఒక్కసారిగా పేలిపోయింది. దాంతో అగ్నికీలలను ఆర్పుతున్న పది మందికి మంటలు అంటుకొని గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న భవానినగర్ పోలీసులు క్షతగాత్రులను పలు ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. బుల్లెట్‌లో సాంకేతిక లోపం, నిర్వహణ సరిగా లేకపోవడం వల్లే ఈ పేలుడు సంభవించి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రుల వివరాలు తెలియరాలేదు.



బుల్లెట్ బైక్‌కు అంటుకున్న మంటలార్పుతున్న స్థానికులు

పెళ్లి చేసుకోవాలంటూ మైనర్‌కు వేధింపులు

● ఎక్స్ (ట్విటర్)లో ఫొటోలు.. ● యువకుడిపై కేసు

యూసుఫ్‌గూడ, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో ఓ బాలిక వెంట పడ్డాడు. పెళ్లి చేసుకోవాలంటూ వేధించాడు. బాలిక తిరస్కరించడంతో ఆమెతో దిగిన ఫొటోలను ఎక్స్(ట్విటర్)లో పెట్టి వేధించాడు. దాంతో బాలిక తల్లితో వచ్చి ఆ యువకుడిపై మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మధురానగర్ పీఎస్ పరిధికి చెందిన బాలిక తొమ్మిదో తరగతి చదువుతున్నది. తండ్రి చనిపోవడంతో తల్లితో కలిసి ఉంటోంది. గతేడాది డిసెంబర్‌లో బంధువుల ఇంట్లో జరిగిన పెళ్లికి బాలిక తన కుటుంబంతో కలిసి వెళ్లింది. అక్కడ ఓ యువకుడు పరిచయం అయ్యాడు. ఆ పరిచయాన్ని అడ్డుపెట్టుకున్న యువకుడు కొద్దిరోజుల తర్వాత ఎక్స్ (ట్విటర్)లో 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను.. పెళ్లి చేసుకుంటాను'.. అని బాలికకు మెసేజ్ పెట్టాడు. ఆమె అతని ప్రేమను తిరస్కరించింది. అనంతరం బాలికను అనుసరిస్తూ ఏ ఊరు వెళితే.. ఆ ఊరు వెళ్లడం, పెళ్లిచేసుకోవాలని ఒత్తిడి చేయడం, సోషల్ మీడియాలో మెసేజ్‌లు, ఫొటోలు పెట్టి వేధించడం చేశాడు. అతని వేధింపులు భరించలేని బాలిక తల్లితో కలిసి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటర్లు 1.12 కోట్లు.. అభ్యర్థులు 140 మంది

(3వ పేజీ తరువాయి)

పరిశీలిస్తారు. బ్యాలెట్ యూనిట్‌లోని గుర్తులపై ఓటు వేసి.. సరిగా పోలవుతున్నాయా.. లేదా..? అన్నది చెక్ చేస్తారు. సమయానికి ఏజెంట్లు రాని పక్షంలో 15 నిమిషాలు వేచి చూసి.. ప్రిసైడింగ్ ఆఫీసర్ మాక్ పోలింగ్ నిర్వహిస్తారు.

వసతుల ఏర్పాటు

ఎండల తీవ్రత/వర్ష సూచన నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు, తాగునీరు, ఇతరత్రా వసతులు కల్పిస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్ తెలిపారు. ఆదివారం డీఆర్‌సీ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్ చెయిర్లు, వాహనాలతో పాటు సహాయకులను నియవించారు. ఓటు వేసేందుకు లైన్‌లో నిలబడే ఓటర్ల దాహార్తి తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచనున్నారు. సాక్ష్యం యాప్ ద్వారా ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్న వారిని వాహనాల్లో తీసుకెళ్లనున్నారు.

జీహెచ్ఎంసీలో కంట్రోల్ రూమ్..

హైదరాబాద్ జిల్లాలో 45.91 లక్షల మంది ఓటర్లకుగాను, 3,986 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇందులో 383 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. సమస్యాత్మక కేంద్రాలతోపాటు.. అన్ని ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పరిస్థితిని వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పర్యవేక్షించనున్నారు. జీహెచ్ఎంసీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశారు. ఒక్కో సెగ్మెంట్‌కు ఆరుగురు చొప్పున కంప్యూటర్ ఆపరేటర్లు రెండు విడతల్లో 200 మంది పని చేయనున్నారు. 30 వేల మంది పోలింగ్, 15 వేల మంది పోలీస్ సిబ్బంది తో కలిపి మొత్తం 45 వేల మంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు.



గచ్చిబౌలి స్టేడియంలో ఈవీఎం గురించి వివరిస్తున్న అధికారి

కంటోన్మెంట్..	
పురుషులు	126699
మహిళలు	126997
థర్డ్ జండర్	10
మొత్తం	2,53,706
బరిలో ఉన్న అభ్యర్థులు	15
స్వతంత్రులు	9
పోలింగ్ కేంద్రాలు	232
బ్యాలెట్ యూనిట్లు	580
కంట్రోల్ యూనిట్లు	290
వీవీ ప్యాట్ యంత్రాలు	394
మొత్తం ఓటర్లు	45,91,201
పోలింగ్ కేంద్రాలు	3,986
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు	383
బ్యాలెట్ యూనిట్లు	12,521
కంట్రోల్ యూనిట్లు	5,268
వీవీ ప్యాట్ యంత్రాలు	6,039
ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఒక్కో ఈవీఎం	

దాదాపు రూ.50 కోట్లు..

మార్చి 16వ తేదీన ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగా అదే రోజు నుంచి తనిఖీలు మొదలయ్యాయి. ఇప్పటి వరకు రూ.23.84 కోట్ల నగదు, రూ.26.03 కోట్ల బంగారం, వెండి, ఇతర వస్తువులు, 27,715 లీటర్ల మద్యం సీజ్ చేశారు. నగదుతోపాటు వీటన్నింటి విలువ రూ.50 కోట్ల వరకు ఉంటుంది. 356 మందిపై కేసులు నమోదు కాగా.. 354 మందిని అరెస్ట్ చేసినట్టు రోనాల్డ్ తెలిపారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం..

● మేడ్చల్ జిల్లాలో 3228 పోలింగ్ కేంద్రాలు

● ఈవీఎం మొరాయిస్తే 10 నిమిషాల్లో మరమ్మతు

● ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ పోట్రు



మేడ్చల్ మే 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్వేచ్ఛాయుత వాతావరణంలో, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ పోట్రు కోరారు. జిల్లాలో ఇప్పటికే ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారి, సహాయ ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు ఓపీవోలు విధులు నిర్వర్తించనున్నారని తెలిపారు. ఒక్కొక్కరికి ఒక బాధ్యత అప్పగించామన్నారు. జిల్లాలోని 3228 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా వీటిలో అన్ని మౌలిక వసతులు కల్పించామన్నారు. దివ్యాంగుల కోసం ర్యాంపులు నిర్మించామని, పోలింగ్ కేంద్రాలను ఓటర్లు గుర్తించేలా ఏర్పాట్లు చేపట్టామన్నారు. ఈవీఎంలు మొరాయిస్తే 5 నుంచి 10 నిమిషాల్లో సరిచేసేలా ఏర్పాట్లు చేశామని ఎన్నికల అధికారి గౌతమ్ వివరించారు. ప్రజలందరూ తప్పక ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ..

మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు డీఆర్‌సీ కేంద్రాల నుంచి ఆదివారం ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. కీసరలోని డీఆర్‌సీ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ పోట్రు పరిశీలించారు. అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు.

శేరిలింగంపల్లిలో..

రంగారెడ్డి అర్బన్: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి శశాంక ఆదివారం చేవెళ్లలోని బీఎస్ఐటీ, శేరిలింగంపల్లిలోని ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబూషన్ సెంటర్‌ను సందర్శించారు. తాగునీటివసతి, వైద్యశిబిరం, అల్పాహారం, భోజన వసతి, టెంటు వంటి సౌకర్యాలను ఆయన పరిశీలించారు. కలెక్టర్ వెంట సహాయ రిటర్నింగ్ అధికారి స్నేహ, తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌కు పోస్టల్ బ్యాలెట్లు..

మల్కాజిగిరి పార్లమెంటు స్థానానికి నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను ఆదివారం కీసరలోని హోలిమేరీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లలో పోలైన పోస్టల్ బ్యాలెట్ సీల్డ్ బాక్సులను పోలీసు బందోబస్తు మధ్యన స్ట్రాంగ్ రూమ్‌లో వివిధ పార్టీల నాయకుల ఏజెంట్‌ల సమక్షంలో సీల్ చేసి భద్రపరిచినట్లు జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు.

బీఎస్ఐటీ కళాశాలకు చేవెళ్ల పోస్టల్ బ్యాలెట్లు..

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్లను గొల్లపల్లిలోని బీఎస్ఐటీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు. జిల్లా ఎన్నికల అధికారి శశాంక పర్యవేక్షణలో ఈ ప్రక్రియ ఆదివారం కొనసాగింది. ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్‌కుమార్ కటేరియాతో పాటు జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, చేవెళ్ల ఆర్డీవో సాయిరాం, ఆయా పార్టీల ఏజెంట్ల సమక్షంలో పోస్టల్ బ్యాలెట్‌లను జాగ్రత్తగా భద్రపర్చి, స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేశారు.



బీఎస్ఐటీలో స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న శశాంక

'స్మార్టు'గా ఓటేద్దాం

హైదరాబాద్ సిటీ, మే 12(ఆంధ్రజ్యోతి): కొన్ని చిన్నపాటి సూచనలు పాటించి అతితక్కువ సమయంలోనే స్మార్ట్‌గా ఓటేయచ్చని నిపుణులు చెబుతున్నారు. అవేంటో చూద్దాం.

- ఉదయం 7 నుంచి 9 మధ్యలో ఓటరు ఐడీతో పాటు ఏదైనా గుర్తింపు పత్రం తీసుకెళ్తే 10నుంచి 15 నిమిషాల్లో ఓటేసి బయటకు రావొచ్చు.
- ఓటేయడమే మొదటి పనిగా పెట్టుకొని ఆ తర్వాత ఇంట్లో పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- సెల్‌ఫోన్లు అనుమతించరు. కుటుంబసభ్యులంతా ఒకేసారి వెళ్తే.. ఒకేసారి ఓటేసి ఇంటికి వెళ్లొచ్చు.
- జాగింగ్, వాకింగ్, జిమ్‌కు వెళ్లేవారు ఓటర్ ఐడీ, ఆధార్ వంటి ధ్రువపత్రాలను వెంట తీసుకెళ్లి, ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు ఓటేసి వచ్చేలా ప్లాన్ చేసుకుంటే మంచిది.
- ముందుగానే పోలింగ్ కేంద్రం అడ్రస్ తెలుసుకోవడం బెటర్.
- ఓటరు స్లిప్పులు అందని వారు మొబైల్‌లో ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని స్లిప్‌లు పొందవచ్చు
- ఓటర్ ఐడీ మీద ఉన్న క్యూఆర్ కోడ్‌ను ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా స్కాన్ చేస్తే చాలు మీకు పూర్తి సమాచారం వస్తుంది.
- 1950 నంబర్‌కు ఈసీఐ అని టైప్‌చేసి స్పేస్ ఇచ్చి ఓటరు ఐడీని టైప్ చేసి ఎస్ఎంఎస్ చేస్తేచాలు.. కొద్ది సేపట్లో పార్టు నంబర్, సీరియల్ నంబర్, ఇతర అన్ని వివరాలు మెసేజ్ రూపంలో ప్రత్యక్షమవుతాయి. వాటిని పేపర్‌పై రాసుకొని వెళ్లి, పోలింగ్ కేంద్రంలో చూపితే వెంటనే మీకు స్లిప్ ఇస్తారు.

ఏదో ఒక గుర్తింపు కార్డు తప్పనిసరి



ఓటరు ఎపిక్ కార్డులేని వారు ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన కార్డుల్లో ఏదైన ఒకదానిని తప్పనిసరిగా తీసుకెళ్లాలని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ సూచించారు.

వీటిలో ఏదైనా ఒకటి..

- ఓటరు గుర్తింపు కార్డు
- ఆధార్ కార్డు
- ఎంఎన్ఆర్ఈజీఏ జాబ్‌కార్డు
- ఫొటోతో ఉన్న బ్యాంకు/ పోస్టాఫీస్ పాస్‌బుక్
- కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు
- డ్రైవింగ్ లైసెన్స్
- పాన్ కార్డు
- కార్మిక మంత్రిత్వ శాఖ పథకం ద్వారా జారీచేసిన స్మార్ట్ కార్డు
- పాస్‌పోర్టు
- ఫొటోతో ఉన్న పెన్షన్ డాక్యుమెంట్
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంచే జారీ చేయబడిన ఉద్యోగ గుర్తింపు కార్డు
- ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డు
- యూనిక్ డిసేబిలిటీ గుర్తింపు కార్డు

భద్రత కట్టుదిట్టం

(3వ పేజీ తరువాయి)

ఉపయోగిస్తున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలను జియోట్యాగింగ్ చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వివరాలు గూగుల్‌లో నిక్షిప్తం అయ్యాయి. పోలింగ్ కేంద్రం నంబర్‌ను గూగుల్‌లో సెర్చ్ చేయగానే అక్కడ ఓటింగ్ శాతం, ప్రస్తుత పరిస్థితి సహా.. అన్ని వివరాలు వచ్చేలా పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో మైక్రో అబ్జర్వర్లు, వెబ్‌కాస్టింగ్, సీసీటీవీకెమెరాల నిఘా, ఫ్లయింగ్ స్క్వాడ్స్, మొబైల్ రూట్స్, పీటీజెడ్ కెమెరాలు కలిగిన ఒక్కో కమిషనరేట్‌లో మూడు మొబైల్ వ్యాన్లు ఏర్పాటు చేశారు. ఒక్కో పీటీజెడ్ కెమెరా సుమారు ఒక కిలోమీటర్ మేర ప్రాంతాన్ని కవర్ చేస్తుంది. ఆ కెమెరాలను పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రధాన కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశారు. పీటీజెడ్ కెమెరాలు అమర్చిన వాహనాలు నిత్యం తిరుగుతూనే ఉంటాయి. ఎక్కడ ఎలాంటి అనుమానాస్పద సంఘటన గుర్తించినా ఆ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులకు ఐటీ సెల్ నుంచి వెంటనే సమాచారం వెళ్తుంది. ఎలక్షన్ సెల్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న అధికారుల మధ్య సమాచార వ్యాప్తికి ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేశారు. ప్రతి నియోజక వర్గానికి ఏసీపీ స్థాయి అధికారిని నోడల్ ఆఫీసర్‌గా, డీసీపీ ర్యాంక్ అధికారికి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. వారు ఎలక్షన్ కమిషన్ ఆదేశాలమేరకు అన్ని పోలింగ్ కేంద్రాలను పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తారు. అక్కడి సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి పరిష్కారామార్గాలపై చర్యలు తీసుకుంటారు.



రాచకొండలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ తరుణ్ జోషి

ఓటేయండి ప్లీజ్..

● గడప దాటని కాలనీ, గేటెడ్ కమ్యూనిటీ ఓటరు



హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్.. అడ్డాకూలీల నుంచి ఐటీ ఉద్యోగుల వరకు.. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు.. ప్రముఖ పారిశ్రామికవేత్తలు, సినీ, క్రీడా ప్రముఖులు ఉండే మహానగరం. అక్షరాస్యులు అధికంగా ఉండే గ్రేటర్‌లో ఎన్నికల వేళ నిర్లిప్తత కనిపిస్తోంది. అసెంబ్లీ, పార్లమెంట్, జీహెచ్ఎంసీ.. ఎన్నిక ఏదైనా ఓటర్లు గడప దాటడం లేదు. 45 నుంచి 50 శాతానికి మించి పోలింగ్ నమోదవడం లేదు. అక్షరాస్యులు, ఉద్యోగులు తక్కువగా ఉండే గ్రామీణ ప్రాంతాల్లో భారీగా పోలింగ్ నమోదవుతుండగా.. విద్యావంతులుండే హైదరాబాద్‌లో అందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. నగరంలోని బస్తీలు, మురికివాడల్లో నమోదవుతోన్న పోలింగ్‌తో పోలిస్తే కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీల్లో తక్కువగా ఉండడం గమనార్హం. పార్టీల తీరు.. అభ్యర్థులు నచ్చక పోలింగ్‌కు రావడం లేదని కొందరు చెబుతున్నా, నోటాకైనా ఓటు వేయాలని ప్రజాస్వామికవాదులు సూచిస్తున్నారు. నగరంలో 50 శాతంలోపు పోలింగ్ నమోదవుతోన్న నేపథ్యంలో మెజార్టీ ఓటర్ల ప్రమేయం లేకుండానే ప్రజాప్రతినిధుల ఎన్నిక జరుగుతోంది. వర్షం పడినా.. రోడ్లపై మురుగు పొంగిపొర్లినా.. గాలికి చెట్టు కూలినా.. సామాజిక మాధ్యమాల్లో పోస్టులతో హోరెత్తించే నగరవాసుల్లో కొందరు ఓటు వేసేందుకు మాత్రం ఆసక్తి చూపడం లేదు.

బాధ్యత మరిచి..

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం. ఒక్క ఓటు ఒక్కోసారి అభ్యర్థుల తలరాత మారుస్తుంది గెలుపోటములను నిర్ణయిస్తుంది. 'మనం ఒక్కరం ఓటు వేయకుంటే ఏమవుతుంది' అనే భావన వీడాలని ప్రముఖులు సూచిస్తున్నారు. 'ఓటు వేయని వారికి సమస్యలపై ప్రశ్నించే హక్కు లేదు. కూర్చున్న చోటు నుంచి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేయడం కాదు. గడప దాటి రండి.. ఓటింగ్‌లో పాల్గొనండి' అని పలుమార్లు సుతిమెత్తగా హెచ్చరిస్తోన్నా అదే పరిస్థితి. పోలింగ్ రోజు సెలవు దినంగా ఎన్నికల సంఘం ప్రకటించింది. కార్యాలయాలే కాదు.. వ్యాపార, వాణిజ్య సంస్థలు.. చివరకు హోటళ్లూ తెరవకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయినా పోలింగ్ రోజు సరదాగా గడిపేందుకు కొందరు ప్రాధాన్యమిస్తున్నారు. నగర ఓటరూ.. ఈ సారైనా కాలు కదపండి.. దేశ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికల్లో పాల్గొనండి. నచ్చిన అభ్యర్థికి ఓటు వేయండి.

తెలంగాణలో బీజేపీకి డబుల్ డిజిట్ ఖాయం

● ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

ముషీరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ డబుల్ డిజిట్ సాధించడం ఖాయమని ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మోదీ హవా నడుస్తున్నదని, తెలంగాణలో సైతం అత్యధిక ఎంపీ సీట్లు సాధించుకుంటామని అన్నారు. ఎన్నికల అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీలో చేరుతారని జరుగుతున్న ప్రచారంలో తమ పార్టీకి సంబంధం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతల కుమ్ములాటలు, ఆధిపత్యపోరుతో ప్రభుత్వం ఎప్పుడు కూలిపోతుందో చెప్పలేమని అన్నారు. ప్రభుత్వాన్ని కూల్చాలనే ఆలోచన బీజేపీకి లేదని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగానే బీజేపీ ఏదైనా సాధిస్తుందన్నారు. బీఆర్ఎస్ పరిస్థితి రాష్ట్రంలో దారుణంగా ఉందని, ఒక్కసీటు కూడా గెలిచే అవకాశం లేదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ రమేష్‌రాం, ఎన్నికల పరిశీలకులు వేముల అశోక్, బీజేపీ రాష్ట్ర నాయకుడు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కె. లక్ష్మణ్

గణనాథునికి కిషన్‌రెడ్డి పూజలు

రెజిమెంటల్‌బజార్, మే 12(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి గణేశుడిని దర్శనం చేసుకున్నారు. ఆదివారం సికింద్రాబాద్ గణేష్ టెంపుల్‌లో ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో విఘ్నేశ్వరుడి ఆశీస్సులు పొందడానికి కిషన్‌రెడ్డి ఆలయం సందర్శించినట్లు స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొంతం నరేష్ తదితరులు పాల్గొన్నారు.



గణేష్ టెంపుల్‌లో ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ కొంతం దీపిక

220కేవీ ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్‌లో

కాలిన కేబుళ్లు

● 17 సబ్‌స్టేషన్లకు అరగంట పాటు నిలిచిన విద్యుత్‌సరఫరా

● కేబుల్స్ కాలిన తీరుపై అనుమానాలు.. పోలీసులకు ఫిర్యాదు

● పరిశీలించిన సీఎండీ ముషారఫ్ ఫరూకి

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ ఈహెచ్‌టీ (ఎక్స్‌ట్రా హైటెన్షన్) సబ్‌స్టేషన్‌లో రోడ్డుపక్కన రాయదుర్గ్- మియాపూర్‌కు వెళ్లే 220 కేవీ విద్యుత్ కేబుల్ ఆదివారం ఉదయం కాలిపోయింది. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలోని కైతలాపూర్, మియాపూర్ 132/33 కేవీతో పాటు 17సబ్‌స్టేషన్లకు అరగంటకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కేబుళ్లు కాలిపోయినట్లు గుర్తించిన విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది ప్రత్యామ్నాయ సర్క్యూట్ ద్వారా 35 నిమిషాల్లో సబ్‌స్టేషన్లకు విద్యుత్‌సరఫరాను పునరుద్ధరించినట్లు అధికారులు తెలిపారు. ఎండలు 44-45 డిగ్రీల వరకు చేరి అత్యధిక డిమాండ్ 4,350 మెగావాట్లకు చేరినప్పుడు కేబుల్స్‌లో ఎలాంటి ప్రమాదం జరగలేదని, ఆదివారం ఉదయం డిమాండ్ తక్కువగా ఉన్నప్పుడు ఇలాంటి ప్రమాదం జరగడం, కేబుల్‌పై భాగంలో ఉన్న ఇన్సులేషన్ ఎక్కువ కాలిపోవడంపై విద్యుత్‌శాఖ అనుమానాలు వ్యక్తం చేస్తోంది. కేబుల్ కాలిపోయిన సంఘటనపై తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ రిజ్వీ పోలీస్ విచారణకు ఆదేశించారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని దక్షిణ ప్రాంత విద్యుత్‌పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూకి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీని ప్రభావం విద్యుత్ సరఫరాపై పడకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకున్నామని తెలిపారు. సిబ్బంది, అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, సబ్ స్టేషన్లు, ఇతర పీటీఆర్‌ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. టీఎస్ ట్రాన్స్‌కో డైరెక్టర్ ట్రాన్స్‌మిషన్ జగత్‌రెడ్డి, మాదాపూర్ జోన్ డిప్యూటీ కమిషనర్ డా.వినీత్, రంగారెడ్డి జోన్ సీజీఎం ఆనంద్, సైబర్‌సిటీ ఎస్ఈ వెంకన్న, మేడ్చల్ ఎస్ఈ మోహన్‌లు ఉన్నారు.



కాలిపోయిన కేబుల్ పరిశీలిస్తున్న ముషారఫ్ ఫరూకి, పోలీస్ అధికారులు

కేబుల్ కాలిపోవడంపై అనుమానాలు...?

సాధారణంగా విద్యుత్‌కేబుల్ కాలిపోతే లోపల తీగలు కాలిపోతుంటాయి. కానీ ఇక్కడ కేబుల్ పై భాగంలో ఉండే ఇన్సులేషన్ కాలిపోయింది. కేబుల్ పైభాగం మాత్రమే చాలావరకు కాలిపోయి ఉండటంతో ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోలు పోసి అంటించారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత కొన్ని రోజులుగా విద్యుత్‌సరఫరా అంతరాయాలు పెరిగాయంటూ సోషల్ మీడియాలో కొంతమంది తప్పుడు ఆరోపణలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో సబ్‌స్టేషన్లకు విద్యుత్‌సరఫరా అయ్యే కేబుల్ కాలిపోతే గంటల కొద్దీ సరఫరా నిలిచిపోతుందనే కారణంతో ఎవరైనా కావాలనే కేబుల్స్ కాల్చి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


సికింద్రాబాద్‌పై బీఆర్ఎస్ జెండా ఎగిరి తీరుతుంది

● ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్

బర్కత్‌పుర, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎంపీ ఎన్నికల్లో సికింద్రాబాద్‌పై బీఆర్ఎస్ జెండా ఎగిరి తీరుతుందని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అప్పుడే విరక్తి మొదలైందని, కేసీఆర్ పాలనను వారు జ్ఞాపకం తెచ్చుకుంటున్నారని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజల చేతిలో వారికి గుణపాఠం తప్పదని అన్నారు. అంబర్‌పేట నియోజకవర్గం చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బిల్డర్ ప్రవీణ్‌తో పాటు పలువురు నేతలు ఆదివారం పద్మారావుగౌడ్‌ను కలిసి ఎన్నికల సరళి, ప్రచార వివరాలు, ప్రజల నుంచి వచ్చిన స్పందన పద్మారావుగౌడ్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని పోలింగ్ శాతం పెరగడానికి కృషి చేయాలని కోరారు. పద్మారావును కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు సుభాష్‌నాయక్, రాజ్‌కుమార్, రాఘవేంద్ర, మధుసూదన్, శివకుమార్, అనిల్‌కుమార్, వంశీ, రాజేష్, లడ్డు ఉన్నారు.



పద్మారావుగౌడ్‌ను కలిసిన బిల్డర్ ప్రవీణ్ తదితరులు



నెహ్రూ కన్నా

మా నాన్నకే ఓట్లు ఎక్కువ

మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికలు (1952)లో నెహ్రూకన్నా ఎక్కువ ఓట్లు రావి నారాయణ రెడ్డికి మాత్రమే వచ్చాయని అనుకుంటారంతా. కానీ నల్లగొండ పార్లమెంటు ద్విసభ్య స్థానం నుంచి పోటీ చేసిన మరొకరికి కూడా తొలి ప్రధానికన్నా మిన్నగా ఓట్లు పోలైన విషయం పెద్దగా వెలుగులోకి రాలేదు. 27 ఏళ్లకే మొదటి పార్లమెంటులో అడుగుపెట్టి, సభలో పిన్నవయస్కుడిగా చరిత్రకెక్కిన ఆ నాయకుడు సుంకం అచ్చాలు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తనదైన పాత్ర పోషించారు. జీవితాంతం సామ్యవాద సిద్ధాంతానికి నిబద్ధుడైన అచ్చాలు జీవిత విశేషాలను.... ఆయన కుమార్తె సుంకం ఆలోచన 'నవ్య'తో చెబుతున్నారిలా...

మా నాన్న సుంకం అచ్చాలు నల్లగొండకు మొదటి లోక్‌సభ సభ్యుడిగా ప్రజా సేవ చేశారు. ఇప్పటి రాజకీయనాయకుల్లా కాకుండా, చివరి శ్వాస వరకు అత్యంత నిజాయితీగా బతికారు. ఆస్తిపాస్తులకన్నా విలువైన ప్రజాభిమానాన్ని సంపాదించారు. బతికినన్నాళ్లు నిఖార్సయిన కమ్యూనిస్టుగా జీవించారు. సుంకం అచ్చాలు అంటే రావి నారాయణరెడ్డి గారి మొదలు గుడిసెల్లోని జనం వరకు... అందరూ అభిమానించేవారు. బొమ్మగాని ధర్మభిక్షంగారైతే మా నాన్న లేకుండా నల్లగొండలో ఒక్క సభ కూడా నిర్వహించేవారు కాదు. దొడ్డా నర్సయ్య, ఉప్పల్ మల్సూర్ లాంటి ఆనాటి కమ్యూనిస్టు పార్టీ ఎమ్మెల్యేలు కొందరు ఎన్నో సాయంత్రాలు మా ఇంటి ముంగిట నులక మంచం మీద కూర్చొని ప్రజా సమస్యలమీద చర్చించుకోవడం నాకు బాగా గుర్తు. పెద్దగా చదువుకోకున్నా, మా నాన్నకు తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు భాషలు వచ్చు. కమ్యూనిస్టు పార్టీ పుస్తకాలు ఎక్కువగా చదివేవారు. కౌలుదారుల పక్షాన కొట్లాడి, చాలామందికి ఇనాం భూములతో పాటు నిరుపేదలకు ఇళ్ళ స్థలాలు ఇప్పించారు. నల్లగొండలోని రిక్షా కార్మికుల సహకార సంఘం కార్యదర్శిగా వారికి బ్యాంకు నుంచి రుణాలిప్పించడం లాంటి పనులు చాలానే చేశారు. నల్గొండ చుట్టుపక్కల గ్రామాల్లోని చాలామంది మా నాన్నను ఇప్పటికి యాది చేసుకొంటారు.

> పార్లమెంటు సమావేశాలకు మా నాన్న సుంకం అచ్చాలు... వరంగల్ లోక్‌సభ సభ్యుడు పెండ్యాల రాఘవరావు గారు కలిసి వెళ్లేవారు. వీరిద్దరికీ కలిపి ఢిల్లీలో ఒకే క్వార్టర్ ఇచ్చారట. మొదటి లోక్‌సభ సభ్యుల గ్రూప్ ఫొటోలోనూ ఇద్దరూ పక్కపక్కనే కనిపిస్తారు. ఒకరికొకరు చాలా స్నేహంగా మెలిగేవారు. సాటి మనిషి ఆపదలో ఉంటే చూస్తూ ఊరుకునే రకం కాదు మా నాన్న. అచ్చంపేట నుంచి శాసనసభకు పోటీ చేస్తున్న సమయంలో ఒకరోజు ప్రచారానికి బాడుగ కారులో వెళుతుండగా దారిలో ప్రత్యర్థి పార్టీ కార్యకర్త ఒళ్ళంతా దెబ్బలతో కనిపించాడట. ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా వెంటనే అతన్ని కారులో ఎక్కించుకొని దగ్గర్లోని ఆస్పత్రికి తీసుకెళ్లి దగ్గరుండి మరీ చికిత్స చేయించారట. దీన్ని ప్రత్యక్షంగా చూసిన కందిమళ్ళ ప్రతాపరెడ్డిగారు ఈ సంగతి చెప్పారు.

మా ఇల్లు ఓ రహస్య స్థావరం

మా పూర్వీకులది కర్నూలు జిల్లా. మా తాతయ్య కాశయ్య బతుకుతెరువు కోసం కర్నూలు నుంచి కాలినడకన నల్లగొండకు వచ్చాడు. చెప్పులు కుట్టే వృత్తిని వదిలేసి వ్యవసాయం చేయడం మొదలుపెట్టాడు. నల్లగొండ జైలుఖానాలో తోటమాలిగానూ పని చేసేవాడు. ఆయన రెక్కల కష్టంతో మాన్యం చెలకలో కొంత భూమి కొన్నాడు. బొట్టుగూడాలో పెద్ద ఇల్లు కట్టాడు. అది ఎంతోమందికి ఆశ్రయమిచ్చింది. అన్నపూర్ణలా ఎంతోమంది ఆకలి తీర్చింది. మాకేమైనా ఆస్తి ఉందంటే, అది మా తాత సంపాదించి ఇచ్చిందే. ఒకవైపు మా తాత కష్టపడుతూ ఉంటే, మరోవైపు మా నాన్న కమ్యూనిస్టు పార్టీ రాజకీయాలలో తీరిక లేకుండా ఉండేవారు. ఆంధ్రమహాసభ కార్యక్రమాల్లో కార్యకర్తగా చాలా చురుగ్గా పాల్గొన్నారని విన్నాను. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలంలో మా ఇల్లు ఒక పెద్ద రహస్య స్థావరం. కొద్దిమంది నాయకులు మా ఇంట్లో అజ్ఞాత జీవితాన్ని గడిపారు. ఒకరోజు పోరాట దళాలకు సమాచారం చేర్చడం కోసం కొరియర్‌గా కందిమళ్ళ ప్రతాపరెడ్డి గారు మా ఇంటికొచ్చారట. ఈ విషయాన్ని ఆయనే ఒకసారి గుర్తు చేసుకొన్నారు. అలా మాకు తెలియడమే కానీ, మా నాన్న ఎన్నడూ తన గురించి ఏమీ చెప్పలేదు. మా నాన్న అని గొప్పగా చెప్పడం కాదు కానీ, 'సుంకం అచ్చాలు అంటే మితభాషి, సౌమ్యుడు, స్నేహశీలి' అని సురవరం సుధాకర్‌రెడ్డి గారి లాంటి నాయకులు గొప్పగా చెప్పగా విన్నాం.

> **దిగువసభలో చిన్నవాడు**
>
> మొట్టమొదటి ఎన్నికలు 1952లో నల్లగొండ పార్లమెంటు ద్విసభ్య స్థానం(ఎస్సీ, జనరల్) పోటీలో పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్(పీడీఎఫ్) అభ్యర్థులు మా నాన్న సుంకం అచ్చాలు, రావి నారాయణరెడ్డి.... కాంగ్రెస్ నాయకులు పి.మహేంద్రనాథ్, వి.భాస్కర రావు మీద మంచి మెజారిటీతో గెలిచారు. అప్పుడు రావి నారాయణరెడ్డి గారికి 3,09,162 వస్తే, మా నాన్నకు 2,82,117 ఓట్లు పోలయ్యాయి. యూపీలోని ఫుల్పూర్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన జవహర్‌లాల్ నెహ్రూకు 2,33,571 ఓట్లు వచ్చాయి. అలా ఆ ఎన్నికల్లో దేశంలోనే అత్యధిక ఓట్లు పోలైన అభ్యర్థులుగా రావి నారాయణరెడ్డి, సుంకం అచ్చాలు చరిత్ర సృష్టించారు. అందుకుగాను ఇద్దరినీ పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ సన్మానించారు. 27 ఏళ్ళ వయసులో మొదటి లోక్‌సభకు ఎన్నికైన మా నాన్న దిగువసభలోని మిగతా సభ్యుల్లోకెల్లా చిన్నవాడట. అందుకు ఆనాటి పార్లమెంటులోని పెద్దలంతా నాన్నను ప్రత్యేకంగా అభినందించారని విన్నాను. అచ్చంపేట శాసనసభ స్థానం నుంచి 1962 ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా నాన్న పోటీచేసి కొద్ది ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆయనకు అస్సలు పరిచయం లేని అచ్చంపేట నుంచి పోటీకి నిలబెట్టడమే అందుకు ప్రధాన కారణం. అయినా, నాన్న ఎన్నడూ కుంగిపోలేదు. విజయాన్ని, ఓటమిని సమంగా స్వీకరించే స్థితప్రజ్ఞత మా నాన్న సొంతం.

మా నాన్న మంచి దర్జీ కూడా

మేము మొత్తం ఏడుగురు సంతానం. ముగ్గురు అన్నదమ్ములు, నలుగురు అక్కచెల్లెళ్లం. నేను రెండో బిడ్డను. ప్రతి మనిషి జీవితానికి ఆ వ్యక్తి ఆలోచనే ఆధారమని మా నాన్న నమ్మకం. అందుకే నాకు 'ఆలోచన' పేరు పెట్టారు. విశాలాంధ్ర ఉద్యమం సమయంలో పుట్టిందని మా చెల్లెలికి 'విశాలాంధ్ర' అని నామకరణం చేశారు. మా నాన్నకు మొదట 'షెడ్యూల్ క్యాస్ట్ ఫెడరేషన్' పార్టీతో అనుబంధం ఉన్నదని చరిత్ర పరిశోధకుడు సంగిశెట్టి శ్రీనివాస్ గారు రాసిన వ్యాసం చదివాకే మాకు తెలిసింది. అయితే, తను ఎంపీగా ఉన్న సమయంలో ఢిల్లీలో అంబేడ్కర్ గారిని కలిశానని నాన్నే ఒక సందర్భంలో స్వయంగా చెప్పారు. ఆ మహనీయుడి మీద అభిమానంతో మా చిన్న తమ్ముడికి 'అంబేడ్కర్' అని పెట్టారు. ప్రతి పండుగకు పిల్లలందరికీ నాన్నే దుస్తులు కుట్టేవారు. దర్జీ పని బాగా వచ్చు. ఎంపీ పదవి ముగిసిన తర్వాత చాలాకాలం మా నాన్న దుస్తులు కుట్టారు. కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకోకపోయినా, జీవితాంతం భారత కమ్యూనిస్టు పార్టీ సానుభూతిపరుడిగానే కొనసాగారు. మొట్టమొదటి ఎన్నికలప్పుడు నల్లగొండలో పార్టీ జిల్లా కార్యాలయం కోసం వకీలు అబ్దుల్ లతీఫ్ ఇంటిని అద్దెకు తీసుకొన్నారు. కొద్ది రోజుల తర్వాత స్థానిక కాంగ్రెస్ నాయకులు ఇబ్బంది పెట్టడంతో, మా ఇల్లే కమ్యూనిస్టు పార్టీ కార్యాలయం అయింది. నల్లగొండకు ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు ఎవరు వచ్చినా నేరుగా మా ఇంటి దగ్గరే దిగేవారు. ఎంతమంది వచ్చినా మా అమ్మ లింగమ్మ విసుగు, అలసట లేకుండా వండి వడ్డించేది. సమావేశాలు లాంటివేమైనా ఉన్న రోజున వంద ఇస్తర్లు కూడా లేచిన సందర్భాలున్నాయి. పైగా ఇంటికి ఎవరొచ్చినా అన్నం తినకుండా వెళ్ళనిచ్చేవారు కాదు మా అమ్మానాన్న. డబ్బు చుట్టూ మనుషులు తిరగని రోజులవి.

కూతురిగా గర్వపడుతున్నా...

చిన్నప్పుడు చదువుకోడానికి నాన్న బడికెళితే... ఉపాధ్యాయులు చదువు చెప్పలేదట. విద్య విలువ తెలిసిన వ్యక్తి కదా! ఏదైనా గ్రామం నుంచి వచ్చి ఎవరైనా... "అచ్చాలు! మా ఊరికి ప్రభుత్వ పాఠశాల కావాలి" అనడిగితే, మా నాన్న కలెక్టరు వెంటపడిమరీ పాఠశాల ప్రారంభమయ్యేదాకా వదిలేవారు కాదు. మా నాన్న లోక్‌సభ సభ్యుడిగా పనిచేసింది ఐదేళ్లే అయినా, జీవితాంతం


కుటుంబ సభ్యులతో అచ్చాలు

స్థానికులకు అందుబాటులో ఉంటూ వారికి తలలో నాలుకలా మెలిగారు. వ్యవహార జ్ఞానం కలిగిన వ్యక్తి కనుక కుటుంబ తగువులు కూడా సులువుగా పరిష్కరించేవారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దళాలతో సమానంగా పని చేసిన మా నాన్నను స్వాతంత్ర్య సమరయోధుడిగా ప్రభుత్వం గుర్తించలేదు. అందుకు చివరి రోజుల్లో నాన్న చాలా బాధపడ్డారు. స్వచ్ఛమైన రాజకీయాలకు తీపి జ్ఞాపకం మా నాన్న సుంకం అచ్చాలు. ఒక్క రూపాయి పంచకుండా, జనాన్ని ప్రలోభపెట్టకుండా లోక్‌సభకు వెళ్లారు. నందికొండ ప్రాజెక్ట్, నడికుడి రైల్వే మార్గం కోసం పార్లమెంటులో గొంతెత్తారు. నిత్యం ప్రజా సమస్యల మీద కొట్లాడారు. ప్రజల మనిషిగా బతికారు. అనారోగ్యంతో నలభై ఏళ్ళ కిందట కన్నుమూసినా... నిజమైన నాయకుడిగా చరిత్రలో మా నాన్న పేరు శాశ్వతం.

• సాంత్వన్
ఫొటో: లవకుమార్

లెహంగా ట్రెండ్ ఎప్పటికీ నడుస్తూనే ఉంటుంది. అయితే వేడుకల్లో ధరించే లెహంగా రెట్టింపు ప్రత్యేకంగా ఉండాలంటే, రాజస్థానీ బంధనీ లెహంగా ధరించాలి. ఆకర్షణీయమైన రంగుల్లో, డిజైన్లలో తయారయ్యే ఈ రకం లెహంగా ఎంచుకుంటే వేడుకల్లో మీరే సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్.

బంధనీ భళా

ఫ్యాషన్



లెహంగాకు తగిన చోళీ, చున్నీ జోడిస్తేనే బంధనీ లెహంగాకు అందం చేకూరుతుంది. అందు కోసం కాంట్రాస్ట్ రంగుల్లో చోళీ ఎంచుకోవాలి. లెహంగాకు చున్నీ మ్యాచ్ అయ్యేలా చూసుకోవాలి. ఎరుపు రంగు లెహంగాకు ఆకుపచ్చ, పసుపు చోళీలు బాగుంటాయి.

బంధనీ లెహంగా ధరిస్తే నగల అలంకరణ మరీ హెవీగా ఉండకూడదు. చెవులకు ఝుంకాలు, మెడలో సన్నని చైన్, చేతికి కంగన్ సరిపోతుంది.

జరీ జోడిస్తే ఎలాంటి దుస్తులకైనా భారీ లుక్ చేకూరుతుంది. బంధనీ లెహంగా మరింత భారీగా కనిపించాలంటే అర అడుగు వెడల్పు ఉండే జరీ బార్డర్ జోడించాలి. బ్లౌజ్ గోల్డ్ కలర్‌లో ఉంటే పెళ్లిళ్ల లాంటి వేడుకల్లో ధగధగలాడిపోవచ్చు.

సెన్సిటివ్ దంతాలు ఉన్నాయా?



కొందరికి చల్లని లేదా వేడి పదార్థాలు తిన్నప్పుడు దంతాలు జివ్వుమంటాయి. ఇలా కాకుండా ఉండాలంటే కొన్ని టిప్స్ పాటించాల్సిందే.

- దంతాల మీద ఎనామిల్ అనేది సున్నితమైన రక్షిత పొర. ఇది పోతే సెన్సిటివ్ దంతాలుగా మారతాయి. ఏది తిన్నా సమస్యనే కలుగుతుంది. ఇలాంటి వాళ్లు టూత్ బ్రష్ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. గట్టి బ్రష్‌తో పండ్లు తోమకూడదు. సున్నితమైన బ్రష్‌లు తీసుకోవాలి. తరచూ బ్రష్‌లు మారుస్తుండాలి.
- ఆమ్ల లక్షణాలుండే కూల్‌డ్రింక్స్ తాగకూడదు. ఫాస్ట్‌ఫుడ్స్, తీపి పదార్థాలు తినకూడదు. పండ్లు, కూరగాయలు తినాలి. ముఖ్యంగా పొటాషియం ఉండే అరటిపండు, బత్తాయి పండ్లను తినాలి. పాలు, పెరుగు, డ్రైఫ్రూట్స్ తీసుకోవాలి.
- జామ ఆకులు నమలడం, లవంగాలు తినడంవల్ల ఉపశమనం ఉంటుంది.
- ఓరల్ హైజీన్ కాకున్నా కూడా కొన్ని రకాల బ్యాక్టీరియాల వల్ల ఈ సమస్య తలెత్తే అవకాశం ఉంది. ఇలాంటి వాళ్లు రోజుకు రెండుసార్లు బ్రష్ చేయాలి.
- ఈ పద్ధతులు పాటించినా ఇంకా సమస్య ఉంటే వైద్యుడిని సంప్రదించాలి.

నవ్య | చిత్రజ్యోతి



వైవిధ్యమైన కథతో...

అశ్విన్ బాబు హీరోగా అప్సర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'శివం భజే'. మహేశ్వర్‌రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ "వైవిధ్యమైన కథతో తెరకెక్కుతోన్న న్యూ ఏజ్ సినిమా ఇది" అని చెప్పారు. అప్సర్ మాట్లాడుతూ "ఈ సినిమా టైటిల్‌కు, ఫస్ట్ లుక్‌కు విశేష స్పందన లభించినందుకు ఆనందంగా ఉంది" అని అన్నారు. ఈ ఫస్ట్ లుక్‌లో రౌద్ర రూపంలో హీరో పాత్ర కనపడుతోంది. ఈ చిత్రంలో దిగంగనా సూర్యవంశీ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్‌నటుడు అర్బాజ్ ఖాన్, హైపర్ ఆది, సాయి ధీన, మురళీ శర్మ, బ్రహ్మాజీ, తులసి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఛోటా కె నాయుడు, డీఓపీ: దాశరథి శివేంద్ర, సంగీతం: వికాస్ బడిద.

డబుల్ ఎంటర్టైన్‌మెంట్ గ్యారంటీ

ఎనర్జిటిక్ హీరో రామ్ పోతినేని ప్రస్తుతం పూరి జగన్నాథ్ దర్శకత్వంలో పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కుతోన్న 'డబుల్ ఇస్మార్ట్' సినిమాలో నటిస్తున్నారు. ఇది 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌ను అందుకున్న 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా సెకండ్ షెడ్యూల్ షూటింగ్ ముంబైలో శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా నుంచి ఎప్పుడెప్పుడు అప్‌డేట్ వస్తుందా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఈ నెల 15న రామ్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేస్తోంది. ఈ టీజర్‌తో డబుల్ మాస్, డబుల్ ఎంటర్టైన్‌మెంట్ గ్యారంటీ అని టీజర్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను చూస్తే తెలుస్తోంది. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు: పూరి జగన్నాథ్, చార్మి కౌర్, సినిమాటోగ్రాఫర్: సామ్ కె నాయుడు, జియాని జియన్నెలి, సంగీతం: మణిశర్మ.





ఒక్కటి చేసిన క్రికెట్ కల

రాజ్‌కుమార్ రావు, జాన్వీకపూర్ జంటగా నటించిన క్రీడా నేపథ్య చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. ఈ నెల 31న ఈ విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం యూనిట్ ట్రైలర్‌ను విడుదల చేసింది. హీరో హీరోయిన్ల పెళ్లి ప్రపోజల్ నేపథ్యంలో మొదలైన ట్రైలర్ ఆద్యంతం వినోదం పంచింది. భిన్న మనస్తత్వాలున్న దంపతులుగా రాజ్‌కుమార్ రావు, జాన్వీకపూర్ జంట సందర్భోచిత నటన ఆకట్టుకుంది. ఎప్పుడూ గొడవపడే దంపతులిద్దరినీ క్రికెట్ ఎలా ఒక్కటి చేసింది, మహి క్రికెటర్‌గా ఎదిగిన తీరును ట్రైలర్‌లో చూపించిన విధానం ఆసక్తికరంగా అనిపించింది. శరణ్ శర్మ దర్శకత్వంలో కరణ్ జోహార్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

అహంకారం ప్రధాన పాత్ర పోషిస్తే



రాహుల్ విజయ్, శివాని రాజశేఖర్ నటించిన ఓటీటీ చిత్రం 'విద్య వాసుల అహం'. మణికాంత్ గిల్లి దర్శకత్వం వహించగా, మహేశ్ దత్త మొతూరు, లక్ష్మీనవ్య మక్కపాటి నిర్మించారు. ఇందులో అవసరాల శ్రీనివాస్, తనికెళ్ల భరణి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 17 నుంచి ఆహాలో ఈ చిత్రం స్ట్రీమింగ్ అవనుంది. పెళ్లయిన కొత్త జంట మధ్య అహంకారం ప్రధాన పాత్ర పోషిస్తే ఎటువంటి పరిణామాలు ఎదురవుతాయనేది కథ. ఈ చిత్రానికి ఎడిటర్: సత్య గిడుతూరి, డీఓపీ: అఖిల్ వల్లూరి, సంగీతం: కల్యాణి మాలిక్.

'లేదే లేదే ప్రేమసలే'



పాపులర్ కమెడియన్ గెటప్ శీను లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'రాజుయాదవ్'. కృష్ణమాచారి దర్శకత్వం వహించారు. కె.ప్రశాంత్ రెడ్డి, రాజేశ్ కల్లేపల్లి సంయుక్తంగా నిర్మించారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన సాంగ్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి మరో సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'లేదే లేదే ప్రేమసలే' అంటూ సాగే ఈ ఎమోషనల్ సాంగ్‌కు చంద్రబోస్ సాహిత్యం అందించడమే కాకుండా ఆలపించారు. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందించారు. ఈ నెల 17న 'రాజుయాదవ్' విడుదలవుతోంది.



సందేశం వినోదం కలబోతగా

నూతన నటీనటులతో తెరకెక్కిన వినోదాత్మక చిత్రం 'అక్కడ వారు ఇక్కడ ఉన్నారు'. సాయిహర్షిణి, ఎస్‌పీ రమణ, పి. లలిత, పిల్లి విజయ్‌కుమార్ ప్రధాన తారాగణం. కుందుర్తి త్రివిక్రమరావు స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ నెల 17న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమాన్ని యూనిట్ ఆదివారం తెనాలిలో నిర్వహించింది. ఈ సందర్భంగా త్రివిక్రమరావు మాట్లాడుతూ '10 రోజుల సింగిల్ షెడ్యూల్‌లో ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేశాం. అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కించాం. వినోదంతో పాటు ఈ తరానికి చక్కటి సందేశం ఇచ్చే చిత్రమిది' అన్నారు. ఈ చిత్రానికి శ్రీ వెంకట్ సంగీతం అందించారు. సినిమాటోగ్రఫీ: రాజు కేశన్న. ఎడిటర్: వెంకట్.

అమ్మ... నా ప్రాణం, ప్రేరణ

షర్మిల మదర్స్ డే శుభాకాంక్షలు



మదర్స్ డే సందర్భంగా పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదివారం ఎక్స్ వేదికగా స్పందించారు. "అమ్మ.. చీకటిలో వెలుగు రేఖై, బాధల్లో బలానివై, అలసటలో ఆలనవై, విజయాల్లో ఆశీర్వాదానివై.. దేవుడు నాకిచ్చిన అనిర్వచనమైన కానుక, నా ప్రాణం, నా ప్రేరణ.. అమ్మకు మదర్స్ డే శుభాకాంక్షలు.. హ్యాపీ మదర్స్ డే మా!! హ్యాపీనెస్ ఆల్వేస్ టు యు!!!" అంటూ షర్మిల శుభాకాంక్షలు తెలిపారు. తన తల్లి విజయలక్ష్మితో కలిసి దిగిన ఒక ఫొటోను తన సందేశంతో పాటు ఎక్స్‌లో పంచుకున్నారు.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

కూటమిలో జోష్!

ఏపీలో ప్రభుత్వం మారడం ఖాయమని ధీమా.. ఆత్మవిశ్వాసంతో పోలింగ్‌కు సన్నద్ధం

- జగన్‌పై వివిధ వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత
- ముఖ్యంగా యువత, నిర్మాణ కార్మికుల్లో!
- ఓటేయడానికి పొరుగు రాష్ట్రాల నుంచీ ప్రవాహంలా వచ్చిన జనం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏపీలో పోలింగ్ వేళ టీడీపీ కూటమిలో సమరోత్సాహం కనిపిస్తోంది. ఎన్నికల్లో తమ విజయం ఖాయమన్న ధీమా కూటమి నేతల్లో బలంగా వ్యక్తమవుతోంది. సోమవారం జరిగే పోలింగ్‌కు కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, శ్రేణులు ఆత్మవిశ్వాసంతో సన్నద్ధమయ్యాయి. ఎన్నికల గడువు సమీపించిన కొద్దీ వివిధ సమీకరణలు తమకు అనుకూలంగా మారాయని, ప్రభుత్వ మార్పు ఖాయమని కూటమి పార్టీలు విశ్లేషిస్తున్నాయి. జగన్ ప్రభుత్వంపై వ్యతిరేకత అసాధారణ స్థాయిలో నెలకొనడంతో సునాయాసంగా గెలవబోతున్నామని పేర్కొంటున్నాయి. సర్వే ఏజెన్సీల అంచనా ప్రకారం.. యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు, వ్యాపార వర్గాలు, భవన నిర్మాణ కార్మికులు, మద్యం తాగే అలవాటున్న పేద వర్గాలు.. కరెంటు బిల్లులు, పెట్రో చార్జీల పెంపు వంటి బాదుడు నిర్ణయాలతో విసుగు చెందిన మధ్య, దిగువ మధ్య తరగతి వర్గాలు.. జగన్ సర్కారుపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. ఈ అంచనాల్లో వాస్తవం ఉందని ప్రభుత్వ ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సమయంలో వెల్లడైంది. ఈసారి ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు ప్రత్యక్ష ఓటింగ్ విధానం పెట్టారు. 4.5 లక్షల మంది ఓట్లు వేశారు. ఇందులో అత్యధికులు కూటమికి వేశారని ఉద్యోగ వర్గాల ద్వారానే తెలిసిపోయింది. గత ఎన్నికల్లో ఇదే ఉద్యోగ వర్గం వైసీపీకి బలంగా మద్దతిచ్చింది. ఈసారి అంతే బలంగా వ్యతిరేకంగా మోహరించింది. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఓట్లు పరిగణనలోకి తీసుకుంటే కనీసం పది లక్షల ఓట్లు కూటమికి పడేలా కనిపిస్తున్నాయని, ఇది బాగా పెద్ద సంఖ్యని సర్వే ఏజెన్సీలు చెబుతున్నాయి. ఉద్యోగులు, యువత, నిరుద్యోగులు వైసీపీ పట్ల విముఖతతో ఉన్నారని నిరుడు పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లోనే తేలింది.



ఈవీఎంలను తీసుకెళ్లడానికి వచ్చిన సిబ్బంది

వైసీపీ పథకాలకు దీటుగా..

సంక్షేమ పథకాలు అందుకుంటున్న పేద వర్గాలు తమ వైపే ఉన్నాయని, తిరిగి అధికారంలోకి వస్తామని వైసీపీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తుండేవి. అయితే ఆ వర్గాలను ఆకట్టుకోవడానికి టీడీపీ కూటమి సూపర్ సిక్స్ పేరుతో మరింత సాయం అందించే హామీలను ప్రకటించింది. పెన్షన్ మొత్తాన్ని రూ.4 వేలకు పెంచుతూ పెద్ద హామీ ఇచ్చింది. దీంతో పథకాల లబ్ధిదారుల్లో మార్పు వచ్చిందని, వారిలో గణనీయ భాగం తమవైపు ఆకర్షితులయ్యారని కూటమి నేతలు అంటున్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టంలోని అంశాలు రైతాంగంలో వైసీపీ ప్రభుత్వం పట్ల బాగా భయాన్ని పెంచాయంటున్నారు. జగన్ ఇసుక విధానం వల్ల కుదేలయ్యామని భవన నిర్మాణ కార్మికుల్లో అత్యధికులు భావిస్తున్నారు. ఇన్ని వర్గాల్లో వ్యతిరేకత ఉన్న ఏ ప్రభుత్వమైనా తిరిగి అధికారంలోకి రావడం కష్టమని జనసేన ఎ నముఖ్యుడొకరు అభిప్రాయపడ్డారు. వైసీపీ అర్థ, అంగ బలాలను తట్టుకోగలమా అని గతంలో ప్రతిపక్ష నేతల్లో భయం ఉండేది. కానీ ప్రచారం సాగేకొద్దీ అది పోయింది. పోలింగ్ సమయానికి శ్రేణుల్లో విశ్వాసం, ఉత్సాహం ఉరకలు వేస్తున్నాయి. మారిన రాజకీయ వాతావరణమే దీనికి కారణమని కూటమి నేతలు విశ్లేషిస్తున్నారు.

ఏపీలో వెబ్ క్యాస్టింగ్‌ను అడ్డుకునే కుట్రలు

కొన్ని గంటల్లో పోలింగ్ జరగనుండగా.. ఏపీలో అక్రమాలపై నిఘా కోసం ఎన్నికల సంఘం (ఈసీ) ఏర్పాటు చేసిన వెబ్‌క్యాస్టింగ్‌కూ అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు జరిగాయి. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం కారంపూడి మండలం పేటసన్నిగండ్ల శివారు సింగరుట్లతండాలోని ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వెబ్ క్యాస్టింగ్ సీసీ కెమెరా, కేబుల్ తీగను అపహరించుకెళ్లారు. దీనివెనుక వైసీపీ మూకలు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఆదివారం పోలింగ్ సిబ్బంది దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 34 వేల పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ కెమెరాలు పెట్టారు. ఇందులో 12 వేల కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. ఇక్కడ పోలింగ్ కేంద్రాల లోపల, బయటా కెమెరాలు పెట్టారు. అయితే, వెబ్ క్యాస్టింగ్‌కు కూడా అంతరాయం సృష్టించే ప్రమాదం ఉండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పోలింగ్.. నిష్పాక్షికంగా, శాంతియుతంగా జరిగేలా చూడాలని కలెక్టర్లను, ఎస్పీలను ఈసీ ఇప్పటికే పలుసార్లు హెచ్చరించింది. అవాంఛనీయ ఘటనలు జరిగితే పూర్తి బాధ్యత మీదేనని తేల్చి చెప్పింది.

చివరి నిమిషం వరకు అప్రమత్తం!

- ఓటర్లు స్వేచ్ఛగా ఓటేసేలా చూడాలి
- టీడీపీ నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి, మే 12(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలలో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసే పరిస్థితిని కల్పించాలని, పోలింగ్ శాతం పెరిగేలా కృషి చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ నేతలకు సూచించారు. ఓటమి భయంతో వైసీపీ ఊహించని స్థాయిలో అక్రమాలకు పాల్పడే అవకాశం ఉన్నందున, పోలింగ్ చివరి నిమిషం వరకు పూర్తి స్థాయి అప్రమత్తతతో ఉండాలని నిర్దేశించారు. సోమవారం పోలింగ్ సందర్భంగా పార్టీ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై ఆదివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలోని వార్ రూమ్ నుంచి జిల్లాల పార్టీ నేతలతో చంద్రబాబు సమీక్షించారు. జిల్లాల పార్టీల నేతలకు, వార్ రూమ్ బృందం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. విడివిడిగా బాధ్యతలు అప్పగించారు. పోలింగ్ ఏజెంట్లుగా వెళ్లే కార్యకర్తలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్రామ స్థాయిలో పోలింగ్ బూత్ నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి అంశాన్ని పర్యవేక్షించేలా ప్రణాళిక రూపొందించారు. పోలింగ్‌లో ఏవైనా సమస్యలు తలెత్తితే ఎప్పటికప్పుడు నియోజకవర్గాల నుంచి వార్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలని నేతలకు సూచించారు. డీప్‌ఫేక్ వీడియోలు, ఫేక్ లేఖలు, పుకార్లు, హింసా రాజకీయాలతో వైసీపీ చేసే కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టేలా పార్టీ నేతలకు బాధ్యతలు అప్పగించారు. పోలింగ్ పూర్తయ్యే వరకు గ్రామ స్థాయిలో కార్యకర్త నుంచి పార్టీ నేతలెవరూ విశ్రాంతి తీసుకోవద్దని కోరారు. కాగా, సోమవారం చంద్రబాబు పార్టీ కేంద్ర కార్యాలయంలోని వార్‌రూమ్ నుంచి పర్యవేక్షించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

డబ్బులివ్వాల్సిందే!

ఓటర్ల నుంచి వైసీపీకి వింత నిరసనలు

(ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)

ప్రలోభాల పర్వంలో కొత్త పోకడ తెరపైకి వచ్చింది. నోటు కోసం ఓటర్ల నుంచి వింత నిరసనలు హోరెత్తుతున్నాయి. 'డబ్బులివ్వాల్సిందే' నంటూ అధికార పార్టీ నేతలు, అభ్యర్థులకు ఆదివారం పలు నియోజకవర్గాల్లో చుక్కలు చూపించారు. ఓటు డబ్బులు నొక్కేశారంటూ ఆ పార్టీ నాయకుల ఇళ్లు, కార్యాలయాలను ముట్టడించారు. ఎక్కడికక్కడ రోడ్డెక్కారు. 'అందరికీ ఇచ్చి మాకు ఆపుతారా?' అంటూ జనం ఆగ్రహంతో కర్నూలులో ఏకంగా పోలీస్‌స్టేషన్‌లోనే ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం ఆదివారం కాకినాడలో కాక రేపింది. ఆదివారం ఉదయం వరకూ వేచి చూసినా వైసీపీ నేతలు సొమ్ములు ఇవ్వకపోవడంతో పిఠాపురంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు పట్టణంలోని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత కార్యాలయాన్ని ముట్టడించారు. ఒకానొక దశలో వీరిని పోలీసుల చెదరగొట్టినా ఫలితం లేకపోయింది. తమ పేరున వైసీపీ నేతలు సొమ్ములు తీసుకుని తమకు ఇవ్వకుండా స్వాహా చేశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, ఓటర్ల వరుస ఆందోళనలతో వైసీపీ నేతలు ఒక్కొక్కరూ జారుకుని తమ ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. వైసీపీ కార్యాలయంవద్ద నిన్నటివరకూ అంతా తామే అన్నట్లు వ్యవహరించిన నేతలు, ఎంపీ మిథున్‌రెడ్డి అనుచర నాయకులు ఏఒక్కరూ కనిపించకపోవడం గమనార్హం. అక్కడ పోలీసులు మాత్రమే కనిపిస్తున్నారు. పలుచోట్ల ఓటర్లకు ఇచ్చిన డబ్బులను వైసీపీ నేతలు నొక్కేయడం వివాదాలకు దారితీసింది. పలుచోట్ల వైసీపీ నేతలు పంపిణీ చేసిన గోవా మద్యం తీసుకునేందుకు ఓటర్లు నిరాకరించారు. తమకు నాణ్యమైన మద్యాన్నే ఇవ్వాలని డిమాండ్ చేయడం గమనార్హం. తమకు డబ్బులు అందలేదంటూ రాజమహేంద్రవరం సిటీ వైసీపీ అభ్యర్థి మార్గాని భరత్ రామ్ కార్యాలయాన్ని శనివారం సాయంత్రం సుమారు 400 మంది మహిళలు చుట్టుముట్టారు. తిరుపతిలో వైసీపీ నాయకుడొకరు ఓటర్లకు నగదు పంచడంతో ఆగలేదు. తమ పార్టీకే ఓటేస్తామంటూ వారి చేత ప్రమాణాలు కూడా చేయించారు. కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో వైసీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి అనుచరులు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అయితే అవి నాసిరకంగా ఉన్నాయంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలమూరు మండలం పినపళ్ల గ్రామానికి చెందిన పలువురు మహిళలు శనివారం రాత్రి తమకు ఇచ్చిన చీరలను వైసీపీ నాయకుల ఇళ్ల ముందు విసిరేసిపోయారు. డబ్బుల కోసం వైసీపీ విశాఖ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ కార్యాలయాన్ని ఆదివారం ఓటర్లు చుట్టుముట్టారు. తమకు కూపన్లు ఇచ్చారని, డబ్బులు అందలేదంటూ వందలాది మంది లాసన్స్‌బే కాలనీలోని ఎంవీవీ కార్యాలయానికి తరలివచ్చారు. ఎంవీపీ పోలీస్‌స్టేషన్ సిబ్బంది అక్కడకు చేరుకుని ఓటర్లను పంపేశారు. గాజువాక వైసీపీ అభ్యర్థి, మంత్రి అమర్‌నాథ్ ఇంటికి పలు వార్డులకు చెందిన మహిళలు వెళ్లి.. డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మాయమవుతోన్న మద్యం విక్రయాల డేటా

- ప్రభుత్వం మారితే అక్రమాలన్నీ వెలుగులోకి
- ముందే సర్దుకుంటున్న బేవరేజెస్ అధికారులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏపీలో అధికార పార్టీ ఓటమి పాలవుతుందన్న ప్రచారం జోరందుకున్న నేపథ్యంలో మద్యం అమ్మకాల సమాచారంపై అధికారులు దృష్టి పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మరుక్షణమే మద్యం ఉత్పత్తి, సరఫరా, అమ్మకాలపై విచారణ చేపట్టే అవకాశం ఉంది. దీనిపై టీడీపీ నేతలు ఇప్పటికే ప్రకటనలు కూడా చేశారు. కొద్దికాలం గా వైసీపీ ప్రభుత్వం మారిపోతుందనే ప్రచారం ఊపందుకుంది. దీంతో బేవరేజెస్ కార్పొరేషన్‌లోని కొందరు అధికారులు, రిటైర్డ్ అధికారులు అప్రమత్తమై.. అక్రమాల డేటాను లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా కొన్ని కంప్యూటర్ల హార్డ్‌డిస్క్‌లను ఆఫీసు నుంచి తీసుకెళ్లిపోతున్నట్లు ఎక్సైజ్‌శాఖలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. కొత్తగా వచ్చిన కార్పొరేషన్ ఎండీ కంటపడకుండా డేటా అపహరణకు గురవుతున్నట్లు తెలుస్తోంది. సాధారణ సమాచారాన్ని అలాగే ఉంచి అక్రమాలు జరిగినవి, అనుమానం కలిగించే సమాచారాన్ని మాత్రం మాయం చేస్తున్నట్లు సమాచారం.

వైసీపీ 'ఫేక్' ప్రచారం

- చంద్రబాబుపై డీప్ ఫేక్ వీడియో
- కట్, పేస్ట్‌లతో అసత్య ప్రచారం
- వీడియో తనది కాదని బాబు ఖండన

అమరావతి, మే 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియాలో తమకు గిట్టనివారిపై బురదజల్లడం, అబద్ధాలు ప్రచారం చేయడం అలవాటుగా మారింది. ఇప్పుడు ఎన్నికల సమరం చివరి క్షణంలో వైసీపీ ప్రచార బృందాలు మరో అడుగు ముందుకేసి డీప్ ఫేక్ డ్రామాలు ఆడుతున్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబు గొంతును మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు. పోలింగ్ మొదలు కావడానికి సరిగ్గా ఇరవై నాలుగు గంటల ముందు వైసీపీ శిబిరం నుంచి చంద్రబాబు వీడియో ఒకటి బయటకు వచ్చింది. ఆయన ఒక టీవీ చానల్ ఇంటర్వ్యూలో మాట్లాడిన మాటలను తొలగించి, వైసీపీకి అనుకూలంగా మాటలను జత చేసి దానిని వదిలారు. తాము ఇచ్చిన హామీలు, ప్రకటించిన హామీలు అమలు అసాధ్యమని, అవన్నీ ఎక్కడ చేస్తామని ఆయన అన్నట్లు ఈ వీడియోలో ఉంది. వీడియోలో ఎదురుగా చంద్రబాబు కనిపిస్తూ మాట్లాడటంతో ఆయనే ఇంటర్వ్యూలో ఈ మాటలు చెప్పారని విన్నవారు అనుకొంటారు. అయితే డీప్ ఫేక్ టెక్నాలజీతో నిజంగానే చంద్రబాబు మాట్లాడినట్లుగా భ్రమ కల్పించేలా మార్ఫింగ్ చేసిన వీడియో రూపొందించారు. వైసీపీకి అనుకూలంగా ఉండే 'వై ఏపీ నీడ్స్ జగన్' అనే సామాజిక మాధ్యమ ఖాతాలో ఈ మార్ఫింగ్ వీడియోను మొదట పోస్టు చేశారు. తర్వాత వైసీపీ శ్రేణులు తమకు తెలిసిన వారికి విస్తృతంగా షేర్ చేశారు. ఆదివారం సాయంత్రానికి ఈ ఖాతాలో ఈ వీడియోను సుమారుగా డెబ్బై వేల మంది చూశారు. ఈ విషయం చంద్రబాబు దృష్టికి రావడంతో దానిని ఖండిస్తూ స్వయంగా ఎక్స్ (ట్విటర్)లో ఒక పోస్టు చేశారు. ఈ ఫేక్ వీడియోను నమ్మవద్దని కోరారు. 'కొన్ని గంటల్లో పోలింగ్ మొదలు కాబోతోంది. ఈ కొన్ని గంటలైనా నిజాయితీగా ఉండాలన్న ఇంగిత జ్ఞానం జగన్‌కు లేదు. ఉంటే ఇలా కుల మతాలను రెచ్చగొట్టే ఫేక్ వీడియోలను చేయించడు. వైసీపీ వాళ్లు తిప్పుతున్న ఫేక్ వీడియోకు నేను మాట్లాడిన ఈ అసలు వీడియో ఆధారం. దీన్నే వాళ్లు ఫేక్ చేశారు. పోలింగ్ పూర్తయ్యే వరకూ ఇలాంటి ఫేక్ వీడియోలు కుప్పతెప్పలుగా జగన్ చేయిస్తాడు. వీటిని నమ్మవద్దని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నాను' అని చంద్రబాబు కోరారు. తాను మాట్లాడిన అసలు వీడియోను ఆయన దీనికి జత చేశారు. ఇంతకుముందు చంద్రబాబు సతీమణి భువనేశ్వరి గొంతును ఇలాంటి టెక్నాలజీతోనే మార్చి ఒక ఆడియో విడుదల చేశారు. ఆమె దళితులను తిట్టారంటూ ఆ ఆడియోను వైసీపీ అనుకూల సామాజిక మాధ్యమాల్లో తిప్పారు. దీనిని తెలుగుదేశం పార్టీ వెంటనే ఖండించింది. ఇటువంటి ఆడియోలను నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది.

వైసీపీ దిగజారుడుతనం

డీప్ ఫేక్ టెక్నాలజీ అభివృద్ధి చెందిన తర్వాత ఎవరి గొంతునైనా అనుకరించి అచ్చం ఆ వ్యక్తే మాట్లాడినట్లుగా భ్రమ కల్పించడం తేలికగా మారింది. 'ఎవరైనా కింది స్థాయిలో ఉన్న సానుభూతిపరులు, కార్యకర్తలు ఒకోసారి ఆవేశంతో ఏవో తప్పుడు వీడియోలు తయారు చేసి పెడతారు. కానీ ఒక రాజకీయ పార్టీ ప్రత్యేకంగా ఒక విభాగాన్ని పెట్టి ఇటువంటి వీడియోలు, ఆడియోలు తయారు చేయించడం మొదటి సారి చూస్తున్నాం. ప్రత్యర్థి పక్షాన్ని దెబ్బ తీయడానికి ఎంత హీనస్థాయికైనా దిగజారడానికి వైసీపీ యంత్రాంగం వెనకాడటం లేదు' అని టీడీపీ ముఖ్యుడు ఒకరు ఆగ్రహం వ్యక్తం చేశారు.



గంటల తరబడి చూస్తే.. గల్లా పెట్టె దొరికింది!

సిద్దిపేట క్రైం, మే 12: సిద్దిపేట అంబేడ్కర్ నగర్‌లో బీఆర్ఎస్ నాయకుడు జువ్వల కనకరాజు ఇంట్లో భారీగా మద్యం ఉందన్న సమాచారంతో పోలీసులు తనిఖీ చేశారు. ఆదివారం ఉదయం పోలీసులు ఆయన ఇంటికి వెళ్లగా తాళం వేసి ఉంది. ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న భార్యను హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆయన సాయంత్రం ఇంటికి వచ్చే సరికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు చేరుకున్నారు. వారు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. భారీ బందోబస్తు నడుమ ఇంటి సీల్ ఓపెన్ చేసి.. తనిఖీ నిర్వహించారు. కానీ ఎలాంటి మద్యం దొరకలేదు. దేవుడి దగ్గర ఉన్న గల్లా పెట్టెలో చిల్లర పైసలు రూ.250 మాత్రమే దొరికాయి.

ఓటే అడగల్లే..!

(మొదటి పేజీ తరువాయి)



పరిమితం కావడం, కొన్నిచోట్ల అసలు ఓటే అడగకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. ఉదాహరణకు.. ముషీరాబాద్‌లోని ఓ బస్తీలో ఓటుకు రూ.500 వరకూ పంపిణీ చేయగా, సమీపంలోని మరో బస్తీలో అసలు డబ్బులే ఇవ్వలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం పోలింగ్ కావడంతో.. ఆదివారం మద్యం, డబ్బు పంచుతారని పలు కాలనీలు, బస్తీలవాసులు రోజంతా ఇంట్లోనే ఉండి ఎదురుచూశారు. కానీ ఎక్కడా నాయకుల జాడ కనిపించలేదు. దీంతో సాయంత్రానికి వారంతా ఒక చోట చేరి.. డబ్బులేమైనా ఇస్తున్నారా? అని ఒకరినొకరు ప్రశ్నించుకుంటున్నారు. వేరే ప్రాంతాల్లో ఉన్న తమ స్నేహితులు, బంధువులకు ఫోన్లు చేసి ఆరా తీస్తున్నారు. ఖైరతాబాద్‌లోని చింతలబస్తీ ప్రాంతంలో ఒక పార్టీ.. ఎప్పుడూ డబ్బు పంపిణీ బాధ్యతను స్థానిక నేతకు అప్పగిస్తుంది. సాధారణంగా పోలింగ్ తేదీకి రెండు రోజుల ముందే ఆయన డబ్బు, మద్యాన్ని ఓటర్లకు సరఫరా చేస్తారు. కానీ ఈసారి ఆయన్నుంచి ఎలాంటి స్పందనా లేకపోవడంతో.. స్థానికులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. కొందరైతే.. "డబ్బులేమైనా ఇస్తరా?" అని సదరు లీడర్ ఇంటి చుట్టూ ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు తిరిగినట్లుగా తెలిసింది. సంబంధిత డివిజన్ స్థాయి నేతకు ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో వారంతా ఉసురుమంటూ వెనుదిరిగినట్లు సమాచారం.

పైసలొచ్చినా..

సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో ఓ అభ్యర్థి.. పార్టీ నుంచి వచ్చిన ఫండ్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జులకు చేరవేసినా... అక్కడి నుంచి డివిజన్ స్థాయిలో కార్పొరేటర్లకు వచ్చాయా? ఇంకా కిందిస్థాయికి చేరకుండా ఎక్కడికక్కడే దిగమింగినట్లు పార్టీ నేతలు, కార్యకర్తలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఖమ్మంలో కూడా కొందరు అభ్యర్థులు గ్రామీణ ప్రాంతాలు, గంపగుత్తగా తమకు ఓట్లు పడే ప్రాంతాలు, పోటీ హోరాహోరీగా ఉండే చోట్ల మాత్రమే ఓటుకు రూ.500 చొప్పున పంపిణీ చేసినట్లు సమాచారం. పట్టణాలు, మండల కేంద్రాల్లోని ప్రముఖ ప్రాంతాలు, ఉద్యోగులు, వ్యాపారులు ఎక్కువగా ఉండే నివాసప్రాంతాల్లో, అపార్ట్‌మెంట్లలో నగదు పంపిణీ చేయలేదు.

కాంగ్రెస్ డబ్బులు పంచుతోంది

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఈసీ: సంజయ్
- 'మెదక్'లో బీఆర్ఎస్ విచ్చలవిడిగా నగదు పంపిణీ
- ఆ పార్టీ అభ్యర్థికి పొంగులేటి పైసలు: రఘునందన్

హైదరాబాద్/మెదక్ అర్బన్, మే 12(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఓటుకు రూ.వెయ్యి, హాఫ్ బాటిల్ మద్యం పంపిణీ చేస్తుంటే ఎన్నికల సంఘం అధికారులు ఏం చేస్తున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ ప్రశ్నించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని అనేక గ్రామాలు, మండలాల నుండి బీజేపీ నాయకులు, కార్యకర్తలు తన కార్యాలయానికి ఫోన్లు చేస్తూ కాంగ్రెస్ నేతలు డబ్బులు, మద్యం పంపిణీ చేస్తున్నారని చెబుతున్నారని పేర్కొన్నారు. కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ పైసలు పంచి అడ్డదారుల్లో గెలవాలని చూస్తోందన్నారు. అందులో భాగంగా పెద్ద ఎత్తున డబ్బులను డంప్ చేశారని తెలిపారు. "కొత్త సీసాలో పాత సారా అన్న చందంగా బీఆర్ఎస్ ప్రభుత్వ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోంది. ఒక్కో ఓటుకు రూ.వెయ్యి, ఇంటికి హాఫ్ బాటిల్ మద్యం చొప్పున 15 లక్షల మందికి పంపిణీ చేస్తూ ఓట్లను కొని గెలవాలని అడ్డదారులు తొక్కుతోంది. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది. అధికారులు, పోలీసుల సహకారం లేకుండా ఇంటింటికీ డబ్బుల పంపిణీ సాధ్యమా..? కళ్లముందే డబ్బులు పంచుతున్నారని ఫిర్యాదులు వస్తున్నా ఎన్నికల కమిషన్ చోద్యం చూడటం వెనుక మర్మమేంటి..? డబ్బు, మద్యం పంపిణీపై బీజేపీ కార్యకర్తలు సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేస్తే.. చర్యలు తీసుకోకపోగా ఆ సమాచారాన్ని కాంగ్రెస్ నేతలకు పంపి వారిని కాపాడే ప్రయత్నం చేయడం బాధాకరం. అలాంటప్పుడు ఎన్నికల కమిషన్ ఎందుకు..?" అని సంజయ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కు: రఘునందన్

సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్లకు విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేయడంపై పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఆదివారం మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడారు. ఓటమి భయం పట్టుకున్న కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ గెలుపు కోసం పనిచేస్తోందని మండిపడ్డారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కోసం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సహాయ సహకారాలతో ఓటుకు రూ.500, రూ.1,000 పంచుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి దొంగా పోలీసుల్లా వ్యవహరిస్తున్నాయని ధ్వజమెత్తారు. సిద్దిపేటలో మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలను పిలిచి డబ్బులు ఇచ్చి పంపిణీ చేయిస్తున్నట్లు డీఎస్పీ, సీపీకి చెప్పినా చూసీ చూడనట్లు వదిలేస్తున్నారని ఆరోపించారు. శనివారం రాత్రి పెద్ద శివనూర్, చిన్న శివనూర్ మధ్యలో ఉన్న ఫాంహౌస్‌లో బీఆర్ఎస్ నాయకులు 15 కార్లలో వచ్చి ఏ బూత్‌కు ఎన్ని డబ్బులు పంపిణీ చేయాలని సమావేశమయ్యారని తెలిపారు. చేగుంట ఎస్, రామాయంపేట సీఐ, తూప్రాన్ డీఎస్పీకి సమాచారం ఇచ్చినా ఎవరూ రాలేదని.. రాత్రి పది గంటలకు జిల్లా ఎస్పీకి సమాచారం అందిస్తే రెండు గంటలు ఆలస్యంగా వచ్చారని పేర్కొన్నారు. అన్ని కార్లు వెళ్లిపోయిన తర్వాత ఒక కారును రోడ్డుపై నిలిపి అందులో రూ.88.40 లక్షలు దొరికినట్లు చెబుతున్నారని అన్నారు. దొరికిన డబ్బుల కవర్లలో ఏ బూత్‌కు ఎన్ని పంపిణీ చేయాలో రాశారని, అక్కడ సమావేశమైన వారు బీఆర్ఎస్ నాయకులని చెబుతున్నా వారిపై కేసులు పెట్టలేదన్నారు. ఫాంహౌస్‌లోని సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని రఘునందన్‌రావు డిమాండ్ చేశారు.

రూ.కోటి తరలిస్తూ కారు బోల్తా

ఖమ్మం జిల్లాలో పోలీసుల నుంచి తప్పించుకుని వెళుతుండగా ఘటన.. నగదు స్వాధీనం... ఇద్దరి అరెస్టు

- మెదక్ జిల్లాలో 88.43 లక్షల పట్టివేత
- మధుయాష్కీ గౌడ్ ఇంట్లో తనిఖీలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రూ.కోటి తరలిస్తూ పోలీసుల నుంచి తప్పించుకుని వేగంగా వెళుతున్న ఒక కారు బోల్తా కొట్టింది. ఆ కారులో ఎయిర్ బ్యాగ్స్ ఉండడంతో ఇద్దరు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం దేవునితండా వద్ద ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నాయకన్‌గూడెం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు హైదరాబాద్ నుంచి ఖమ్మం వస్తున్న కారును ఆపేందుకు ప్రయత్నించారు. అయితే డ్రైవర్ ఆపకుండా వేగంగా ముందుకు పోనిచ్చాడు. దాంతో పోలీసులు వెంబడించారు. తప్పించుకునేందుకు కారును వేగంగా నడపడంతో దేవునితండా వద్ద అదుపుతప్పి పల్టీ కొట్టింది. పోలీసులు కారును తనిఖీ చేయగా ఎటువంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న సుమారు రూ.కోటి దొరికింది. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులను పీఎస్‌కు తరలించారు. నగదు బీఆర్ఎస్‌కు చెందిన వారిదిగా ప్రచారం జరుగుతోంది. కాగా, మెదక్ జిల్లా మాసాయిపేటలో శనివారం అర్ధరాత్రి కారులో తరలిస్తున్న రూ.88.43 లక్షలు పోలీసులకు పట్టుబడింది. చేగుంటకు చెందిన అన్నం రవి, పుల్లగొల్ల రవిని అదుపులోకి తీసుకున్నారు. అయితే బీజేపీ నాయకులు మాత్రం రూ.1.10 కోట్లు లభ్యమైనట్లు ఆరోపించడంతో వారికి, బీఆర్ఎస్ నాయకులకు మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాగా, హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లోని టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీ గౌడ్ ఇంట్లో ఆదివారం ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించింది. ఆయన ఇంట్లో భారీ మొత్తంలో డబ్బు ఉందన్న సమాచారంతో సోదాలు చేసినట్లు తెలిసింది. ఆయన ఇంటి సమీపంలోని ఇళ్లలో కూడా స్క్వాడ్ తనిఖీలు నిర్వహించింది. కానీ ఎక్కడా డబ్బులు లభించలేదు.



ప్రమాదానికి గురైన కారు, కారులో లభించిన నగదు బ్యాగులు

తనిఖీ పేరుతో రూ.6.69 లక్షల దోపిడీ


కీసరలో ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

కీసర రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): తనిఖీల్లో రూ.6.69 లక్షల సొమ్ము కొట్టేసిన ఇద్దరు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు పడింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కీసర పీఎస్‌కు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు వాహనంలో గస్తీ తిరుగుతూ కరీంగూడకు చేరుకున్నారు. ఔటర్ సర్వీస్ రోడ్డు వద్ద వాహనంలో వెళుతున్న సాయికుమార్, కార్తిక్ అనే యువకులను అడ్డుకుని తనిఖీ చేశారు. వారి వద్ద రూ.25 లక్షలు ఉన్నట్టు గుర్తించారు. అంత డబ్బు కనిపించటం, నిర్మానుష్య ప్రదేశం కావడంతో ఆ కానిస్టేబుళ్లకు దుర్బుద్ధి పుట్టింది. వారిని గంటల తరబడి తమ వెంట తిప్పించుకుని, కొంత నగదు తీసుకుని పంపించేశారు. నగదుకు ఆధారాలు ఉన్నా కాజేయడంపై ఆ యువకులు కీసర సీఐకి ఫిర్యాదు చేశారు. వారిని పీఎస్‌కు రప్పించి, వారి వద్ద డబ్బును లెక్కించగా రూ.18,30,500 ఉన్నట్టు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇద్దరు కానిస్టేబుళ్లపై విచారణ చేపట్టి సస్పెండ్ చేసినట్టు సీఐ తెలిపారు.

ఝార్ఖండ్ మంత్రి ఆలంగీర్‌కు ఈడీ సమన్లు

రాంచీ, మే 12: మనీలాండరింగ్ కేసులో విచారణకు హాజరు కావాలని ఝార్ఖండ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఆలంగీర్ ఆలం(70)కు ఈడీ సమన్లు పంపించింది. ఆయన ఇంట్లో పని చేసే సహాయకుడు జహంగీర్ ఆలం(42) వద్ద రూ.32 కోట్లు లభించిన నేపథ్యంలో ప్రశ్నించే నిమిత్తం మంగళవారం రాంచీలోని తమ కార్యాలయానికి రావాలని సూచించింది. గత వారం ఇదే వ్యవహారంలో జహంగీర్‌తో పాటు మంత్రి పీఎస్ సంజీవ్‌లాల్(52)ను ఈడీ అరెస్టు చేసింది.

లోకం తీరు



దేశమంతా 200 యూనిట్ల ఉచిత విద్యుత్

- అగ్నిపథ్ పథకం రద్దు... రైతులకు కనీస మద్దతు ధర
- పది గ్యారెంటీలను ప్రకటించిన ఆప్ అధినేత కేజ్రీవాల్



న్యూఢిల్లీ, మే 12: 'నన్ను అరెస్టు చేసి ఆప్‌ను విచ్ఛిన్నం చేయాలని, ఆప్ ప్రభుత్వాన్ని కూలదోయాలన్న బీజేపీ కుట్ర భగ్నమైంది. నా అరెస్టుతో ఆప్ మరింత బలపడింద'ని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ పేర్కొన్నారు. తాను జైలులో ఉన్నప్పుడు ఆప్ ఎమ్మెల్యేలను, నాయకులను బీజేపీ సంప్రదించిందని తెలిపారు. కానీ వారెవరూ బీజేపీ కుట్రలను సాగనివ్వలేదని, ఆప్‌ను వీడి వెళ్లలేదన్నారు. 'దేశం మిమ్మల్ని చూసి గర్వపడుతోంద'ని తన పార్టీ ఎమ్మెల్యేలను అభినందించారు. ఆదివారం కేజ్రీవాల్ వారితో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో లోక్‌సభ ఎన్నికలకు పది గ్యారెంటీలను ప్రకటించారు. కేంద్రంలో 'ఇండియా' అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా 24 గంటల విద్యుత్తు సరఫరా చేస్తామని, ఢిల్లీలో మాదిరిగా 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇస్తామని చెప్పారు. ఢిల్లీలో చేసినట్టే దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తామని తెలిపారు. ఢిల్లీ మోడల్‌లో దేశమంతటా మారుమూల ప్రాంతాలతో సహా 'మొహల్లా క్లినిక్‌'లు ఏర్పాటు చేస్తామన్నారు. చైనా ఆక్రమించిన భారత భూభాగాన్ని విడిపిస్తామన్నారు. 'చైనా మన భూభాగాన్ని ఆక్రమించింది. కానీ మన ప్రభుత్వం అలాంటిదేమీ లేదంటుంది. ఇది శాటిలైట్ యుగం. చైనా ఎలా మన భూభాగాన్ని ఆక్రమించిందో అందరికీ తెలుసు' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. సైనికులను కేవలం నాలుగేళ్ల కాలానికి నియమించేందుకు మోదీ ప్రభుత్వం తెచ్చిన అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేస్తామని తెలిపారు. శాశ్వత ప్రాతిపదికన సైనికుల నియామకం చేపడతామన్నారు. స్వామినాథన్ కమిటీ నివేదికకు అనుగుణంగా రైతులకు కనీస మద్దతు ధర ఇస్తామన్నారు. ఢిల్లీకి పూర్తిస్థాయి రాష్ట్ర ప్రతిపత్తి కల్పిస్తామన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బీజేపీ అవినీతిపై దేశవ్యాప్తంగా దాడులు చేయిస్తామని, జీఎస్టీని సరళం చేస్తామని కేజ్రీవాల్ తెలిపారు. అయితే, ఈ గ్యారెంటీలను 'ఇండియా' భాగస్వామ్య పక్షాలతో చర్చించలేదని, అందుకు సమయం దొరకలేదని ఒక ప్రశ్నకు బదులిచ్చారు. కానీ ఈ గ్యారెంటీల అమలుకు 'ఇండియా'కు ఎలాంటి అభ్యంతరం ఉండదని చెప్పారు. తాను ప్రధాని పదవి రేసులో లేనని స్పష్టం చేశారు. తర్వాత, కేజ్రీవాల్ పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్‌తో కలిసి ఢిల్లీలో ఆప్ లోక్‌సభ అభ్యర్థుల తరపున రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 25న జరిగే ఎన్నికల్లో ఆప్‌ను గెలిపిస్తే తాను మళ్లీ జైలుకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఇండియా కూటమి పార్టీల అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేసేందుకు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ఈ వారంలో ఆయన ఉత్తరప్రదేశ్, ఝార్ఖండ్, మహారాష్ట్రలో ప్రచారం చేయనున్నారు. ఈనెల 15న లఖ్‌నవూలో, 16న జమ్‌షెడ్‌పూర్‌లో, 17న ముంబైలో ఆయన ప్రచారం నిర్వహించనున్నట్టు ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) నేషనల్ జనరల్ సెక్రటరీ సందీప్ పాఠక్ ఆదివారం తెలిపారు.

కులగణన ద్వారా దేశాన్ని 'ఎక్స్‌రే' తీస్తాం: రాహుల్

న్యూఢిల్లీ, మే 12: ప్రధాని మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదివారం మరోసారి విరుచుకుపడ్డారు. కుబేరుల ద్వారా టెంపోల్లో పొందిన నోట్ల కట్టలను బీజేపీ లెక్కపెట్టుకుంటోందని, తమ పార్టీ మాత్రం అసమానతల్ని పారదోలేందుకు కులగణనను చేపట్టాలని చూస్తోందని ఆయన పేర్కొన్నారు. అంబానీ, అదానీల నుంచి టెంపోల్లో వచ్చిన ధనాన్ని కాంగ్రెస్ పొందుతోందని ఇటీవల ప్రధాని మోదీ ఆరోపించిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "పదేళ్లుగా కుబేరుల నుంచి టెంపోల్లో వచ్చిన నోట్లను వాళ్లు లెక్కపెట్టుకుంటూనే ఉన్నారు. మేము మాత్రం అధికారంలోకి రాగానే కులగణన ద్వారా దేశాన్ని 'ఎక్స్‌రే' తీసి సంపదను అన్ని వర్గాలకు సమానంగా పంచుతా"మని రాహుల్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మోదీ టెంపో వ్యాఖ్యలపై రాహుల్‌గాంధీతోపాటు కాంగ్రెస్ నేతలు తీవ్రంగా స్పందించారు. అంబానీ, అదానీలు తమకు నల్లధనాన్ని పంపినట్లు ఆధారాలుంటే దానిపై ఈడీ, సీబీఐలతో విచారణకు ఆదేశించాలని మోదీని డిమాండ్ చేశారు. మరోవైపు, ఆదివారం మాతృదినోత్సవం సందర్భంగా తల్లులందరికీ రాహుల్‌గాంధీ శుభాకాంక్షలు తెలిపారు. భారత్ జోడో యాత్రలో భాగంగా తన తల్లి సోనియాగాంధీతో పాటు ఇతర మహిళలతో ముచ్చటించిన ఓ వీడియోను ఆయన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో పోస్టు చేశారు.

సోనియా ఎంపీ నిధుల్లో 70% మైనారిటీలకే: షా

రాయ్‌బరేలీ/ప్రతాప్‌గఢ్, మే 12: కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ తన ఎంపీ లాడ్స్ నిధుల్లో 70 శాతానికిపైగా మైనారిటీలపైనే ఖర్చుచేశారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆరోపించారు. ఐదో దశలో ఈనెల 20న ఎన్నికలు జరగనున్న యూపీలోని రాయ్‌బరేలీ, ప్రతాప్‌గఢ్, కౌశంబీ లోక్‌సభ నియోజకవర్గాలలో ఆదివారం అమిత్‌షా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 'అనేక ఏళ్లుగా గాంధీ కుటుంబానికి మీరు అవకాశం ఇచ్చారు. కానీ, అభివృద్ధి ఏమీ జరగలేదు. ఎంపీ నిధుల నుంచి మీకు ఏమైనా అందాయా? మీకు అందకపోతే.. ఆ నిధులన్నీ ఎక్కడికి వెళ్లాయి? అవన్నీ వారి ఓటు బ్యాంకుకు వెళ్లాయి. సోనియాగాంధీ ఎంపీ నిధుల్లో 70 శాతానికిపైగా మైనారిటీలపైనే ఖర్చు చేశారు' అని అమిత్‌షా ఆరోపించారు. 'పాకిస్థాన్ వద్ద అణుబాంబు ఉంది కాబట్టి ఆ దేశాన్ని గౌరవించాలని కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ చెబుతున్నారు. కానీ, పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)ను మనకి ఇచ్చేయాలని వారు డిమాండ్ చేయడం లేదు. పాక్ అణుబాంబుకు రాహుల్ బయపడతారేమో కానీ, బీజేపీ కాదు. పీవోకేను తీసుకొని తీరుతాం' అని అమిత్‌షా స్పష్టం చేశారు.

బెంగళూరు టికెట్ రద్దు చేసుకున్న ప్రజ్వల్ రేవణ్ణ

బెంగళూరు, మే 12(ఆంధ్రజ్యోతి): రాసలీలల పెన్‌డ్రైవ్ వివాదంలో ఇరుక్కుని, విదేశాలకు పరారైన జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ.. ఇప్పట్లో భారత్‌కు వెనుదిరిగి వచ్చేలా లేరు. ఈ నెల 15న బెంగళూరుకు వచ్చేందుకు ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి ఆయన టికెట్ రిజర్వు చేసుకున్నారు. మే 3వ తేదీన టికెట్‌ను రిజర్వు చేసుకున్నట్లు సిట్ అధికారులు గుర్తించారు. అయితే శనివారం ఆ టికెట్‌ను రద్దు చేసుకున్నారు. పెన్‌డ్రైవ్ వివాదంపై దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు, ఏప్రిల్ చివరి వారంలోనే విచారణ చేపట్టారు. ఆ వెంటనే 24 గంటల్లోనే సిట్ ముందు హాజరు కావాలని ప్రజ్వల్‌కు నోటీసులు జారీ చేశారు. అయితే ప్రజ్వల్ వారం రోజుల గడువు కావాలని న్యాయవాదుల ద్వారా సిట్ అధికారులకు విన్నవించారు. దీనిని సిట్ తోసిపుచ్చింది. ఏప్రిల్ 26న పరారీ అయిన ప్రజ్వల్, హంగేరిలోని బుడాపెస్ట్ నగరంలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. కాగా, ప్రజ్వల్ కోసం సిట్ అధికారులను విదేశాలకు పంపడం లేదని హోం మంత్రి పరమేశ్వర్ ఆదివారం బెంగళూరులో మీడియాకు తెలిపారు. ఇంటర్‌పోల్‌కు సమాచారాన్ని అందించామని, వారి ద్వారానే వివరాలు తెలుసుకుంటామని అన్నారు.

నేడే నాలుగో దశ పోలింగ్

- 96 లోక్‌సభ స్థానాల్లో ఓటింగ్
- ఏపీ శాసనసభకు కూడా
- ఒడిశా అసెంబ్లీలోని 28 స్థానాలకూ

న్యూఢిల్లీ(ఆంధ్రజ్యోతి), అమరావతి/లఖ్‌నవూ, మే 12: దేశంలో పార్లమెంటు ఎన్నికల నాలుగో దశ పోలింగ్ సోమవారం జరగనుంది. 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని మొత్తం 96 లోక్‌సభ స్థానాలతోపాటు 175 ఏపీ అసెంబ్లీ స్థానాలకు ఈ విడతలో పోలింగ్ జరగనుంది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభంకానుంది. దీనికిసంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. నాలుగో దశ పార్లమెంటు ఎన్నికల్లో వివిధ పార్టీలకు చెందిన అగ్రనేతలు బరిలో ఉన్నారు. సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్, తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మహువా మొయిత్రా, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీలు ఈ దశలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. గిరిరాజ్ సింగ్ బిహార్‌లోని బెగుసరాయ్ నుంచి, నిత్యానందరాయ్ బిహార్‌లోని ఉజియార్‌పూర్ నుంచి, రావ్‌సాహెబ్ దాన్వే మహారాష్ట్రలోని జల్నా నియోజకవర్గం నుంచి, కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి, టీఎంసీ నేత, మాజీ క్రికెటర్ యూసఫ్ పఠాన్ ఇరువురూ పశ్చిమబెంగాల్‌లోని బహరంపూర్ నుంచి పోటీచేస్తున్నారు. ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ హైదరాబాద్ నుంచి, కాంగ్రెస్ పార్టీ ఏపీ చీఫ్ వైఎస్ షర్మిల కడప పార్లమెంటు స్థానం నుంచి బరిలో ఉన్నారు. మొత్తం 96స్థానాల్లో బీజేపీ 40చోట్ల పోటీ చేస్తుండడం గమనార్హం. మిగిలిన స్థానాల్లో ఎన్డీయే కూట మి అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాగా, ఇప్పటి వరకు జరిగిన తొలి మూడు దశల్లో 283 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ ప్రక్రియ ముగిసింది.

ఏపీ, తెలంగాణలోనే అత్యధిక సీట్లు

తెలంగాణలో 17, ఏపీలో 25, యూపీలో 13, బిహార్‌లో5, ఝార్ఖండ్‌లో 4, మధ్యప్రదేశ్‌లో 8, మహారాష్ట్రలో 11, ఒడిశాలో 4, బెంగాల్‌లో 8, జమ్ము కశ్మీర్‌లోని (శ్రీనగర్) 1 స్థానానికి సోమవారం పోలింగ్ జరగనుంది. కాగా, జమ్ము కశ్మీర్‌లోని ఒకేఒక్క నియోజకవర్గానికి జరిగే ఎన్నికలో 24మంది అభ్యర్థులు పోటీ చేస్తుండడం గమనార్హం. ఆర్టికల్ 370రద్దు తర్వాత జరుగుతున్న తొలి అతిపెద్ద ఎన్నిక ఇదే. ఈ ఎన్నికలో బీజేపీ పోటీకి దూరంగా ఉంది. షియా నాయకుడు అగా సయ్యద్ రుహల్లా మెహ్దీ నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ తరఫున బరిలోఉండగా, పీడీపీ తరఫున వహీద్ పారా పోటీ చేస్తున్నారు.


శ్రీనగర్‌లో ఎన్నికల సిబ్బంది

నాలుగో దశ పోలింగ్ అంకెల్లో..

బరిలో ఉన్న అభ్యర్థులు	1,717
పోలింగ్ కేంద్రాలు	1.92 లక్షలు
పోలింగ్ సిబ్బంది	19 లక్షలు
ఓటర్లు	17.70 కోట్లు
మహిళా ఓటర్లు	8.73 కోట్లు
పురుష ఓటర్లు	8.75 కోట్లు

వీరికి టెన్షన్...

- యూపీలోని ఖేరి నియోజకవర్గం నుంచి వరుసగా మూడోసారి కేంద్రమంత్రి అజయ్ కుమార్ విశ్రా తేని బరిలో ఉన్నారు. 2021లో లఖింపూర్‌ఖేరిలో జరిగిన విధ్వంసం కేసులో ఈయన కుమారుడు నిందితుడు. ఆ కేసు తాలూకు ప్రభా వంపడే అవకాశం ఉందని ఈయన అంతర్మథనం చెందుతున్నారు.
- టీఎంసీ ఫైర్‌బ్రాండ్ మహువా మొయిత్రా.. ప్రశ్నలకు డబ్బులు తీసుకున్నారన్న ఆరోపణలతో లోక్‌సభ నుంచి బహిష్కరణకు గురయ్యారు. ఇప్పుడు మరోసారి ఆమె బెంగాల్‌లోని కృష్ణానగర్ నుంచి పోటీలో ఉన్నారు.
- అఖిలేశ్ యాదవ్ యూపీలోని కన్నోజ్ నుంచి పోటీ చేస్తుండగా ఈయన తరఫున కాంగ్రెస్‌నేత రాహుల్‌గాంధీ ఈ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించారు.
- బెంగాల్‌లోని అసన్‌సోల్ నియోజకవర్గం నుంచి సినీ నటుడు శతృఘ్న సిన్హా టీఎంసీ తరఫున పోటీ చేస్తున్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు ఎస్.ఎస్ అహ్లూవాలియాపై ఆయన బరిలో ఉన్నారు.
- కేంద్రమంత్రి, ఝార్ఖండ్ మాజీ సీఎం అర్జున్ ముండా కుంతి నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్నారు.
- మాధవీలత బీజేపీ తరఫున హైదరాబాద్ నుంచి బరిలో ఉన్నారు.
- బీజేపీ ఫైర్‌బ్రాండ్ నాయకుడు బండిసంజయ్ కరీంనగర్ నుంచి పోటీ చేస్తున్నారు.
- నాలుగో దశ ఎన్నికల ప్రచారంలో రిజర్వేషన్లు, బుజ్జగింపు రాజకీయాలు, ఉద్యోగాలువంటి కీలక అంశాలు ప్రధానంగా అన్ని పార్టీలూ ప్రస్తావించాయి.
- బెంగాల్‌లోని 8నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేసిన 3647 పోలింగ్ కేంద్రాలు అత్యంత సమస్యాత్మకమేనని ఎన్నికల సంఘం గుర్తించింది.
- ఏపీలో ఎన్డీయే కూటమి పక్షాలైన టీడీపీ 17, జనసేన 2, బీజేపీ 6 చోట్ల పోటీలో ఉన్నాయి.
- ఒడిశా శాసనసభకు సంబంధించి 28 స్థానాలకు కూడా నాలుగో దశలోనే పోలింగ్ జరగనుంది.

ఎన్డీయే మిత్రులకు అగ్నిపరీక్ష!

- నాలుగో విడత బరిలో టీడీపీ, జనసేన షిండే సేన, పవార్ ఎన్‌సీపీ, జేడీయూ

న్యూఢిల్లీ, మే12: లోక్‌సభ ఎన్నికల సంగ్రామంలో మరో కీలక ఘట్టం సోమవారం ముగియనుంది. నాలుగో దశలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో 25, తెలంగాణలో 17 ఎంపీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ దశ ఎన్డీయే మిత్రపక్షాలకు అగ్నిపరీక్షేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఆంధ్రలో టీడీపీ-జనసేన, మహారాష్ట్రలో షిండే శివసేన, అజిత్ పవార్ ఎన్‌సీపీ, బిహార్‌లో జేడీయూ, చిరాగ్ పాసవాన్ ఎల్‌జేపీ.. బీజేపీతో జట్టుకట్టాయి. ఆంధ్రలో 25 లోక్‌సభ, 175 అసెంబ్లీ స్థానాలకూ పోలింగ్ జరగనుంది. ఎంపీ స్థానాల్లో టీడీపీ 17, జనసేన2, బీజేపీ6సీట్లలో పోటీచేస్తున్నాయి. టీడీపీ-జనసేన బలంపైనే బీజేపీ పూర్తిగా ఆధారపడింది. మహారాష్ట్రలో ఈ దశలో 11 ఎంపీ స్థానాలకు ఎన్నికలు జరగనుండగా వీటిలో 7చోట్ల బీజేపీ, షిండే సేన3, అజిత్ ఎన్‌సీపీ ఒకచోట బరిలోకిదిగాయి. శివసేన, ఎన్‌సీపీ నిలువునా చీలాక కీలక ఎన్నికలివి. షిండే సేన, అజిత్ ఎన్‌సీపీ తమ బలాన్ని నిరూపించుకోవడమేగాక బీజేపీ బరిలో ఉన్న స్థానాల్లో తమ ఓట్లను బదిలీచేయాల్సి ఉంది. బిహార్‌లో ఈదశలో 5 స్థానాల్లో ఎన్నికలు జరగనుండగా 3చోట్ల బీజేపీ, చెరోచోట ఎల్‌జేపీ, జేడీయూ పోటీ చేస్తున్నాయి. గత ఎన్నికల్లో కలిసి పోటీచేసిన ఎల్‌జేపీ అసెంబ్లీ ఎన్నికలనాటికి దూరమైంది. తర్వాత జేడీయూ బీజేపీనికాదని ఆర్‌జేడీ కూటమితో జట్టుకట్టి ఎన్డీయేలోకివచ్చింది. ఎల్‌జేపీ కలిసి రావడంతో ఆర్‌జేడీ కూటమికి సవాల్ విసురుతున్నాయి.

టెంపోల్లో సొమ్ము వస్తే.. ఈడీని పంపరెందుకు?

- అదానీ, అంబానీలపై దర్యాప్తు చేయించండి.. మోదీకి ఖర్గే సవాలు

ధూలే (మహారాష్ట్ర), మే 12: అదానీ, అంబానీలు కాంగ్రెస్‌కు టెంపోల్లో సొమ్ము పంపిస్తున్నారంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే స్పందించారు. దీంట్లో నిజానిజాలు తేల్చడానికి అదానీ, అంబానీలపై ఈడీ ద్వారా విచారణ జరిపించాలని డిమాండు చేశారు. ఆదివారం ధూలేలో ఎన్నికల ప్రచారంలో ఆయన ప్రసంగిస్తూ.. "అంబానీ, అదానీలు సొమ్ము పంపినప్పుడు మోదీ నిద్ర పోతున్నారా" అని అడిగారు. ఏదో ఆరోపణలు చేసి పారిపోవడం కాదని, దమ్ముంటే దర్యాప్తు చేయించాలని సవాలు చేశారు. ఇంతవరకు వారిని రక్షిస్తూ వస్తున్న మోదీ ప్రస్తుతం వారిని ఎందుకు విమర్శిస్తున్నారని ప్రశ్నించారు. మోదీ మూడోసారి అధికారంలోకి వస్తే పేదలు, దళితులు, గిరిజనులు మరోసారి బానిసలుగా మారుతారని ఖర్గే అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఖాళీగా ఉన్న 30 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఎక్కడ రిజర్వేషన్లను అమలు చేయాల్సి వస్తుందోనన్న ఉద్దేశంతోనే మోదీ ఆ పోస్టులను భర్తీ చేయడం లేదని చెప్పారు.

నలుగురైదుగురి చేతుల్లోనే దేశ సంపద

రాయ్‌బరేలీ, మే 12: దేశ యావత్ సంపదను ప్రధాని మోదీ నలుగురైదుగురు ధనవంతుల చేతుల్లోనే పెట్టారని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ ఆరోపించారు. ఆదివారం ఆమె రాయ్‌బరేలీలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. ప్రైవేటీకరణ పేరుతో బొగ్గు గనులు, విద్యుత్ సంస్థలు, పోర్టులు, విమానాశ్రయాలను మోదీ తన నలుగురైదుగురు ధనవంతులైన స్నేహితులకు పంచిపెట్టారని ఆరోపించారు. మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ పల్లెటూర్లకు వెళ్లి అక్కడి ప్రజలతో మాట్లాడి.. వారి సమస్యలేంటో తెలుసుకుని పరిష్కరించేవారని చెప్పారు. మోదీ ఏనాడైనా పల్లెటూర్లను సందర్శించి ఒక్క రైతునైనా కలిశారా అని ఆమె ప్రశ్నించారు.

అదానీ సంచీడు డబ్బులిచ్చినా చాలు!

- యూట్యూబ్ ఇంటర్వ్యూలో అధీర్ రంజన్

న్యూఢిల్లీ, మే 12: దేశంలో నల్లజాతీయులు, మంగోలాయిడ్లు ఉన్నారనే వ్యాఖ్యలతో నాలుగైదు రోజుల క్రితమే పార్టీని ఇబ్బంది పెట్టిన బెంగాల్ కాంగ్రెస్ చీఫ్ అధీర్ రంజన్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'అదానీ-అంబానీ నుంచి టెంపోల్లో ఎంత నల్లధనం మీకు ముట్టింది?' అంటూ కాంగ్రెస్‌ను ఉద్దేశించి ప్రధాని మోదీ మే 8న చేసిన వ్యాఖ్యలపై ఒక యూట్యూబ్ చానల్ ఆయన స్పందన కోరగా.. "అలా (అదానీ, అంబానీ నుంచి డబ్బు) అంది ఉంటే చాలా ఆనందించేవాణ్ని. టెంపో లోడ్ డబ్బుల సంగతి పక్కన పెట్టండి.. అదానీ మా ఇంటికి ఒక సంచీడు డబ్బులు పంపినా నాకు సరిపోతుంది" అని బదులిచ్చారు. పార్లమెంటులో వారికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని ప్రశ్నించగా.. "వారు డబ్బులు పంపలేదు. అందుకే మాట్లాడాం. వారు పంపి ఉంటే మేం మౌనంగా ఉండేవాళ్లం" అన్నారు. "అంటే డబ్బులు అందితే మౌనంగా ఉంటారా? అదేనా మీరు చెబుతోంది" అని రెట్టించి అడగ్గా.. 'ముందైతే డబ్బులు పంపనివ్వండి" అన్నారు. "మరి ఈడీ, సీబీఐ ఉన్నాయిగా?" అని ఇంటర్వ్యూయర్ ప్రశ్నించగా.. "ఈడీకి ఎవడు భయపడతాడు? ఈడీ ఒక ఇడియట్. అది మోదీ ఆడమన్నట్టల్లా ఆడుతుంది. అరెస్టులు చేసి.. కోర్టు జోక్యంతో విడిచిపెడుతుంది. చూడండి.. కేజ్రీవాల్ విడుదలయ్యారు" అని బదులిచ్చారు. ఈ సంభాషణంతా సరాదాగానే జరిగింది. అయితే, అధీర్ వ్యాఖ్యలపై బీజేపీ విమర్శలు గుప్పించింది. "అధీర్ కాంగ్రెస్ ముసుగు తొలగించారు. అదానీ, అంబానీ నుంచి డబ్బు అందితే వారిపై దాడి చేయడం మానేస్తామని చెప్పారు. వారిద్దరిలో ఒకరిపై దాడిని రాహుల్ ఇప్పటికే ఆపేశారు" అని ఆరోపించింది. కాంగ్రెస్ వసూలు దందాను అధీర్ బయటపెట్టారని ఎద్దేవా చేసింది. అయితే, తాను జోక్ చేశానని.. బీజేపీ జోకులను అర్థం చేసుకోలేదని అధీర్ పేర్కొన్నారు.

రాహుల్ వయస్సంత సీట్లైనా రావు

పశ్చిమ బెంగాల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్‌ను ఉద్దేశించి మోదీ

న్యూఢిల్లీ, మే 12: ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గతంలో ఎన్నడూ రానంత తక్కువ సీట్లు వస్తాయని ప్రధాని మోదీ అన్నారు. ఆయన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వయస్సును గుర్తు చేస్తూ.. "రాహుల్‌కు యాభై ఏళ్లు దాటాయి. కానీ, కాంగ్రెస్ పార్టీకి అన్ని సీట్లు కూడా రావు" అని వ్యాఖ్యానించారు. అవినీతి అనేది ఇండియా కూటమిలోని ఉమ్మడి తత్వం అని, అదే ఆ పార్టీలను కలిపిందని మోదీ ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ ప్రభుత్వం అవినీతిని పూర్తిస్థాయి బిజినెస్‌గా మార్చిందని విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌ను ఆ పార్టీ 'కుటీర బాంబుల పరిశ్రమ'గా మార్చివేసిందని మండిపడ్డారు. "ప్రతి ఇంటికి మంచి నీళ్లు అని మేం అంటుంటే.. ప్రతి ఇంటిలో బాంబు అని వాళ్లు మాట్లాడుతున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఆదివారం బెంగాల్‌లోని హౌరా, బారక్‌పూర్, హుగ్లీలో ఎన్నికల ర్యాలీల్లో పాల్గొని ప్రసంగించారు. అక్రమ వలసదారుల సంక్షేమమే టీఎంసీ ఎజెండా అని, సీఎం మమతా బెనర్జీ బెంగాల్ రాష్ట్ర ప్రజలను పట్టించుకోవడం ఎప్పుడో మానేశారని ఆరోపించారు. ఇక్కడ హిందువులు రెండో తరగతి పౌరులుగా మారిపోయారని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో హిందువులు రామనామం పలకడాన్ని, రామనవమి పండుగను చేసుకోవడాన్ని కూడా అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇటీవల ఓ టీఎంసీ ఎమ్మెల్యే హిందువులను భాగీరథి నదిలో పడేస్తాం అన్నారు. వాళ్లకు అంత ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది?" అని ఎమ్మెల్యే హుమాయూన్ కబీర్ వ్యాఖ్యలను ఉద్దేశిస్తూ మండిపడ్డారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు టీఎంసీ లొంగిపోయిందన్నారు. తాను బతికి ఉండగా సీఏఏను ఎవరూ రద్దు చేయలేరని మోదీ అన్నారు. సీఏఏ అనేది పౌరసత్వం ఇవ్వడానికే తప్ప, లాక్కోవడానికి కాదన్నారు.


హౌరాలో ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ

సందేశ్‌ఖాలీలో టీఎంసీ కొత్త నాటకం

సందేశ్‌ఖాలీలో టీఎంసీ కొత్త నాటకానికి తెరతీసిందని మోదీ ఆరోపించారు. సందేశ్‌ఖాలీ స్థానిక బీజేపీ నేత అక్కడి మహిళల నుంచి ఖాళీ కాగితాలపై సంతకాలు తీసుకొని, ఆ తర్వాత వాటిపై టీఎంసీ నేతలకు వ్యతిరేకంగా ఫిర్యాదులు రాసి పోలీసులకు ఇస్తున్నట్లు తాజాగా వీడియోలు వైరల్ అయ్యాయి. వీటితో పాటు సందేశ్‌ఖాలీలో ఆందోళనలు చేయాలంటూ మహిళలకు బీజేపీనే రూ.2వేల చొప్పున పంచిందని, స్థానిక బీజేపీ నేతనే ఈ విషయాన్ని చెప్పినట్లు మరికొన్ని వీడియోలు వైరల్ అయ్యాయి. వీటిని ఉద్దేశించి మోదీ ఆ వ్యాఖ్యలు చేశారు. సందేశ్‌ఖాలీ మహిళలను టీఎంసీ గూండాలు బెదిరిస్తున్నారన్నారు. "సందేశ్‌ఖాలీలోని తల్లులకు, చెల్లెళ్లకు టీఎంసీ ఏం చేసిందో మనందరం చూశాం. కేవలం నిందితుని పేరు షాజహాన్ షేక్ అని పేరు ఉన్నందుకే ఇదంతా జరుగుతోంది. కానీ, టీఎంసీకి భయపడకండి. దోషులెవరినీ వదలబోం" అని మోదీ అన్నారు.

మంచి పాలన అందించాం

ఈ పదేళ్లలో మంచి పాలనను అందించడం వల్లనే ఎన్నికల ముందు బీజేపీ ఎటువంటి జనాకర్షక విధానాలను ప్రకటించలేదని మోదీ చెప్పారు. పదేళ్ల పాలనలో నిజమైన అభివృద్ధిని ఈ ప్రపంచానికి చూపించామన్నారు. ఆదివారం ఓ జాతీయ వార్తా సంస్థకు మోదీ ఇంటర్వ్యూ ఇచ్చారు. తన అడ్డును రాజకీయంగా తొలగించుకోవడానికే ఇన్నాళ్లుగా విపక్షాలు ప్రయత్నిస్తూ వచ్చాయని ఈ సందర్భంగా విమర్శించారు. పేదలను కేంద్రంగా చేసుకుని తాము నిర్వహించిన కార్యక్రమాల వల్ల గత పదేళ్లలో 25 కోట్లమంది దారిద్ర్యరేఖ నుంచి బయటపడ్డారని వివరించారు. కేవలం ఐదేళ్ల కాలాన్ని దృష్టిలో ఉంచుకుని బీజేపీ ఈ ఎన్నికల్లో పోటీచేయడం లేదని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను నిలపడం లక్ష్యంగానే తలపడుతోందని తెలిపారు.

పీవోకేలో జనాగ్రహం

- ఒక ఎస్సై మృతి.. 78 మంది పోలీసులకు గాయాలు
- కరెంటు చార్జీలపై ప్రజలు భగ్గు.. 144 సెక్షన్ విధింపు

ముజఫరాబాద్(పీవోకే), మే 12: జనాగ్రహంతో పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే) అట్టుడుకుతోంది. శుక్రవారం మొదలైన ఆందోళనలు శనివారానికి తారస్థాయికి చేరుకున్నాయి. కరెంటు చార్జీల తగ్గింపు, గోధుమ పిండిపై సబ్సిడీ ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌తో జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ(జాక్) నేతృత్వంలో శనివారం ఆందోళన చేస్తున్న ప్రజలను చెదరగొట్టేందుకు పోలీసులు ఓ దశలో ఏకే-47తో గాల్లోకి కాల్పులు జరిపారు. దీంతో.. ప్రజలు పోలీసులపై రాళ్లతో దాడికి దిగారు. కొండప్రాంతాలు, ఘాట్ వద్ద పోలీసులపై తిరగబడ్డారు. మూకదాడులు చేశారు. ఈ దాడుల్లో ఓ ఎస్సై మృతిచెందగా.. 78 మంది పోలీసులు గాయపడ్డారు. మరోవైపు 29 మంది ఆందోళనకారులకు గాయాలయ్యాయి. పాకిస్థాన్ సర్కారు పీవోకే ప్రజలపై వివక్ష చూపుతోందంటూ కొన్నేళ్లుగా జాక్ ఆందోళనలు వ్యక్తం చేస్తోంది. 1967లో జీలం నదిపై మంగ్లా డ్యామ్‌ను నిర్మించారు. ఇక్కడ 1,400 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. నిజానికి డ్యామ్ నిర్మాణ సమయంలో.. మొత్తం ఉత్పత్తిలో 300 మెగావాట్లను స్థానికులకు కేటాయిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. 1975 నాటికే పాక్‌సర్కారు డ్యామ్ నిర్మాణ ఖర్చులు వెనక్కివచ్చాయి. అయినా.. ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్తును పంజాబ్‌కు సరఫరా చేస్తున్నారని జాక్ ఆరోపిస్తోంది. అదేవిధంగా గోధుమ పిండిపై సబ్సిడీ విషయంలో జాక్ పోరాడుతోంది. ఈ రెండు డిమాండ్లపై శుక్రవారం బంద్‌కు పిలుపునిచ్చింది. అది విజయవంతం కావడంతో.. శనివారం ఛలో ముజఫరాబాద్(పీవోకే రాజధాని) పిలుపునిచ్చింది. ఆందోళనకారులు జరిపిన దాడిలో ఎస్సై అద్నాన్ ఖురేషీ మృతిచెందారు. పీవోకే వ్యాప్తంగా 144 సెక్షన్‌ను విధించారు. ఇంటర్నెట్ సేవలను కూడా నిలిపివేశారు.



పీవోకే ప్రజల ఆవేదన ఇది..!

తాము పాకిస్థాన్‌లో అంతర్భాగమే అయినా.. పాక్ ప్రభుత్వం తమను వేరుగా చూస్తోందని పీవోకే వాసులు ముందు నుంచి ఆందోళన చేస్తున్నారు. ఒక్క మంగ్లా డ్యామ్ విద్యుదుత్పత్తి విషయంలోనే కాకుండా.. పలు అంశాల్లో పాక్ సర్కారు తీరుపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. ఏటా 20 లక్షల వృక్షాలను నరికి.. కలపను పాక్‌లో విక్రయిస్తున్నారని చెబుతున్నారు. ఇక ఇక్కడ పండే పువ్వులు, వనమూలికలు, నీలం లోయలో రత్నాలను పాక్ కార్పొరేషన్లు దోచుకుపోతున్నాయని ఆరోపిస్తున్నారు.

పంది కిడ్నీ మార్పిడి చేయించుకున్న తొలి వ్యక్తి మృతి

- 2 నెలల క్రితం ఆపరేషన్.. వైద్యంలో సంచలనం
- రిచర్డ్ మరణం కిడ్నీ మార్పిడి వల్ల కాదన్న వైద్యులు



వాషింగ్టన్, మే 12: జన్యుమార్పిడి పంది కిడ్నీని ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్న తొలి వ్యక్తి రిచర్డ్ రిక్ స్లేమన్ శనివారం అమెరికాలోని మసాచూసెట్స్ జనరల్ హాస్పిటల్‌లో మృతిచెందారు. 62ఏళ్ల రిచర్డ్‌కు 2నెలల క్రితం ఇదే ఆస్పత్రిలో వైద్యులు పంది కిడ్నీని అమర్చారు. అయితే, ఆయన మరణానికి పంది కిడ్నీ మార్పిడికి సంబంధంలేదని వైద్యులు తెలిపారు. రిచర్డ్ కుటుంబసభ్యులు వైద్యుల కృషిని అభినందిస్తూ వారి ప్రయత్నం వల్లనే రిచర్డ్‌తో మరో 7వారాలపాటు గడపడానికి తమకు అవకాశం లభించిందన్నారు. మూత్రపిండాల సమస్యతో బాధపడుతున్న రిచర్డ్‌కు 2018లో మసాచూసెట్స్ జనరల్ హాస్పిటల్‌లో సాధారణ కిడ్నీ మార్పిడి జరిగింది. గతేడాది నుంచి ఆ కిడ్నీలో సమస్యలు తలెత్తడంతో రిచర్డ్ డయాలిసిస్ చేసుకోవటం ప్రారంభించినా ఆరోగ్యం మెరుగుపడలేదు. దీంతో వైద్యులు జన్యుమార్పిడి పంది కిడ్నీ ఆపరేషన్‌ను రిచర్డ్‌కు సూచించారు. అందుకు ఆయన అంగీకరించటంతో మార్చి నెలలో పంది కిడ్నీని ఆయనకు అమర్చారు. ఒక సజీవవ్యక్తికి జన్యుమార్పిడి పంది కిడ్నీని అమర్చటం ప్రపంచంలో ఇదే తొలిసారి. అంతకుముందు బ్రెయిన్ డెడ్ వ్యక్తుల్లో మాత్రమే ఇలాంటి ప్రయోగం జరిగింది. సజీవ వ్యక్తుల్లో పంది గుండెను అమర్చిన ప్రయత్నాలూ విఫలమయ్యాయి. పంది కిడ్నీని అమర్చుకొని రెండు నెలలపాటు జీవించిన తొలి వ్యక్తి రిచర్డ్ రిక్ స్లేమన్. సాధారణంగా ఇతర జంతువుల కణజాలాన్ని మనిషి శరీరంలోకి ప్రవేశపెడితే మనిషిలోని రోగనిరోధక వ్యవస్థ తిరస్కరిస్తుంది. దీంతో మనిషి కణజాలం వంటి కణజాలంతో కూడిన పందులను జన్యుమార్పిడి ప్రక్రియలో శాస్త్రవేత్తలు సృష్టిస్తున్నారు. వీటి అవయవాలతో పేషెంట్లకు ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్రచికిత్సలు చేయాలనేది లక్ష్యం. దీన్ని వైద్య పరిభాషలో జీనోట్రాన్స్‌ప్లాంటేషన్ అని అంటారు.

ఇజ్రాయెల్‌కు ఇరాన్ అణుబాంబు హెచ్చరిక !

న్యూఢిల్లీ, మే 12: ఇజ్రాయెల్‌తో తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. తమ దేశ రక్షణ కోసం అవసరమైతే అణుబాంబు తయారీకి వెనుకాడబోమంటూ పరోక్షంగా ఇజ్రాయెల్‌ను హెచ్చరించింది. ఇరాన్ అత్యున్నత నాయకుడి సలహాదారు కమల్ ఖర్రాజీ ఈ ప్రకటన చేశారు. 'అణుబాంబు తయారీపై ప్రస్తుతానికి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ, ఇరాన్ ఉనికి ప్రమాదంలో పడితే మాత్రం మా సైనిక విధానాలను తప్పక మార్చుకుంటాం. ఇజ్రాయెల్ మా అణుస్థావరాలపై దాడి చేస్తే మాత్రం మా స్పందన తీవ్రంగా ఉంటుంది' అని కమల్ ఖర్రాజీ అన్నారు.




నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

ఓటుకు వేళాయె!

నేడే రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్.. కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికకూ నేడే

హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. దేశంలో నాలుగో విడతలో భాగంగా రాష్ట్రంలోని 17 పార్లమెంటు నియోజకవర్గాల్లో సోమవారం పోలింగ్ జరగనుంది. వీటితోపాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ కూడా సోమవారమే జరగనుంది. ఈ ఎన్నికల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 35,809 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో సమస్యాత్మక ప్రాంతాల్లోని 9,900 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్నికల సంఘం పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు గాను తెలంగాణ వ్యాప్తంగా 48 గంటలు ముందుగానే 144 సెక్షన్‌ను అమల్లోకి తెచ్చారు. అన్ని పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. సమస్యాత్మక ప్రాంతాల్లో మాత్రం ఒక గంట ముందుగానే పూర్తిచేయనున్నారు. నిర్ణీత సమయానికి ముందే ఓటర్లు క్యూలైన్లలో నిలబడి ఉంటే.. వారు ఓటు వేసేందుకు ఎంత సమయమైనా అవకాశం కల్పించనున్నారు. ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం కావడానికి గంటన్నర ముందే ఉదయం 5.30 గంటలకు అన్ని పోలింగ్ స్టేషన్లలో ఈవీఎంల పనితీరును అంచనా వేసేందుకు మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,79,519 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. పోలింగ్‌కు 44,906 ఈవీఎం కంట్రోల్ యూనిట్లు, 1,09,941 బ్యాలెట్ యూనిట్లు, 50,135 వీవీ ప్యాట్‌లను సిద్ధం చేసి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి ఆదివారం సాయంత్రం వరకు పోలింగ్ కేంద్రాలకు తరలించారు.



పోలింగ్‌కు పటిష్ఠ భద్రత..

పార్లమెంటు ఎన్నికల పోలింగ్‌కు రాష్ట్ర పోలీసులు 60 వేల మందితోపాటు 160 కంపెనీల కేంద్ర బలగాలు, ఇతర రాష్ట్రాల హోంగార్డులు, భద్రతా బలగాలు 20 వేల మంది, యూనిఫామ్ సర్వీసుల సిబ్బంది 12 వేల మంది భద్రతా ఏర్పాట్లలో పాల్గొంటున్నారు. కాగా, రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల పరిధిలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఇతర ప్రధాన పార్టీలతోపాటు, ఇండిపెండెంట్ అభ్యర్థులు 525 మంది ఈ ఎన్నికల్లో పోటీలో ఉన్నారు. వారి భవితవ్యం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 3,32,16,948 మంది ఓటర్ల చేతిలో ఉంది. మొత్తం ఓటర్లలో మహిళలు 1,67,00,574 మంది, పురుషులు 1,65,13,014, థర్డ్ జెండర్ ఓటర్లు 2,760 మంది ఉన్నారు. స్థానిక పరిస్థితులు, రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు, ఇతర పరిస్థితులపై ఆయా పార్లమెంటు నియోజకవర్గాల్లో అభ్యర్థుల భవితవ్యం ఆధారపడి ఉంది.

ఓటుహక్కు వినియోగించుకోనున్న ప్రముఖులు

లోక్‌సభ ఎన్నికల్లో సోమవారం పలువురు ప్రముఖులు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ హైదరాబాద్‌లోని రామ్‌నగర్‌లో ఓటు వేయనుండగా, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి కూడా నగరంలోనే ఓటు వేయనున్నారు. కాగా, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సతీమణితో కలిసి మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే కొడంగల్‌లో ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఇందుకోసం ఆదివారం రాత్రే తన కుటుంబసభ్యులతో కలిసి సీఎం కొడంగల్‌కు చేరుకున్నారు. కాగా, మాజీ సీఎం కేసీఆర్ దంపతులు చింతమడకలో ఓటు వేయనున్నారు. ఇక అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే వికారాబాద్ నియోజకవర్గం, మర్పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో తన ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

కూలిన టెంట్లు..
సిబ్బంది పరుగులు!
వర్షాలతో పోలింగ్ సిబ్బందికి ఇబ్బంది


హుజూర్‌నగర్‌లోని గోవిందాపురం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన 221, 228 పోలింగ్ కేంద్రం ఆవరణలోకి చేరిన వర్షపు నీరు


ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ పోలింగ్ కేంద్రంలోకి చేరిన వరదనీరు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఎన్నికల వేళ.. పలు జిల్లాల్లో కురిసిన అకాల వర్షాలతో పోలింగ్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల వద్ద ఈదురుగాలులకు టెంట్లు నేలకూలడంతో పరుగులు పెట్టారు. కొన్ని చోట్ల వర్షంలో తడుస్తూనే పోలింగ్ కేంద్రాలకు తరలిపోయారు. పలుచోట్ల పోలింగ్ కేంద్రాల్లోకి భారీగా వరద నీరు చేరింది. ఆసిఫాబాద్ పట్టణంలోని పీటీజీ బాలుర పాఠశాల ఆవరణలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద ఈదురుగాలులు, వానతో టెంట్లు కూలడంతో సిబ్బంది పక్కనే ఉన్న గది వరండాలో తలదాచుకున్నారు. నారాయణఖేడ్‌లోని మోడల్ డిగ్రీ కళాశాల ఆవరణలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఆసిఫాబాద్ పట్టణంలోని జెడ్పీ బాలుర పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన 4 పోలింగ్ బూత్‌ల ఆవరణలోకి భారీగా వరద నీరు చేరి చెరువును తలపించింది. అదే జిల్లాలోని చాలా పోలింగ్ కేంద్రాల్లో వర్షాలకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగడంతో చీకట్లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కామారెడ్డి నియోజకవర్గ కేంద్రంలోనూ వర్షంతో పోలింగ్ సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని గోవిందాపురంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం ఆవరణలోకి నీరు చేరటంతో ఎన్నికల సిబ్బంది అవస్థలు పడ్డారు.




కామారెడ్డిలో వర్షంలో అవస్థలు పడుతూ పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది


ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో నేలకూలిన టెంట్లు


సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో కూలిపోయిన టెంట్లు

పోలింగ్ సిబ్బందికి వ్యక్తిగత కిట్



తాండూరు, మే 12: గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందికి వ్యక్తిగతంగా అవసరమయ్యే వస్తువుల కిట్‌ను అధికారులు డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అందజేశారు. టూత్‌పేస్ట్, బ్రష్, షాంపూ, బిస్కెట్, దువ్వెన, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు, స్నాక్స్ వంటి 12 రకాల వస్తువులు ఈ కిట్‌లో ఉన్నాయి. ఇక వలంటీర్లకు 'దేశ్ కా గౌరవ్' పేరిట ప్రత్యేకంగా టీ షర్టులు కూడా ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికలు-2024.. 'ఎన్నికల పర్వం.. దేశానికి గర్వం' నినాదంతో ఉన్న టోపీలను సిబ్బందికి పంపిణీ చేశారు. ఎండల దృష్ట్యా పంపిణీ కేంద్రంలో మజ్జిగను అందించారు.

ఎన్నికల విధుల్లో ఉద్యోగి హఠాన్మరణం


నర్సింహ (ఫైల్)

వలిగొండ, మే 12: పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పాల్గొన్న యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలానికి చెందిన ఉద్యోగి బొడ్డుపల్లి నర్సింహ (43) ఆదివారం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. పహిల్వాన్‌పురం గ్రామానికి చెందిన నర్సింహ హైదరాబాద్ చంపాపేటలోని ముషీరాబాద్ మైనారిటీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఆదివారం నాంపల్లిలో విధులకు హాజరుకాగా ఆకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుప్పకూలారు.తోటి ఉద్యోగులు స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మరోవైపు.. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వచ్చిన మొగడంపల్లి మండలం రాయిపల్లి తండాకు చెందిన జాదవ్(46) ఫిట్స్ వచ్చి పడిపోయారు. వైద్యం కోసం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

ఎన్నికల విధులకు గైర్హాజరు.. 48 మందిపై కేసు

దేవరకొండ, మే 12: లోక్‌సభ ఎన్నికల విధులకు గైర్హాజరైన దేవరకొండ డివిజన్‌లోని 48 మంది ఉద్యోగులపై కేసు నమోదైంది. ఆదివారం నల్లగొండ జిల్లా దేవరకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ హరిచందన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధులకు సిబ్బంది గైర్హాజరు అయినట్లు తెలుసుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు పోలింగ్ విధులకు రిపోర్టు చేయని పీవో, ఏపీవో, ఇతర సిబ్బందిపై ప్రజాప్రాతినిధ్య చట్టం 1951కింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు ఫిర్యాదు మేరకు 48 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



నేడు వేతనంతో కూడిన సెలవు

హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): పౌరులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వెసులుబాటు కల్పించే ఉద్దేశంతో.. పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) సూచించింది. రాష్ట్రంలోని అన్ని వ్యాపార సంస్థలు, పరిశ్రమలు, కంపెనీలు, ఇతర సంస్థలు సోమవారం సెలవు ప్రకటించాలని, అందులో పనిచేసే సిబ్బందికి వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ఈసీఐ ఆదేశించింది. దీని ఆధారంగా పోలింగ్ జరిగే 17 లోక్‌సభ స్థానాలు, ఉప ఎన్నిక జరిగే కంటోన్మెంట్ పరిధిలోని కంపెనీలు, వ్యాపార సంస్థలు, షాపులు, పరిశ్రమలు తమ వద్ద పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నిబంధనను అతిక్రమించిన వారిపై కార్మిక చట్టం ప్రకారం చర్యలు ఉంటాయని రాష్ట్ర కార్మిక సంక్షేమశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాణి కుముదిని పేర్కొన్నారు.

దారులన్నీ ఏపీ వైపే

- ఓటు వేసేందుకు పట్నం వదిలి పల్లెలకు పయనం
- హైదరాబాద్ నుంచి ఏపీ, తెలంగాణ పల్లెలకు జనం
- ఎంజీబీఎస్ నుంచి ఆంధ్రాకు 590 ప్రత్యేక బస్సులు
- పంతంగి, కోర్లపహాడ్ టోల్‌గేట్ల వద్ద వాహనాల రద్దీ

హైదరాబాద్ సిటీ, హైదరాబాద్, చౌటుప్పల్ టౌన్, కేతేపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): ఓట్ల పండుగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో గత రెండు రోజులుగా హైదరాబాద్‌లోని బస్టాండ్లు.. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వేస్టేషన్లు కిక్కిరిసిపోతున్నాయి. ఓవైపు స్కూళ్లు, కాలేజీలకు వేసవి సెలవులు రావడం, మరోవైపు ఎన్నికల తేదీ 13(సోమవారం)కి ముందు రెండ్రోజులు(శని,ఆదివారాలు) సాధారణ సెలవులు కూడా రావడంతో లక్షలాది మంది ఉద్యోగులు, వ్యాపారులు, కూలీపనులు చేసుకునే వారు ఊరిబాట పట్టారు. ఇలా ఏపీ, తెలంగాణలోని జిల్లాలకు వెళ్లే ప్రయాణికులతో ఎంజీబీఎస్, జేబీఎస్.. ఆదివారం సాయంత్రం వరకూ రద్దీగా కన్పించాయి. సొంతూళ్లకు వెళ్లేవారి కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్టు ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ఏపీలోని పలు జిల్లాలకు ఎంజీబీఎస్, ఆరాంఘర్, ఎల్బీనగర్, ఉప్పల్ ప్రాంతాల నుంచి ఆదివారం రాత్రి 590 స్పెషల్ సర్వీసులు అందుబాటులో ఉంచినట్టు వెల్లడించారు. వాటిలో హైదరాబాద్- విజయవాడ రూట్‌లోని 140 బస్సులకు ముందస్తు రిజర్వేషన్‌కు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. అలాగే.. హైదరాబాద్ నుంచి తెలంగాణలోని వివిధ జిల్లాలకు 1500కు పైగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అయితే.. బయల్దేరిన వాహనాల కారణంగా ఎల్బీనగర్, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్ ఔటర్ రింగ్ రోడ్డు వరకూ పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఆదివారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12గంటల దాకా వాహనదారులు ఇబ్బందిపడ్డారు. సాయంత్రం 4 గంటల తర్వాత కూడా మళ్లీ అదే పరిస్థితి కనిపించింది. కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మూసాపేట్, మియాపూర్, శేరిలింగపల్లి ప్రాంతాల నుంచి దాదాపు 4.5 లక్షల మంది సొంతూళ్లకు వెళ్లినట్టు అంచనా. ఈ వాహనాలతో యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 65వ నంబరు జాతీయ రహదారి కూడా రద్దీగా మారింది. పంతంగి టోల్‌ప్లాజా వద్ద 16 కౌంటర్లు ఉండగా, విజయవాడ వైపు 10 కౌంటర్ల ద్వారా వాహనాలను అనుమతిస్తున్నారు. సాధారణ రోజుల్లో అక్కడ 30-35 వేల వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుండగా, ఆదివారం అదనంగా 15వేల వాహనాలు వెళ్లాయి. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజాలో 12కౌంటర్లలో 7 కౌంటర్లను విజయవాడ వైపు వెళ్లే వాహనాలకు కేటాయించారు.


చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై ఏపీ వైపునకు వెళ్తున్న వాహనాలు

రైల్వేస్టేషన్‌లోనూ..


ఓట్ల పండుగ నేపథ్యంలో.. వారం రోజులుగా ఏపీవైపు వెళ్లే రైళ్లు, నగరంలోని ప్రధాన స్టేషన్లు కూడా కిటకిటలాడుతున్నాయి. శుక్ర, శని వారాల్లో అయితే.. ప్రయాణికుల రద్దీ ఇసుకేస్తే రాలనంతగా పెరిగింది. సికింద్రాబాద్ స్టేషన్‌కు రోజూ సగటున 1.6 లక్షల మంది ప్రయాణీకులు వచ్చిపోతుంటారు. శని, ఆది వారాల్లో రోజుకు 2 లక్షల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగించడం విశేషం. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి, కర్నూలు, కడప నగరాల వైపు వెళుతున్న రైళ్లకు జనం పోటెత్తారు. శ్రీకాకుళం, విజయనగరం, చిత్తూరు, కడప వంటి దూరప్రాంతాలకు వెళ్లాల్సినవారు ప్రధానంగా రైలు ప్రయాణాలనే ఎంచుకున్నారు. ప్రయాణానికి ఒకరోజు ముందుగా విడుదల చేసే తత్కాల్ టికెట్ల కోసం రిజర్వేషన్ కౌంటర్ల వద్ద పడిగాపులు కాశారు. తత్కాల్ కోటాలో కూడా టికెట్లు కూడా దొరకని వారు వెయిటింగ్ లిస్ట్ టికెట్లతోనే ఎక్కేశారు. ఖరీదైన ఏసీ తరగతుల్లోనూ శని, ఆదివారాల్లో 100కు పైగా వెయిటింగ్ లిస్ట్ ఉండడం గమనార్హం.

ఎవరి ధీమా వారిదే!

తెలంగాణ ఓటరు తమవైపేనంటున్న అన్ని పార్టీలు

- 14 సీట్లు తమవేనంటున్న కాంగ్రెస్
- ఆధిపత్యం కొనసాగుతుందని ధీమా
- డబుల్ డిజిట్ పక్కా అంటున్న బీజేపీ
- మోదీ కరిష్మా.. హిందూ ఓటర్లపై ఆశలు
- ఉనికి కోసం శ్రమిస్తున్న బీఆర్ఎస్

హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓటర్లు కేంద్రంలోనూ మార్పు కోరుకుంటున్నారా? లేక మోదీ సర్కారే కొనసాగాలనుకుంటున్నారా? బీఆర్ఎస్‌కు ఏ స్థానాన్ని కట్టబెట్టాలనుకుంటున్నారు? ప్రస్తుతం రాజకీయ వర్గాలను తొలుస్తున్న ప్రశ్నలివి. ఈ ప్రశ్నలకు ఓటరు మహాశయుడు తన సమాధానాన్ని సోమవారం ఈవీఎంలో రిజర్వు చేయనున్నాడు. అయితే అధికారంలోకి వస్తే తాము ఏం చేస్తామో చెప్పడం దగ్గర్నుంచి సెంటిమెంట్లు, మాటల తూటాలు, సుడిగాలి పర్యటనలతో ఓటర్లను ఆకర్షించేందుకు అన్ని ప్రయత్నాలూ చేసిన ప్రధాన పార్టీల నేతలు మాత్రం ఓటరు ఇచ్చే తీర్పు పట్ల ఎవరి ధీమాతో వారు ఉన్నారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ సీట్లలో తాము 14 సీట్లను గెలుచుకుంటామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ.. కనిష్ఠంగా 11 సీట్లు తమకే దక్కుతాయంటోంది. ఇక 2019 ఎన్నికల్లో నాలుగు ఎంపీ సీట్లు దక్కించుకున్న బీజేపీ.. ఈసారి రెండంకెల సీట్లను కచ్చితంగా సాధిస్తామని ధీమాగా చెబుతోంది. ఇక ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలు కావడంతో డీలా పడ్డ బీఆర్ఎస్.. పార్టీ ఉనికిని నిలబెట్టుకునేందుకు ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ తెరపైకి తెచ్చి.. 12 నుంచి 14 సీట్లు ఇస్తే తెలంగాణ తడాఖా చూపెడతామంటూ ఓటర్లను వేడుకుంటున్నారు.



ఆధిపత్యం కొనసాగించాలని..

అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఉత్సాహంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆధిపత్యం ప్రదర్శిస్తామని ధీమా వ్యక్తం చేస్తోంది. రాహుల్‌గాంధీ కరిష్మా, రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పనితీరు, కాంగ్రెస్ పార్టీ పాంచ్ న్యాయ్, పచ్చీస్ గ్యారెంటీలు తెలంగాణ ఓటర్లలో సానుకూల వాతావరణాన్ని తీసుకువచ్చాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. బీజేపీని గద్దె దించేందుకు దేశవ్యాప్తంగా ముస్లిం మైనారిటీలు ఇండియా కూటమి వైపునకు పోలరైజ్ కావడం తమకు కలిసివస్తుందంటున్నారు. రాష్ట్రంలోనూ గణనీయమైన సంఖ్యలో ఉన్న ముస్లిం మైనారిటీ ఓటర్లలో అత్యధికులు కాంగ్రెస్‌కే మద్దతుగా ఉన్నారని చెబుతున్నారు. దీంతోపాటు బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను రద్దు చేస్తుందంటూ రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రచారం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లోకి బలంగా వెళ్లిందని, ఈ వర్గాలు కూడా ఇప్పుడు కాంగ్రెస్ వైపే చూస్తున్నాయని అంటున్నారు. రాష్ట్రంలో 90 శాతానికి పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు కాంగ్రెస్ పట్ల సానుకూలంగా ఉండడం, రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంలో 11 నుంచి 14 సీట్లు దక్కించుకుంటామ విశ్వాసంతో ఉన్నారు. అయినప్పటికీ.. పోల్ మేనేజ్‌మెంట్ విషయంలోనూ కాంగ్రెస్ నాయకత్వం పకడ్బందీగా వ్యవహరిస్తోంది. ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక కమిటీని వేసి.. ఓటరును పోలింగ్ బూత్ వరకు తీసుకెళ్లి ఓటు వేయించే బాధ్యతను అప్పగించింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నచోట్ల అసెంబ్లీ ఎన్నికలను మించి మెజారిటీలు రావాలని టార్గెట్లు కూడా విధించింది. క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగం గతంలో ఎన్నడూ లేనంత పట్టుదలగా పని చేస్తోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

బీఆర్ఎస్ బలహీనపడడంతో..

2018 ఎన్నికల్లో నాలుగు ఎంపీ సీట్లు దక్కించుకున్న బీజేపీ.. ఈ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు తమవేనంటోంది. మోదీ కరిష్మాకు తోడు.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక ఓటు కూడా తమకే పడుతుందని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పూర్తిగా బలహీనపడడంతో ప్రభుత్వ వ్యతిరేక ఓటరు బీజేపీ వైపు చూస్తున్నాడని విశ్లేషిస్తున్నాయి. దీనికి తోడు.. ముస్లిం ఓటర్లు కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్న ప్రచారంతో హిందూ ఓటర్లు బీజేపీ వైపునకు పోలరైజ్ అవుతున్నారని చెబుతున్నాయి. అయితే పోల్ మేనేజ్‌మెంట్‌లో కాంగ్రెస్‌తో పోలిస్తే బీజేపీ కొంత బలహీనంగా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, జాతీయ అంశాలే ఎజెండాగా నిలిచే లోక్‌సభ ఎన్నికల్లో.. కాంగ్రెస్, బీజేపీల మధ్య తన ఉనికిని చాటుకునేందుకు బీఆర్ఎస్ తీవ్రంగా శ్రమిస్తోంది. ఆ పార్టీ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు తదితరులు విస్తృతంగా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ ఎన్నికలు పార్టీకి జీవన్మరణ సమస్యగానూ మారడంతో మెజారిటీ సీట్లలో పోటీ ఇచ్చి ఉనికి చాటుకునే ప్రయత్నాల్లో బీఆర్ఎస్ ఉంది.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరికెన్ని ఓట్లు!?



పార్టీ	ఓట్లు
కాంగ్రెస్	6,37,872
బీఆర్ఎస్	5,33,595
బీజేపీ	1,17,968

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా. అభ్యర్థిగా కాంగ్రెస్‌లో తనకు గట్టి మద్దతుదారైన సీనియర్ నేత. ఆయనను గెలిపించుకోవడాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సీఎం. ఇదే అంశాన్ని అస్త్రంగా మలచుకున్న ప్రతిపక్షాలు. కాంగ్రెస్‌ను ఓడించడం ద్వారా సీఎంకు రాజకీయంగా సవాల్ విసరాలని బీఆర్ఎస్, బీజేపీ ప్రయత్నం. దీంతో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో హోరాహోరీ పోరు సాగుతోంది.

2019 లోక్‌సభ ఎన్నికల్లో..

బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ
4,99,672	3,99,024	12,921
పోతుగంటి రాములు	మల్లు రవి	బంగారు శ్రుతి

పురుషులు	8,60,034
మహిళలు	8,70,739
ఇతరులు	0
మొత్తం ఓటర్లు	17,34,773

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఏ సెగ్మెంట్ ఎవరికి!?

కాంగ్రెస్: కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, వనపర్తి.

బీఆర్ఎస్: గద్వాల, అలంపూర్.

సీఎం ప్రతిష్ఠకు సవాల్!

రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో హోరాహోరీ.. నాగర్‌కర్నూల్‌లో ప్రతిష్ఠాత్మక పోరు

మల్లు రవికి పరీక్షగా పార్లమెంటు ఎన్నిక.. ప్రభుత్వ పదవిని వదులుకొని బరిలోకి.. గట్టి పోటీ ఇస్తున్న ప్రవీణ్‌కుమార్, భరత్



నాగర్‌కర్నూల్, మే 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సొంత జిల్లాలోని ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానం నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ తరఫున ఆ పార్టీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి పోటీ చేస్తుండగా, బీఆర్ఎస్ నుంచి మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీజేపీ నుంచి మాజీ ఎంపీ పోతుగంటి రాములు కుమారుడు భరత్‌ప్రసాద్ బరిలో నిలిచారు. స్వయాన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు సోదరుడైన మల్లు రవి.. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేత. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పదేండ్లు అధికారానికి దూరంగా ఉన్నప్పటికీ పార్టీ పునర్వైభవానికి కృషి చేశారు. అదే ఆయనకు కలిసొచ్చిన అంశంగా మారింది. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, మాజీ ఎంపీ మంద జగన్నాథ్ కూడా కాంగ్రెస్ టికెట్ కోసం విశ్వప్రయత్నాలు చేసినా.. టికెట్ మల్లు రవినే వరించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టాక ఆయనను ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధిగా నియమించి క్యాబినెట్ హోదా కల్పించినా ఆ పదవికి రాజీనామా చేసి మరీ నాగర్‌కర్నూల్ ఎంపీగా బరిలోకి దిగారు. కాగా, బీఆర్ఎస్ తరఫున సిటింగ్ ఎంపీగా ఉన్న పోతుగంటి రాములు అనూహ్యంగా తన కుమారుడితో కలిసి బీజేపీలో చేరారు. జడ్పీ చైర్మన్ ఎన్నిక విషయంలో తన కుమారుడికి తప్ప వేరొకరికి అవకాశం లేకున్నా.. అప్పటి ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, మరికొందరు జిల్లా ఎమ్మెల్యేలు అధిష్ఠానం వద్ద పావులు కదిపి భరత్‌ప్రసాద్‌కు ఆ పదవి దక్కకుండా చేశారనే కోపంతో రాములు బీఆర్ఎస్‌ను వీడారు. బీజేపీలో చేరడంతోనే తన కుమారుడికి టికెట్ దక్కించుకున్నారు.



సమరమే

ప్రధాని మోదీ ప్రత్యేక దృష్టి..


రేవంత్‌రెడ్డిని దెబ్బ కొట్టే ఉద్దేశంతో నాగర్‌కర్నూల్ స్థానాన్ని బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. జిల్లా కేంద్రంలో జరిగిన బీజేపీ బహిరంగ సభలో స్వయంగా ప్రధాని నరేంద్రమోదీ పాల్గొని రాములు తనయుడు భరత్‌ప్రసాద్ పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత భరత్‌ప్రసాద్ నామినేషన్ కార్యక్రమానికి గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్‌ను పంపించి.. ఈ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి బీజేపీ ప్రయత్నిస్తుందని చెప్పకనే చెప్పారు. ఇక ఈ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వ్యవహారం కూడా రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర బీఎస్పీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఐపీఎస్ అధికారి అయిన ప్రవీణ్‌కుమార్ అనూహ్యంగా గులాబీ శిబిరంలో చేరారు. ఆ పార్టీ నుంచి బీఫామ్ దక్కించుకుని ఎన్నికల బరిలోకి దిగారు. మరోవైపు మాజీ ఎంపీ మంద జగన్నాథ్.. కాంగ్రెస్ నుంచి బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయవతి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. బీఫామ్ కూడా తీసుకొచ్చి నామినేషన్ దాఖలు చేశారు. అయితే బీఫామ్ సమర్పించకపోవడం, తగినంత మంది మద్దతుదారులు లేకపోవడంతో ఆయన నామినేషన్ తిరస్కరణకు గురైంది. కానీ, మూడుసార్లు నాగర్‌కర్నూల్ ఎంపీగా, రెండుసార్లు ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా కొనసాగిన మంద జగన్నాథ్ అంత అసమగ్రంగా నామినేషన్ దాఖలు ఎలా చేశారనే అంశంపై జిల్లాలో తర్జనభర్జనలు జరుగుతున్నాయి.

మాదిగలు, బీసీల ఓట్లే కీలకం..

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో మాదిగలు, బీసీల ఓట్లే కీలకం కానున్నాయి. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్న ఈ నియోజకవర్గంలో మొత్తం 17,34,773 మంది ఓటర్లుండగా.. వీటిలో 3లక్షల 54వేల పైచిలుకు ఓట్లు మాదిగ సామాజికవర్గానికి చెందిన వారివే ఉన్నాయి. కాగా, గద్వాల, వనపర్తి, అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తిలలో మైనారిటీ వర్గం ఓటర్లు కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ.. రైతులు, మైనారిటీ వర్గం వారి ఓట్లను పెద్ద సంఖ్యలో తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తుండగా, బీజేపీ.. యువకులు, మహిళలు, అప్పర్ మిడిల్ క్లాస్ ఉద్యోగుల ఓట్లపై కన్నేసింది. బీఆర్ఎస్ మాత్రం కాంగ్రెస్ 150 రోజుల పాలనపై విమర్శలు గుప్పిస్తూ ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నాలు చేస్తోంది.

రా రండోయ్.. ఓట్ల పండుగకు

- 'ప్రజాస్వామ్య వేడుక'లో భాగస్వాములు కండి..!
- వైవిధ్య రీతిలో ఎన్నికల సంఘం ఆహ్వాన పత్రిక



INVITATION

FESTIVAL OF DEMOCRACY

GENERAL (PARLIAMENT) ELECTION - 2024

All ARE CORDIALLY INVITED WITH ELIGIBLE VOTERS IN YOUR FAMILY

VOTING DAY & DATE

Monday May 13, 2024

Time : 7 AM - 5 PM

VENUE

Your Polling Station

DINNER

All the fruits of vibrant democracy through out 5 years

Please accompanied with any one of your Photo ID Card permitted by ECI

Prepared in interest of public awareness

పెళ్లికో.. గృహ ప్రవేశానికో.. మరేదైనా శుభకార్యానికో.. మనందరం ఆహ్వాన పత్రికలు కొట్టిస్తాం..! సకుటుంబ సమేతంగా హాజరై నిండు మనసుతో దీవించాలని కోరుతాం..! సమాజంలో ఇదంతా సంప్రదాయం..! మరి.. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కూడా ఓ శుభకార్యమే..! పోలింగ్ అంటే పండుగే..! అందుకే.. రారండోయ్ ఓట్ల వేడుకకు అని హృదయపూర్వకంగా పిలుస్తోంది ఎన్నికల సంఘం..! ఇంట్లోని అర్హులైన అందరూ తగిన గుర్తింపు కార్డులతో సోమవారం హక్కును వినియోగించుకోవాలని జాతీయ చిహ్నం నాలుగు సింహాల ముద్రతో అభ్యర్థిస్తోంది..! వేదిక మీ పోలింగ్ కేంద్రమేనని.. మే 13వ తేదీ ఉదయం 7 గంటలకు మొదలయ్యే సుముహూర్తం.. సాయంత్రం 5 వరకు ఉంటుందని.. ఏదేని గుర్తింపు కార్డుతో తప్పకుండా హాజరు కావాలని కోరుతోంది. ఇక విందు అంటారా? మీరు వేసే ఓటు ఓ విత్తనం అని.. ఐదేళ్ల పాటు ప్రజాస్వామ్య మధుర ఫలాలను అందిస్తుందని మంచి మాటలు చెబుతోంది. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వైవిధ్యంగా ఎలక్షన్ కమిషన్ ముద్రించిన ఈ ఆహ్వాన పత్రిక సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

రోడ్ షో పుట్టింది తెలంగాణలోనే..

అదీ రాజీవ్ నోట



హైదరాబాద్, మే 12(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కాలంలో తరచూ వినిపించే పదం రోడ్‌షో. ఇప్పుడు ఎమ్మెల్యేల నుంచి ప్రధాని వరకు అందరూ రోడ్‌షోలు చేస్తున్నారు. బహిరంగ సభలా భారీగా ప్రజలను తరలించి పెద్దఎత్తున ఏర్పాట్లు చేయాల్సిన అవసరం లేకపోవడం వీటి ప్రత్యేకత. కేవలం వాహనానికి మైక్ పెట్టుకుని జనంలోకి నేరుగా వెళ్లిపోవచ్చు. ఇంతగా ప్రాచుర్యం పొందిన రోడ్‌షో పదం పుట్టింది తెలంగాణలోనే కావడం, అది కూడా మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ నోటివెంట కావడం విశేషం. 1984 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో రాజీవ్ ఖమ్మంలో సభలో పాల్గొన్నారు. మరుసటి రోజు మహబూబాబాద్‌లో సభ ఏర్పాటు చేయాలని డోర్నకల్ అప్పటి ఎమ్మెల్యే రామసహాయం సురేందర్‌రెడ్డిని అధిష్ఠానం కోరింది. అయితే, తగిన సమయం లేదని ఆయన చెప్పారు. దీంతో "సురేందర్‌రెడ్డీ.. మీకు నా మీటింగ్ అవసరం లేదా"? అని రాజీవ్ ప్రశ్నించారు. ఏర్పాట్లకు వీలుపడదనే సభ వద్దన్నానని, మహబూబాబాద్ నుంచి తొర్రూర్‌కు తీసుకెళ్తానని చెప్పారు. అలా మరిపెడ మీదుగా వాహనంలో బయల్దేరారు. ప్రతి బస్టాప్‌లో జన సమీకరణ జరగ్గా వారిని ఉద్దేశించి రాజీవ్ మాట్లాడారు. ఇలా 500 మందితో మొదలై 5వేల మంది వరకు వచ్చారు. రాజీవ్ సంతృప్తి చెంది.. సభ కంటే ఈ 'రోడ్ షో' బాగుంది అని అన్నారు. అలా రోడ్‌షో పదం ఆయన నోటి నుంచి తొలిసారిగా వెలువడింది. 92 ఏళ్ల సురేందర్‌రెడ్డి తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ విషయం చెప్పారు.

ఓటరు స్లిప్పు అందలేదా?



లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కోసం ఓటర్ స్లిప్పులు అందలేదా? ఓటర్ కార్డు చేతిలో ఉన్నా.. ఏ పోలింగ్ స్టేషన్‌లో.. ఏ బూత్‌లో ఓటు వేయాలో తెలియట్లేదా? మీరు ప్రతీ పోలింగ్ బూత్ చుట్టూ చక్కర్లు కొట్టాల్సిన అవసరం లేదు..! మూడు మార్గాల్లో మీరు మీ పోలింగ్ బూత్ ఎక్కడుందో కనుక్కోవచ్చు. అక్కడికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. అవీ వివరాలు..

1. ఆన్‌లైన్‌లో https://electoralsearch.eci.gov.in నుంచి ఓటర్ స్లిప్పును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ వెబ్‌సైట్‌లోకి వెళ్లగానే.. మూడు ఆప్షన్లు వస్తాయి. అందులో ఓటరు ఐడీ, మొబైల్ నంబరు, పేరు, ప్రాంతం వంటి వివరాలను నమోదు చేయాలి. ఆ వెంటనే మీ ఓటరు స్లిప్ కనిపిస్తుంది. పీడీఎఫ్ రూపంలో ఓటరు స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
2. ఎన్నికల సంఘం ప్రత్యేకంగా రూపొందించిన ఓటరు హెల్ప్‌లైన్ యాప్ ద్వారా కూడా మొబైల్ ఫోన్‌లో ఓటరు స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్‌లో ఎలక్టోరల్ రోల్ సెర్చ్ ఆప్షన్‌పై క్లిక్‌చేసి.. వివరాలు నమోదు చేయాలి. అప్పుడు ఓటరు స్లిప్‌ను పొందవచ్చు. లేదంటే మీ ఓటర్ ఐడీపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను ఈ యాప్ ద్వారా స్కాన్ చేసినా.. ఓటర్ స్లిప్పు వస్తుంది.
3. ఇక స్మార్ట్‌ఫోన్ కాకుండా.. మామూలు ఫోన్ ఉన్నవారు 1950 నంబరుకు ఎస్సెమ్మెస్ పంపడం ద్వారా eci అని టైప్ చేసి, మీ ఓటర్ ఐడీ నంబర్‌ను ఎంటర్ చేస్తే.. పోలింగ్ బూత్‌కు సంబంధించిన వివరాలు వస్తాయి.

పైన పేర్కొన్న మూడు పద్ధతుల్లో ప్రింట్‌అవుట్ తీసుకోకున్నా.. పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లి ఆ వివరాలను అందజేస్తే.. అక్కడ పార్టీల ఏజెంట్లు మీకు ఓటర్ స్లిప్పును రాసిస్తారు.

మీ ఓటును ఇతరులు వేస్తే..



మీరు పోలింగ్ బూత్‌కు వెళ్లేసరికి మీ ఓటును ఎవరైనా వేసినట్లు(దొంగ ఓట్లు) తెలుసుకుంటే.. వెంటనే నిరాశతో వెనుదిరగకూడదు. మీరు మీ ఓటు హక్కును వినియోగించుకునేలా భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) చట్టం-1961లో 49సీని అమల్లోకి తీసుకువచ్చారు. 49సీ ద్వారా మీరు మీ ఓటుహక్కును వినియోగించుకోవచ్చు. ఇందుకోసం ప్రిసైడింగ్ అధికారి(పీవో)ను కలవాల్సి ఉంటుంది. తన ఓటును ఎవరో వేశారని, అసలు వ్యక్తి తానేనని నిరూపించుకోవాలి. ఓటర్‌కార్డుతోపాటు.. ఇతర గుర్తింపు కార్డులను చూపించాలి. అప్పుడు ప్రిసైడింగ్ అధికారి ఫామ్-17డీ ఇస్తారు. దాన్ని పూర్తిచేసి ఇస్తే.. టెండర్ బ్యాలెట్ పేపర్‌ను అందజేస్తారు. దానిపై ఓటువేసి, ప్రిసైడింగ్ అధికారికి అందజేయాలి.

వీవీప్యాట్ గురించి తెలుసు కదా?



మీరు ఎవరికి ఓటు వేశారో.. ఆ అభ్యర్థి పార్టీ లేదా ఎన్నికల గుర్తు, పేరు, సీరియల్ నంబర్.. వీవీప్యాట్‌లో స్లిప్ రూపంలో కనిపిస్తాయి. దాని ద్వారా మీరు మీ ఓటుహక్కును సక్రమంగానే వినియోగించుకున్నారని అర్థం చేసుకోవచ్చు. 7 సెకన్లపాటు వీవీప్యాట్‌లో స్లిప్ కనిపిస్తుంది.

15 నిమిషాల్లోనే ఓటేయొచ్చు..

పోలింగ్ రోజు సెలవును ఎంజాయ్ చేయాలనే ఉద్దేశంతో చాలా మంది ఓటింగ్‌కు వెళ్లరు. కొందరైతే.. క్యూలో నిలబడలేక.. ఇంట్లో ఉండడమే బెటర్ అనుకుంటారు. అయితే.. కొన్ని చిట్కాలు పాటిస్తే పోలింగ్ బూత్ వద్ద త్వరగా ఓటు వేయవచ్చని అధికారులు చెబుతున్నారు.

- ఓటింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై.. సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుంది. పట్టణ ప్రాంతాల్లో ఉదయం ఓటింగ్ ప్రారంభమైన వెంటనే పెద్దగా క్యూ ఉండదు. ధ్రువపత్రాలు సరిగ్గా ఉంటే.. 10-15 నిమిషాల్లో ఓటు వేసి బయటకు రావొచ్చని అధికారులు వివరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లలో చైతన్యం ఎక్కువ. అందుకే వారు ఉదయాన్నే క్యూకడతారు. అక్కడ మధ్యాహ్నం వేళల్లో వెళ్తే.. పెద్దగా క్యూ ఉండదు.
- చాలా మంది ఉదయం 5-6 గంటల సమయంలో వాకింగ్‌కు వెళ్తుంటారు. అలాంటి వారు ఓటర్ ఐడీని వెంట తీసుకెళ్తే.. పనిలో పనిగా ఓటువేసి రావొచ్చు.
- పోలింగ్ కేంద్రం దూరంగా ఉన్నవారికి ర్యాపిడో ఉచిత రైడ్ సౌకర్యాన్ని అందజేస్తోంది. వికలాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు.
- సాయంత్రం 6 గంటల్లోపు క్యూలైన్‌లో ఉన్నా.. ఓటు వేసేందుకు అనుమతి ఉంది.



పోరాటాల గడ్డ.. ఎవరికో అడ్డా!

ఆదిలాబాద్‌లో ఆదివాసీల పోరు.. పెరిగిన బలంతో విజయంపై బీజేపీ ఆశలు

- సిటింగ్ స్థానాన్ని నిలబెట్టుకుంటామని నమ్మకం
- ఈసారి పాగా వేయాలన్న పట్టుదలతో కాంగ్రెస్
- కార్యకర్తల బలంతో గట్టెక్కే ప్రయత్నంలో బీఆర్ఎస్



ఆదిలాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో మొత్తం 16,50,175 మంది ఓటర్లు ఉండగా.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 35.92 శాతం ఓట్లు, బీజేపీ 34.54 శాతం, కాంగ్రెస్ 19.47 శాతం ఓట్లను దక్కించుకున్నాయి. కానీ, ఇక్కడ తొలి రెండు స్థానాల్లో నిలిచిన పార్టీలు కాకుండా.. మూడో స్థానంలో నిలిచిన కాంగ్రెస్ ఇప్పుడు రాష్ట్రంలో అధికార పార్టీగా ఉంది. దీంతో పార్లమెంటు ఎన్నికల్లో గెలుపుపై మూడు పార్టీలూ ధీమాగా ఉన్నాయి. 2019 పార్లమెంటు ఎన్నికల్లో తొలిసారి విజయం సాధించిన బీజేపీ.. ఈ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తుండగా, ఈసారి ఎలాగైనా గెలిచి తీరాలని కాంగ్రెస్ పట్టుదలతో ఉంది. మరోవైపు రాష్ట్రంలో అధికారానికి దూరమైనా.. ఆదిలాబాద్‌లో గెలవాలని బీఆర్ఎస్ శ్రమిస్తోంది.

'జల్ జంగల్ జమీన్' నినాదంతో నిజాం సర్కారును గడగడలాడించిన ఆదివాసీ అమరవీరులు కొమురం భీం, రాంజీ గోండుల గడ్డ. సీఎం రేవంత్‌రెడ్డి సెంటిమెంటుగా భావిస్తున్న జిల్లా. ఉత్తర తెలంగాణకు ముఖద్వారం. అసెంబ్లీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ కన్నా బీజేపీ ఎక్కువ సెగ్మెంట్లను గెలుచుకున్న పార్లమెంటు స్థానం కావడంతో ఆదిలాబాద్‌లో ఉత్కంఠ పోరు సాగుతోంది. మూడు ప్రధాన పార్టీలు హోరాహోరీగా తలపడుతున్నాయి.

బలపడుతున్న కమలం..

2014, 2018 అసెంబ్లీ ఎన్నికలతో పోల్చుకుంటే 2023 ఎన్నికల్లో బీజేపీకి ఓటుబ్యాంకు భారీగా పెరిగినట్లు కనిపిస్తోంది. 2019 పార్లమెంట్ ఎన్నికల కంటే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో 65,639 ఓట్లను బీజేపీ అధికంగా సాధించింది. దీంతో ఆ పార్టీ నేతలు ఈసారి కూడా గెలుపు తమదేనని ధీమాగా ఉన్నారు. ఇటీవల బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ముఖ్యనేతలు బీజేపీలో చేరడంతో మరింత ఉత్సాహం కనిపిస్తోంది. కానీ, సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావును పక్కన పెట్టి కొత్తగా పార్టీలో చేరిన మాజీ ఎంపీ గోడం నగేశ్‌కు అవకాశం ఇవ్వడంపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అభ్యర్థి తరఫున బాపురావు ప్రచారంలో పాల్గొనడకపోవడం కొంత ఇబ్బందికరంగా మారింది. అయినా.. ప్రధాని మోదీ ఇమేజ్‌తో గెలిచేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా యువత, సంప్రదాయ ఓట్లపై భారీ ఆశలు పెట్టుకుంటుంది. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉండడంతో ఎక్కువగా మరాఠా ఓటు బ్యాంకు బీజేపీకి అనుకూలంగా మారింది. అయితే ఇప్పటివరకు ఇక్కడ ఏ పార్టీ వరుసగా రెండుసార్లు గెలిచిన దాఖలాలు లేవు. 2019 ఎన్నికల్లో బీజేపీని గెలిపించినా దీర్ఘకాలిక సమస్యలను పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి.



సమరమే

రెండుసార్లూ ఒక్క సెగ్మెంట్‌లోనే గెలిచినా..

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క సెగ్మెంట్‌తోనే సరిపెట్టుకుంది. 2018లో ఆసిఫాబాద్‌లో గెలవగా, 2023లో ఖానాపూర్‌లో గెలిచింది. మిగతా ఆరు నియోజకవర్గాల్లోనూ మూడో స్థానానికే పరిమితమైంది. అయితే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక ఈ పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపురావు, కోనేరు కోనప్ప, రేఖా నాయక్, విఠల్‌రెడ్డి వంటి ముఖ్యనేతలు పార్టీలో చేరడంతో కాంగ్రెస్ ఇప్పుడు బలోపేతమైంది. ఇక తొలిసారిగా ఆదివాసీ మహిళను బరిలోకి దించింది. అభ్యర్థి ఆత్రం సుగుణకు ఆదివాసీల్లో మంచి పట్టుంది. గత కొన్నేళ్లుగా ఆమె సేవా కార్యక్రమాలు చేపడుతుండడంతో ఆ సామాజికవర్గం మద్దతు ఆమె వైపే అన్నట్లుగా ఉంది. మరోవైపు ముస్లిం మైనారిటీలు గంపగుత్తగా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడం కూడా కాంగ్రెస్‌కు అనుకూలంగా మారింది.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఏ సెగ్మెంట్ ఎవరికి!?

కాంగ్రెస్: ఖానాపూర్

బీఆర్ఎస్: ఆసిఫాబాద్, బోథ్


బీజేపీ: సిర్పూర్, ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్

2019 లోక్‌సభ ఎన్నికల్లో..

బీజేపీ	బీఆర్ఎస్	కాంగ్రెస్
3,77,374	3,18,814	3,14,238
సోయం బాపురావు	గోడం నగేశ్	రమేశ్ రాథోడ్

పురుషులు	8,04,875
మహిళలు	8.45,213
ఇతరులు	0
మొత్తం ఓటర్లు	16,50,175

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరికెన్ని ఓట్లు!?



పార్టీ	ఓట్లు
బీఆర్ఎస్	4,65,476
బీజేపీ	4,48,961
కాంగ్రెస్	2,52,285

వలసలతో వాడిన గులాబీ..

రాష్ట్రంలో అధికారానికి దూరమైన బీఆర్ఎస్.. నేతలు వరుసగా పార్టీని వీడుతుండడంతో డీలా పడుతోంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల పరంగా బీఆరెస్సే ప్రథమ స్థానంలో నిలిచినా.. సెగ్మెంట్లుగా రెండింట్లోనే గెలిచింది. ఆ పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కు.. క్యాడర్‌నే నమ్ముకుంటున్నారు. పార్లమెంట్ పరిధిలో తన సొంత నియోజకవర్గమైన ఆసిఫాబాద్‌లోనే ఆదివాసీలు అధికంగా ఉన్నారు. ఆదివాసీ ఉద్యమంలో సోయం బాపురావు తర్వాత ఆత్రం సక్కు కీలకంగా వ్యవహరించారు. దీంతో వారు తన వైపే మొగ్గుచూపుతారన్న నమ్మకంతో సక్కు ఉన్నారు. దీంతోపాటు గతంలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయన్న విశ్వాసంతో ఉన్నారు.

డాక్టర్ సునీత నర్రెడ్డికి 'ఐడీఎస్ఏ ఫెలోషిప్'

» అభినందనలు తెలిపిన 'అపోలో' జేఎండీ సంగీతారెడ్డి



హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): అపోలో ఆస్పత్రి డాక్టర్ సునీత నర్రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. అంటు వ్యాధులను ఎదుర్కోవడంలో అత్యుత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించిన ఆమెకు ప్రతిష్ఠాత్మకమైన 'ఇన్ఫెక్షియస్ డిసీజెస్ సొసైటీ ఆఫ్ అమెరికా (ఐడీఎస్ఏ) ఫెలోషిప్' లభించింది. డాక్టర్ సునీత అంకితభావం, నాయకత్వం, నైపుణ్యం, రోగుల సంరక్షణ ఐడీఎస్ఏకు ఎంతగానో దోహదపడతాయని సంస్థ అధ్యక్షుడు స్టీఫెన్ కె.స్మిత్ అన్నారు. వ్యాధుల రంగంలో డాక్టర్ సునీత చేసిన కృషికి గాను ఈ ఫెలోషిప్ దక్కిందని తెలిపారు. ఐడీఎస్ఏ ఫెలోషిప్ దక్కినందుకు ఎంతో గౌరవంగా భావిస్తున్నట్లు సునీత చెప్పారు. ఐడీఎస్ఏ ఫెలోషిప్ పొందినందుకు డాక్టర్ సునీతను అభినందిస్తున్నామని అపోలో ఆస్పత్రి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి అన్నారు. అంటు వ్యాధుల రంగంలో ఆమె అలుపెరగని కృషి, ఆరోగ్య సంరక్షణలో నిబద్ధత అపోలో ఆస్పత్రికి గర్వకారణమని ఓ ప్రకటనలో తెలిపారు.

అగ్రి, ఫార్మసీవైపు ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల మొగ్గు

» టీఎస్ఎప్‌సెట్‌లో 37 వేలకుపైగా దరఖాస్తు

హైదరాబాద్ సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): టీఎస్ఎప్‌సెట్‌లో ఇంజనీరింగ్ కన్నా వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల వైపే కొన్ని సామాజిక వర్గాల విద్యార్థులు మొగ్గు చూపారు. ఈసారి అగ్రి, ఫార్మసీ పరీక్షలకు ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ పరీక్షల కోసం మొత్తం 1,00,254 మంది దరఖాస్తు చేయగా వీరిలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు 37,205 మంది ఉన్నారు. ఇందులో ఎస్సీలు 24,203మంది, ఎస్టీలు 13,002 మంది ఉన్నారు. ఓపెన్ కేటగిరీ విద్యార్థులు 12,420మందే ఉన్నారు. వివిధ బీసీ కేటగిరీలకు చెందిన విద్యార్థుల కంటే ఎస్సీ అభ్యర్థులే ఈ కోర్సుల పట్ల ఎక్కువగా ఆకర్షితులైనట్లు తెలుస్తోంది. వ్యవసాయ, ఔషధ రంగాల్లో ప్రభుత్వ ఉద్యోగాలను సాధించడమే లక్ష్యంగా ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సులను ఎంచుకుంటున్నట్లు జేఎన్‌టీయూ ఫార్మసీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణమోహన్ తెలిపారు. ఇంజనీరింగ్ విద్యతో పోల్చితే అగ్రికల్చర్, ఫార్మసీ విద్యకు అయ్యే ఖర్చు చాలా తక్కువని పేర్కొన్నారు. ఫార్మసీ గ్రాడ్యుయేట్లకు ప్రభుత్వ (ఫార్మసిస్ట్) ఉద్యోగాలతోపాటు ఫార్మా, బీమా సంస్థలు, మెడికల్ కోడింగ్ సాఫ్ట్‌వేర్ సంస్థల్లోనూ ఉద్యోగాలు లభిస్తున్నాయన్నారు.

ఆటవిడుపుగా హరీశ్ బోట్ డ్రైవ్

» కోమటి చెరువు వద్ద ఆహ్లాదంగా గడిపిన మాజీ మంత్రి



సిద్దిపేట టౌన్, మే 12: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో బిజీబిజీగా గడిపిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆదివారం సాయంత్రం సిద్దిపేట కోమటి చెరువు వద్ద కొద్దిసేపు ఆహ్లాదంగా గడిపారు. మెదక్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రామారెడ్డి, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి కోమటి చెరువుపై నున్న సస్పెన్షన్ బ్రిడ్జిపై వాకింగ్ చేశారు. బగ్ వాహనం నడుపుతూ అభిమానులు, చిన్నారులను ఆప్యాయంగా పలకరించారు. స్వయంగా బోట్ డ్రైవ్ చేస్తూ సరదాగా గడిపారు. చెరువు కట్టపై పర్యాటకులతో కలిసి మ్యూజిక్ లైటింగ్, లేజర్ షోను తిలకించారు. హరీశ్‌రావును కలిసిన పలువురు పర్యాటకులు, అభిమానులు, చిన్నారులు ఆయనతో సెల్ఫీలు దిగారు.

తెలంగాణలో 9 సీట్లు గెలుస్తాం

» మాజీ గవర్నర్ తమిళిసై



చెన్నై, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీజేపీ 9 సీట్లకు తక్కువ కాకుండా గెలుచుకుంటుందని మాజీ గవర్నర్, దక్షిణ చెన్నై బీజేపీ లోక్‌సభ అభ్యర్థి తమిళిసై సౌందర రాజన్ ధీమా వ్యక్తం చేశారు. ఆమె ఆదివారం చెన్నై విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. తాను హైదరాబాద్, సికింద్రాబాద్, మెదక్ సహా తొమ్మిది స్థానాల్లో ఎన్నికల ప్రచారం చేశానని, ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని తెలిపారు. ఈసారి ఎన్నికల్లో కనీసం తొమ్మిది మంది బీజేపీ అభ్యర్థులు విజయం సాధిస్తారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా, ఆ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయలేక విఫలమైందని అన్నారు. ముఖ్యంగా మహిళలకు నెలకు రూ.2,500 సాయం, వృద్ధులకు రూ.4 వేల పింఛన్, అన్నదాతలకు రూ.15 వేల రైతు భరోసా, రూ.2 లక్షల వరకు రుణమాఫీ వంటివి ఇంకా అమలు చేయలేదన్నారు.

పోలింగ్‌కు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టండి

» సీఈవోకు కాంగ్రెస్ నేత నిరంజన్ వినతి

హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నెలకొన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా.. నేడు (సోమవారం) పలుచోట్ల భారీగా వర్షాలు పడే అవకాశం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని పోలింగ్ ప్రక్రియకు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలని సీఈవో వికాస్‌రాజ్‌ను కాంగ్రెస్ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన సీఈవోను కలిసి వినతిపత్రం సమర్పించారు. పోలింగ్ కేంద్రాల్లో వర్షపు నీరు చేరకుండా చూడాలని, ఓటింగ్ ప్రక్రియ ప్రారంభానికి ముందే పౌరులకు ఇబ్బంది కలుగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈవీఎంల భద్రతపై కూడా ప్రత్యేకదృష్టి సారించాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ నిబంధనలు అతిక్రమిస్తోంది: బీఆర్ఎస్

హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): పోలింగ్‌కు ఒకరోజు ముందు సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ప్రచారాన్ని చేయొద్దని, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) గడువు నిర్ణయించినా.. కాంగ్రెస్ పార్టీ నిబంధనలను అతిక్రమిస్తోందని బీఆర్ఎస్ నేత ఎన్.లలితారెడ్డి సీఈవో వికాస్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. సామాజిక మాధ్యమాలు, ఎక్స్ ఖాతాల్లో కాంగ్రెస్‌కు చెందిన అభ్యర్థులకు మద్దతుగా ప్రచారాలు చేస్తున్నారని, దాన్ని తక్షణం అడ్డుకోవాలని కోరుతూ ఆదివారం సీఈవోకు ఆమె వినతిపత్రం సమర్పించారు. ఆ పార్టీ చేస్తున్న ప్రచారాలకు సంబంధించిన రుజువులను ఎన్నికల అధికారులకు అందజేశారు.

బాబు సీఎం కావాలని నాలుక కోసుకున్నాడు..

బంజారాహిల్స్, మే 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ఓ వ్యక్తి హైదరాబాద్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో నాలుక కోసుకున్నారు. ఏపీలోని ఏలూరు జిల్లా పోలవరం మండలం, గూటల గ్రామానికి చెందిన చేడల మహేశ్ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆదివారం హైదరాబాద్ శ్రీనగర్‌కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చిన మహేశ్ బ్లేడుతో నాలుక కోసుకున్నారు. రక్తస్రావాన్ని గమనించి బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అతని జేబులో ఉన్న ఓ లేఖను స్వాధీనం చేసుకున్నారు. 2004, 2009లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎం కావాలని, 2019లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సీఎం కావాలని తాను ఇలాగే నాలుక కోసుకొని మొక్కు చెల్లించినందుకు వారు గెలిచారని, అందుకే ఇప్పుడు చంద్రబాబు సీఎం కావాలని మొక్కు చెల్లించినట్టు పేర్కొన్నారు.


చంద్రబాబు గెలవాలని పొర్లుదండాలు

తార్నాక, మే 12(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం పాటుపడే చంద్రబాబుకు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని సీబీఎన్ ఫ్యాన్స్ పొర్లుదండాలతో ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సీబీఎన్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తలారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు సతీష్ గౌడ్, గోపీ, రాము తదితరులు ఆదివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

గుర్తులో పీవీ 'హస్తం'.. కష్టాల్లో కాకా 'ఆశ్రయం'

(ఆంధ్రజ్యోతి, గల్ఫ్ ప్రతినిధి)





కాంగ్రెస్ పార్టీ అంటే మనందరికీ గుర్తొచ్చేది 'హస్తం'. వందేళ్లపైగా చరిత్ర ఉన్న ఆ పార్టీ తొలి గుర్తు ఆవు దూడ. ఎమర్జెన్సీ తర్వాత.. 1978లో ఇందిరాగాంధీ అధికారం, పార్టీ, పార్టీ కార్యాలయం అన్నిటినీ తన చేతి నుంచి కోల్పోయారు. పెద్ద నాయకులూ హ్యాండ్ ఇచ్చారు. వెంట ఉన్న కొద్ది మందితో కొత్త పార్టీ పెట్టాలనుకున్నారు. ఇరువర్గాల వివాదంతో ఆవుదూడ గుర్తును ఈసీ స్తంభింపజేసింది. 1978 ఫిబ్రవరి 2న చెయ్యి, సైకిల్, ఏనుగు గుర్తుల్లో ఏదో ఒకటి ఎంచుకోవాలని కోరింది. ఢిల్లీ నుంచి బూటాసింగ్ ట్రంక్ కాల్ చేసి ఏ గుర్తు ఎంచుకుందామని ఏపీలోని మదనపల్లె పర్యటనలో ఉన్న ఇందిరను అడిగారు. హిందీలో హాత్ అంటే చేయి, హాథీ అంటే ఏనుగు. ట్రంక్ కాల్‌లో సరిగా వినిపించకపోవడంతో.. ఫోన్‌ను పక్కన ఉన్న పీవీ నరసింహారావుకు ఇచ్చారు ఇందిర. ఆయన స్పష్టంగా అర్థం చేసుకుని చెప్పాక.. ఇందిర హస్తం గుర్తును ఎంచుకున్నారు. అయితే, సైకిల్‌ను తర్వాత నాలుగేళ్లకు తెలుగునాట ఆవిర్భవించిన టీడీపీకి, 'ఏనుగు'ను మరికొన్నేళ్లకు పుట్టిన బీఎస్పీకి కేటాయించడం.. ఈ రెండు పార్టీలు చరిత్ర సృష్టించడం వేరే సంగతి.

కాకా.. పెద్ద మనసు

కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం అంటే గుర్తొచ్చే పేరు ఢిల్లీలోని 24 అక్బర్ రోడ్. ఇందిర కష్టాల్లో ఉన్న దశలో ఆ పార్టీకి కార్యాలయమే లేని పరిస్థితి ఎదురైంది. దీంతో 24 అక్బర్ రోడ్‌లోని తన నివాసాన్ని ఇచ్చేశారు కేంద్ర మాజీ మంత్రి, దివంగత జి.వెంకటస్వామి (కాకా). తెలంగాణ నుంచి పలుసార్లు లోక్‌సభకు ఎన్నికైన ఆయన 1970ల చివరికే సీనియర్ పార్లమెంటేరియన్. దీంతో ఖాళీ స్థలంతో కూడిన పెద్ద బంగ్లాను కేటాయించారు. తొలుత కాకాకు చెప్పకుండానే ఈ బంగ్లాను ఆయన అన్న కుమారుడు, అప్పటి మేడారం ఎమ్మెల్యే ఈశ్వర్ కాంగ్రెస్ పార్టీకి అప్పగించారు. కొద్ది రోజులకు ఢిల్లీకి వచ్చిన వెంకటస్వామికి ఈ సంగతి తెలిసినా.. "నాకు పదవులు, హోదా అంతా ఇందిర ఇచ్చిన భిక్ష. పార్టీ కోసం బంగ్లాను వదులుకోవడంతో నా జన్మ ధన్యమైంది" అని సంతోషపడ్డారు. ప్రస్తుతం కాకా ఇద్దరు కుమారులు ఎమ్మెల్యేలుగా ఉండగా, ఆయన మనవడు వంశీకృష్ణ పెద్దపల్లి నుంచి ఎంపీగా పోటీ చేస్తున్నారు. ఇది కాకా ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గమే కావడం గమనార్హం.

తినేదంతా విషమే!

భారత్ ఎగుమతి చేస్తున్న ఆహార ఉత్పత్తులపై ఈయూ సంస్థ నివేదిక

- 527 రకాల్లో ఇథిలీన్ ఆక్సైడ్.. 400 రకాలు పూర్తిగా అసురక్షితం
- 276 ఉత్పత్తులకు తిరస్కరణ నోటీసులు
- కాడ్మియం, పురుగుమందులు, సీసం, పాదరసం అవశేషాల గుర్తింపు
- కిడ్నీ, మెదడు, నాడీవ్యవస్థకు ముప్పు.. క్యాన్సర్ వచ్చే ప్రమాదం
- సేంద్రియ ఉత్పత్తులూ కలుషితమే



హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆహార కల్తీ విశృంఖలంగా కొనసాగుతోంది. మార్కెట్లో అందుబాటులో ఉన్న మసాలా పొడుల్లో క్యాన్సర్ ప్రేరేపిత రసాయనాలు ఉన్నాయన్న విషయం ఇటీవలే బయటకొచ్చింది. దానిని మర్చిపోకముందే మరో హెచ్చరిక వెలువడింది. విదేశాలకు భారత్ ఎగుమతి చేస్తున్న 400 రకాల ఆహార ఉత్పత్తులు అత్యంత కలుషితమైనవని 'ది ర్యాపిడ్ అలర్ట్ సిస్టమ్ ఫర్ ఫుడ్ అండ్ ఫీడ్' (రాస్ఫ్) అనే సంస్థ ప్రకటించింది. ప్రపంచంలోనే ఆహార భద్రతలో అత్యంత ఉన్నత ప్రమాణాలు పాటించే సంస్థగా రాస్ఫ్‌కు పేరుంది. యూరోపియన్ యూనియన్ (ఈయూ) భాగస్వామ్య దేశాలకు ఈ సంస్థనే ఆహార భద్రతకు సంబంధించి ప్రమాణాలను నిర్దేశిస్తుంది. ఈ రంగంలో ఆయా దేశాల మధ్య సమాచార మార్పిడికి వారధిగా కూడా పని చేస్తోంది. 2019-2024 మధ్య కాలంలో మన దేశం నుంచి ఎగుమతి అయిన ఆహార ఉత్పత్తుల్లో ప్రాణాంతక కాలుష్య అవశేషాలున్నాయని రాస్ఫ్ గుర్తించి.. తాజాగా ఒక నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం భారత ఆహార పదార్థాలలో పరిమితికి మించి పాదరసం, కాడ్మియం, పురుగు మందుల అవశేషాలు, ఫంగిసైడ్స్ (శిలీంద్ర నాశిని) వంటివి ఉన్నాయి. వీటితో శరీరంలోని పలు అవయవాలు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. భారత్ నుంచి ఎగుమతి అవుతున్న మొత్తం 527 రకాల ఆహార ఉత్పత్తుల్లో ఇథిలీన్ ఆక్సైడ్ ఉందని, 400 రకాలు ఏమాత్రం సురక్షితం కావని ఈ నివేదిక తేల్చింది. 276 రకాల ఉత్పత్తులను తిరస్కరిస్తూ బోర్డర్ రిజెక్షన్ నోటీసు కూడా జారీ చేయటం విశేషం. 14 రకాల ఉత్పత్తుల్లో కిడ్నీ, మెదడు, నాడీ వ్యవస్థకు హాని కలిగించే సీసం వంటి లోహాలు ఉన్నట్లు రాస్ఫ్ నివేదికలో పేర్కొన్నారు. శిలీంద్రనాశిని అయిన ట్రైసైక్లోజోల్‌తో క్యాన్సర్ ముప్పు వాటిల్లే ప్రమాదం ఉండటంతో దానిని యూరోపియన్ దేశాల్లో ఇప్పటికే నిషేధించారు. అటువంటి ప్రమాదకర ట్రైసైక్లోజోల్ అవశేషాలు 19 రకాల భారతీయ ఉత్పత్తుల్లో ఉన్నాయని రాస్ఫ్ నివేదికలో వెల్లడించారు. ఒకటికి మించి పురుగుమందులు, శిలీంద్ర నాశిని అవశేషాలున్న ఉత్పత్తులు 52కు పైగా ఉన్నాయని, కొన్నింట్లోనైతే ఐదుకు మించి అవశేషాలున్నాయని తెలిపారు.

వీటికి తిరస్కరణ

ఇథిలీన్ ఆక్సైడ్ అవశేషాలు ఉన్నందున రాస్ఫ్ తిరస్కరించిన భారతీయ ఆహార ఉత్పత్తులు..

ఉత్పత్తి	రకాలు
నట్స్, నట్ ప్రొడక్ట్స్, సీడ్స్	313
మూలికలు, మసాలా దినుసులు	60
డైయాటిక్ ఫుడ్స్, ఫోర్టిఫైడ్ ఫుడ్స్	48
ధాన్యం, బేకరీ ఉత్పత్తులు	26
పళ్లు, కూరగాయలు	10
ఇతర ఆహార ఉత్పత్తులు	34

సేంద్రియ ఉత్పత్తులదీ అదే పరిస్థితి

సేంద్రియ ఉత్పత్తుల పేరిట భారత్ ఎగుమతి చేసిన ఆహార పదార్థాల్లోనూ కాలుష్యాలు ఉన్నట్లు తేలింది. 11 సేంద్రియ ఉత్పత్తులు కలుషితమైనవని రాస్ఫ్ నివేదిక వెల్లడించింది. మనుషుల్లో అతిసారానికి కారణమయ్యే సాల్మోనెల్లా టైఫోసా అవశేషాలను అశ్వగంధ, శతావరి, నువ్వులు లాంటి ఉత్పత్తుల్లో గుర్తించినట్లు తెలిపింది. ధనియాలపొడిలో క్లోరోఫైరిఫాస్ అవశేషాలున్నాయని, ఇది పిల్లల్లో నాడీవ్యవస్థ, శ్వాసకోశ సమస్యలకు కారణమవుతుందని, పునరుత్పత్తి ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొంది. కాగా ఈ నివేదికపై అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ కానీ, ఎగుమతులకు బాధ్యత వహించే కేంద్ర పరిశ్రమల శాఖ కానీ స్పందించలేదు.

రిలింక్విష్‌మెంట్ అమలు చేద్దామా?

» గురుకుల ఉద్యోగాలపై సర్కారు ఆలోచన

హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ఒకేసారి రెండు అంతకంటే ఎక్కువ ఉద్యోగాలకు ఎంపికైన వారు స్వచ్ఛందంగా వదులుకునే ఉద్యోగాలను మెరిట్ జాబితాలో తర్వాతి అభ్యర్థులకు కేటాయించే విధానాన్ని రిలింక్విష్‌మెంట్ అంటారు. రాష్ట్రంలో చేపట్టిన గురుకుల ఉద్యోగాల భర్తీలో ఈ రిలింక్విష్‌మెంట్ విధానం అందుబాటులో లేకపోవడంతో బ్యాక్‌లాగ్ భయం పట్టుకుంది. గురుకుల నియామకాలకు సంబంధించి దాదాపు రెండు వేల పోస్టులు బ్యాక్‌లాగ్ జాబితాలో చేరే అవకాశం కనిపిస్తోంది. నియామక ప్రక్రియలో రిలింక్విష్‌మెంట్ విధానం అందుబాటులో లేకపోవడం, పోస్టుల భర్తీ ప్రక్రియ ఆరోహణ, అవరోహణ (మొదట ఎగువ స్థాయి, తరువాత దిగువ స్థాయి పోస్టులను భర్తీ)విధానంలో చేపట్టకపోవడమే ఇందుకు కారణం. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల పరిధిలోని వివిధ విభాగాల్లోని 9,210 పోస్టుల భర్తీకి గురుకుల బోర్డు పరీక్ష నిర్వహించింది. అయితే, ఎంపికైన అభ్యర్థుల్లో చాలామంది ఒకటికి మించి ఉద్యోగాలకు అర్హత సాధించారు. గురుకుల బోర్డు ఇప్పటిదాకా 8,304 పోస్టులకు నియామక పత్రాలు జారీ చేసింది. అయితే, ఒకటికి మించి ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు ఏ ఉద్యోగాన్ని వదులుకుంటారనేది పోస్టింగ్ ఆర్డర్ జారీ తర్వాతే స్పష్టత వస్తుంది. అభ్యర్థులు వదులుకునే పోస్టులు రెండు వేలకు పైగా ఉన్నట్లు తెలుస్తోంది. రిలింక్విష్‌మెంట్ లేకపోవడంతో ఈ పోస్టులన్నీ బ్యాక్‌లాగ్ జాబితాలోకి వెళ్లనున్నాయి. మరోపక్క, గురుకులాల్లో ఖాళీ ఏర్పడిన పోస్టులను మెరిట్ ప్రకారం భర్తీ చేయాలంటూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై స్పందించిన హైకోర్టు బ్యాక్‌లాగ్‌ల భర్తీలో పిటిషనర్ల నియామకాన్ని పరిశీలించాలని ప్రభుత్వానికి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. బ్యాక్‌లాగ్ పోస్టులకు మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయాలంటే అందుకు భారీగా కసరత్తు చేయాలి. ఈ నేపథ్యంలో మెరిట్ ప్రకారం భర్తీ చేస్తే ఎలా ఉంటుంది ? రిలింక్విష్‌మెంట్ అమలు చేయాలంటే తీసుకోవాల్సిన చర్యలేంటి? అనే అంశాలపై ప్రభుత్వం ప్రస్తుతం ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో జూన్ 6 తర్వాతే దీనిపై నిర్ణయం వెలువడే అవకాశముంది.

బెట్టింగ్‌కు బానిసైన కొడుకు.. ప్రాణం తీసిన తండ్రి

» రూ.2 కోట్లు పోగొట్టడమే కాక మిగిలిన ఆస్తుల విక్రయానికి యత్నం

» విసిగిపోయి తల పగలగొట్టిన తండ్రి

చిన్నశంకరంపేట, మే 12: ఆన్‌లైన్ బెట్టింగ్ భూతం కుటుంబాలను నాశనం చేస్తోంది. బెట్టింగ్‌కు బానిసై రూ.2 కోట్ల వరకు పోగొట్టిన కొడుకును కన్నతండ్రే హత్య చేసిన ఘటన వెలుగు చూసింది. బెట్టింగ్ జోలికి వెళ్లవద్దని, పద్ధతి మార్చుకోవాలని ఎన్నిసార్లు చెప్పినా మాట వినకపోవడంతో విసిగిపోయిన తండ్రి రాడ్డుతో తల పగలగొట్టి కొడుకు ప్రాణం తీశాడు. మెదక్ జిల్లాలో జరిగిన ఈ ఘటనలో చిన్నశంకరంపేట పంచాయతీ పరిధి బాగిర్తిపల్లి గ్రామానికి చెందిన రెడ్డి ముఖేష్‌కుమార్(28) కన్నతండ్రి చేతిలోనే హత్యకు గురయ్యాడు. బాగిర్తిపల్లికి చెందిన రెడ్డి ముఖేష్‌కుమార్ రైల్వే ఉద్యోగి. ముఖేష్ భార్య ప్రస్తుతం గర్భిణి కాగా ఆ దంపతులకు ఇప్పటికే ఓ కుమార్తె ఉంది. అయితే, బెట్టింగ్, జల్సాలకు అలవాటు పడిన ముఖేష్ రూ.2 కోట్ల దాకా పోగొట్టుకున్నాడు. ఫలితంగా మేడ్చల్‌లో తమకు ఉన్న స్థిరాస్తులను అమ్మేశాడు. విషయం తెలుసుకున్న తండ్రి సత్యనారాయణ(రిటైర్డ్ రైల్వే ఉద్యోగి) తీరు మార్చుకోవాలని కొడుకుని చాలాసార్లు మందలించాడు. పద్ధతి మార్చుకోని ముఖేష్ మరోసారి ఆస్తుల విక్రయానికి యత్నించాడు. తనకు సహకరించాలని తల్లిదండ్రుల మీద కూడా దాడి చేసేవాడు. దీంతో విసిగిపోయిన సత్యనారాయణ శనివారం రాత్రి ముఖేష్ ఇంట్లో నిద్రిస్తుండగా ఓ రాడ్డుతో తలపై కొట్టాడు. దీంతో ముఖేష్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

గ్రామ పంచాయతీలను నడిపేదెట్లా?

» నిధుల్లేక పంచాయతీల్లో పేరుకుపోతున్న సమస్యలు

» ఆందోళనలో పంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు

హైదరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీలు నిధుల సమస్యతో కొట్టుమిట్టాడుతున్నాయి. ముఖ్యంగా చిన్న గ్రామ పంచాయతీల ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించేందుకు ట్రాక్టర్లలో డీజిల్ పోయడానికి కూడా డబ్బుల్లేని దుస్థితి. పంచాయతీ భవనాల కరెంటు బిల్లులు కట్టడానికి కూడా నిధుల్లేవని పంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒత్తిడికి లోనవుతున్నారు. రెండేళ్లుగా రాష్ట్ర ఆర్థిక సంఘం(ఎస్ఎఫ్‌సీ) నిధులను సక్రమంగా పంపిణీ చేయకపోవడంతో గ్రామ పంచాయతీల్లో తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ కింద ప్రతి నెలా రూ.230 కోట్లకు పైగా విడుదల చేయాల్సి ఉంటుంది. 2022 ఆగస్టు వరకు పంచాయతీల ఖాతాల్లో నిధులు జమ చేసిన రాష్ట్ర సర్కారు.. ఆ తర్వాత పెండింగ్ పెడుతూ వస్తోంది. దీంతో, మొత్తంగా గ్రామపంచాయతీలకు ఎస్ఎఫ్‌సీ నిధులు రూ.4,600 కోట్లు రావాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు రావాల్సిన నిధులు రాకపోవడం, ఇతర ఆదాయ వనరుల్లేక పోవడంతో గ్రామాల్లో కనీస సమస్యలను కూడా పరిష్కరించే పరిస్థితి లేకుండా పోయిందని సంబంధిత విభాగాలు చెబుతున్నాయి.

పాలకవర్గాల ఎన్నిక తర్వాతే నిధులు

పంచాయతీలకు సక్రమంగా నిధులు విడుదల చేయకపోయినా పాలకవర్గాలు ఉన్నపుడు సర్పంచులు ఏదో విధంగా డబ్బులు సర్దుబాటుచేసి పనులు ఆగకుండా చూసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సర్పంచుల పదవీకాలం పూర్తికావడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 2 నుంచి పంచాయతీల్లో ప్రత్యేక పాలన ప్రారంభమైంది. కొన్ని చోట్ల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పనులు నిలిచిపోకుండా ఉండేందుకు డబ్బులు సర్దుబాటు చేసినప్పటికీ.. నెలల తరబడి పంచాయతీలను ఎలా నిర్వహించాలన్న దానిపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా ప్రత్యేక అధికారుల పాలనలో రావని, మళ్లీ పంచాయతీల పాలకవర్గాలను ఎన్నుకొన్న తర్వాతే కేంద్రం నిధులు వస్తాయని పంచాయతీరాజ్ శాఖకు చెందిన అధికారి ఒకరు తెలిపారు. గతంలో ఎస్ఎఫ్‌సీ నిధులు రాకున్నా.. కేంద్రం ఇచ్చే నిధుల ద్వారా పాలకవర్గాలు గ్రామ పంచాయతీలను నెట్టుకువచ్చాయి. ఇప్పుడు రాష్ట్రం, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఏవీ రాకపోవడంతో ఆదాయ వనరుల్లేని గ్రామాల పరిస్థితి దయనీయంగా మారింది.

వేతనాల కోసం కార్మికుల ఒత్తిడి

గ్రామ పంచాయతీల్లో నిధుల్లేక చాలా చోట్ల సిబ్బందికి వేతనాలు చెల్లించడం లేదు. ఫలితంగా కార్మికులు పనులు చేయడం లేదు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో ప్రతి 500 మంది జనాభాకు ఒక మల్టీపర్పస్ కార్మికుడిని నియమించే అవకాశం కల్పించింది. వీరు విద్యుత్ లైట్లు, పారిశుద్ధ్యం, మురుగు కాల్వల్లో పూడిక తొలగింపు, చెత్త ట్రాక్టర్ నడిపించడం, మంచినీటి సరఫరా వంటి పనులు చేయాల్సి ఉంటుంది. వీరికి మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. ఇక, మేజర్ పంచాయతీల్లో అవసరమైనంత సంఖ్యలో పారిశుద్ధ్య సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పనులు నిలిచిపోకుండా ఉండేందుకు ప్రత్యేకంగా కూలీలను నియమించుకుంటే.. వారికి డబ్బులు చెల్లించడం కష్టంగా ఉంటోందని, ఇప్పటికే బకాయి వేతనాల కోసం కార్మికులు తమపై ఒత్తిడి తెస్తున్నారని ప్రత్యేకాధికారులు చెబుతున్నారు.

అమెరికాలో జలపాతంలో మునిగి ఇద్దరు తెలంగాణ విద్యార్థుల మృతి



రాకేష్‌రెడ్డి (ఫైల్)

ఖమ్మం, మే 12(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య కోసం రాష్ట్రం నుంచి అమెరికా వెళ్లిన ఇద్దరు యువకులు డిగ్రీ పట్టా అందుకున్న వారం రోజులకే అక్కడి ఓ జలపాతంలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. అమెరికాలోని అరిజోనా ఫాసిల్ క్రీక్ జలపాతం వద్ద ఏప్రిల్ 8న జరిగిన ఘటనలో ఖమ్మంకు చెందిన లక్కిరెడ్డి రాకేష్ రెడ్డి(23), హైదరాబాద్‌కు చెందిన రేపాల రోహిత్ మణికంఠ(25) ప్రాణాలు కోల్పోయారు. ఖమ్మంలోని మాంటిస్సోరి, తెలంగాణ నారాయణ పాఠశాలల డైరెక్టర్లలో ఒకరైన చంద్రశేఖర్‌రెడ్డి దంపతుల ఏకైక కుమారుడు రాకేష్‌రెడ్డి బీటెక్ పూర్తి చేసి ఉన్నత విద్యకు అమెరికా వెళ్లాడు. అక్కడి అరిజోనా వర్సిటీలో ఎంఎస్ పూర్తి చేసిన రాకేష్‌రెడ్డి వారం రోజుల క్రితం డిగ్రీ పట్టా కూడా అందుకున్నాడు. ఈ క్రమంలో రాకేష్ రెడ్డి తన స్నేహితులతో కలిసి ఏప్రిల్ 8న అరిజోనా ఫాసిల్ క్రీక్ జలపాతానికి వెళ్లాడు. అక్కడ రోహిత్ మణికంఠ, రాకేష్ జలపాతంలో మునిగిపోయారు. మరుసటిరోజు వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న చంద్రశేఖర్ రెడ్డి దంపతులు తీవ్ర శోకంలో మునిగిపోయారు. రోహిత్ కుటుంబ వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, రాకేష్ రెడ్డి, మణికంఠ మృతదేహాలను స్వదేశానికి తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో నటి పవిత్ర మృతి

» అదుపు తప్పి డివైడర్‌ను.. అవతలి లేన్‌లో బస్సును ఢీకొట్టిన కారు

» డ్రైవర్, మరో ఇద్దరికి గాయాలు

» భూత్పూర్ వద్ద ఘటన

» త్రినయని, నిన్నే పెళ్లాడతా సీరియళ్లతో పవిత్రకు గుర్తింపు



పవిత్ర (ఫైల్)

భూత్పూర్, మే 12: మహబూబ్‌నగర్ జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రముఖ తెలుగు, కన్నడ నటి పవిత్ర జయరామ్ (42) మరణించారు. ఆమె ప్రయాణిస్తున్న కారు వేగంగా డివైడర్‌ను ఢీకొట్టి.. దాని పైనుంచి అవతలివైపు రోడ్డు మీదకు దూసుకెళ్లింది. ఆ లేన్‌లో వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టి నుజ్జయింది. పవిత్రది కర్ణాటక రాష్ట్రం మాండ్య జిల్లా ఉమ్మదహల్లి గ్రామం. ఆమెతో పాటు పినతల్లి కుమార్తె ఆపేక్ష, మరో నటుడు చంద్రకాంత్ (చందు), డ్రైవర్ శ్రీకాంత్‌తో కలిసి శనివారం సాయంత్రం కారు (స్కార్పియో)లో బెంగళూరు నుంచి హైదరాబాదుకు బయలుదేరారు. కారు భూత్పూర్ మునిసిపాలిటీ పరిధిలోని శేరిపల్లి (బీ) వద్ద 44వ నంబరు జాతీయ రహదారిపై అదుపు తప్పి డివైడర్‌ని బలంగా ఢీకొట్టింది. దాని మీదుగా రోడ్డు అవతలివైపు పడి హైదరాబాద్ నుంచి వనపర్తి వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ప్రమాదంలో పవిత్ర అక్కడికక్కడే మృతిచెందారు. చంద్రకాంత్, ఆపేక్ష, శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పవిత్ర 'త్రినయని' తెలుగు సీరియల్‌లో తిలోత్తమ అనే నెగటివ్ రోల్‌తో గుర్తింపు తెచ్చుకున్నారు. నిన్నే పెళ్లాడతా, స్వర్ణ ప్యాలెస్, కోడళ్లూ మీకు జోహార్లు సీరియళ్లలో ప్రతినాయిక పాత్రలతో మెప్పించారు. 'జోకలి' అనే కన్నడ సీరియల్‌తో నట జీవితం ప్రారంభించారు. ఆ తర్వాత 'రోబో ఫ్యామిలీ', 'గాలి పటా', 'రాధారమణ్', 'విద్యా వినాయక' తదితర కన్నడ సీరియళ్లలో మంచిపేరు తెచ్చుకున్నారు. చిన్నతనంలోనే పెళ్లి చేసుకున్న ఆమె ప్రస్తుతం భర్తకు దూరంగా ఉంటున్నారు. ఆమెకు కుమారుడు ప్రజ్వల్, కుమార్తె ఉన్నారు. కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

ఆ 12 మంది నక్సల్స్ కాదు!

» తునికాకు సేకరణకు వెళ్లిన కూలీలు

» పోలీసులు జరిపింది ఫేక్ ఎన్‌కౌంటర్

» ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌పై స్థానికులు

చర్ల, మే 12: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా గంగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పిడియా గ్రామంలో శుక్రవారం పోలీసులు జరిపిన ఎన్‌కౌంటర్ ఫేక్ అని స్థానిక గ్రామస్థులు, హక్కుల కార్యకర్తలు ఆరోపించారు. 12 మంది నక్సల్స్‌ను ఎదురు కాల్పుల్లో హతమార్చామని, వారందరిపై రివార్డులు ఉన్నట్లు దంతేవాడ రీజియన్ డీఐజీ కమ్లోచన్ కశ్యప్ శుక్రవారం వెల్లడించిన విషయం తెలిసిందే. అయితే వారంతా నక్సల్స్ కాదని, తునికాకు సేకరణకు అడవులకు వెళ్లిన కూలీలని స్థానికులు అవ్లమ్ బుద్రీ, రాకేశ్ అవ్లమ్, మరికొందరు గ్రామస్థులు, హక్కుల కార్యకర్త సోనీ సోరి ఆరోపించారు. కొందరు గ్రామస్థులను పోలీసులు ముందు రోజు తమ వెంట తీసుకెళ్లారని, వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పోలీసు కాల్పుల్లో చనిపోయినవారంతా పిడియా, ఐత్వార్ గ్రామాలకు చెందిన తునికాకు కూలీలని వివరించారు. ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సీఎం భూపేశ్ భగేల్ కూడా ఈ విషయంపై ప్రభుత్వం తీరును తీవ్రంగా విమర్శించారు. బీజేపీ సర్కారు గిరిజనులపై వేధింపులను మానుకోవాలని, ఫేక్ ఎన్‌కౌంటర్ ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తపడాలని డిమాండ్ చేశారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.*